శ్రీ

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక

Journal of the Telugu Academy
KAKINADA



దేశ భాషలందు తెలుగు లెస్స

సంపుటము ౫౨ — Vol 52

సంచికలు ౧-౨ — Parts I & II

ఆంధ్ర సాహిత్య పరిషత్తు

వ్యవస్థాపకులు:

శ్రీ జయంతి రామయ్యగారు

ప్రతిష్ఠాపకులు:

శ్రీ శ్రీ శ్రీ రావు వేంకటకుమార మహీపతి సూర్యరావు బహద్దరువారు సి. బి. ఇ., డి. లిట్, పిఠాపురము మహారాజావారు

శ్రీ శ్రీ శ్రీ వేంకటగిరి మహారాజావారు

శ్రీ శ్రీ శ్రీ బొబ్బిలి మహారాజావారు

ఉద్ధారకులు:

శ్రీ రాజా వేంకటాద్రి అప్పారావు బహద్దరువారు,

జమీందారు, ఉయ్యూరు ఎస్టేటు

శ్రీ

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక

Journal of the Telugu Academy
KAKINADA
సంవత్సరము చందా రు 3—0—0.

సంపుటము ౫౨ శోభకృత్తు చైత్ర-ఆషాఢములు సంచికలు ౧-౨
Vol 52 1963 ఏప్రిల్ & జూలై Parts I & II

విషయసూచిక

స్వ వి ష య ము.

ఈ శోభకృద్వత్సర చైత్రమాసముతో నీ పరిషత్పత్త్రిక నేఁబదియొక్క-యేండ్లు గడచి యేఁబది రెండవ వత్సరము ప్రారంభ మైనది. ఆంధ్రసాహిత్యపరిషత్సంస్థ, తదనుబంధముగ వెలువడుచున్న యీపత్త్రికయు నిన్ని సంవత్సరములనుండియు గ్రాంథికభాషోద్ధార మునకు శక్తికొలఁది కృషి నెఱపుచునేయున్నది. ఈనాఁడు వివిధ విశ్వ విద్యాలయములందును ప్రాచీనాంధ్ర సాహిత్యగ్రంథములపై విమర్శ నములు సాగించుచున్న విద్యార్థులు ఆంధ్రసాహిత్య పరిషత్పుస్తక భాండాగారమందున్న ముద్రితాముద్రిత గ్రంథముల సాహాయ్య మున విషయసేకరణము గావించుచున్నారు. అట్టివారికి పరిషత్సంస్థ యందలి గ్రంథసంచయమేగాక, పరిషత్పక్షమున పండిత సాహాయ్య మునఁ బ్రచురింపఁబడిన శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువు విశేషసాహా య్యము నొసఁగుచున్నది. ప్రాచీన వాఙ్మయములో నేయే శబ్దమే యే యర్థమున నే శతాబ్ది మొదలుగ నుపయుక్తమైనదో తెలియుటకు శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువు పరమసాధనమై వెలయుచున్నది. ఈవిధముగ నాంధ్రభాషాచరిత్రమును గాని, సారస్వతచరిత్రమును గాని వ్రాయఁదలపెట్టినవారికి నీ నిఘంటు వత్యంతోపకారియై వెలయుచు న్నది. ఇట్టి యీనిఘంటువునఁ గొఱవడియున్న 'శ ష స హ' అను నాలుగక్షరములకు సంబంధించిన భాగమును ప్రకటించి, గ్రాంథికాంధ్ర భాషోపాసనాపరుల యభిమతము నీడేర్చుటకుఁ బరిషత్తు కృషి చేయు చున్నది. భగవంతుని యనుగ్రహముకూడివచ్చిన నచిరకాలమున నావని పూర్తికాఁగలదని భావించుచున్నాము. లోకాస్సమస్తా స్సుఖి నోభవన్తు.

ఇట్లు,

సంపాదకుఁడు.

తిరుపతి వేంకటేశ్వరస్వామి విగ్రహముగూర్చిన పరిశోధనము.

ఆంగ్లవ్యాసరచయిత :— వీరశైవేతిహాసప్రవీణ శ్రీ బి. వి. శ్రీనివాసరావుగారు M. A. M. R. A. S. (Ceylon) F. R. A. S. (London) తుముకూరు, మైసూరుగ్రామము, గుల్బర్గా శ్రీశరణ బసవేశ్వర కళాశాలా చరిత్రోపన్యాసకులు (Ex.)

అనువాదకులు:—శ్రీ బండారు తమ్మయ్య.

తిరుపతిక్షేత్రమునఁ బూర్వము స్థాపితమయినది వీరశైవుఁడగు వీరభద్రుని విగ్రహమే. అది రామానుజమతీయులచేఁ దరువాత శ్రీనివాసమూర్తి (వైష్ణవవిగ్రహము)గామార్చివేయఁబడిన విషయము నుగూర్చి పరిశోధనపూర్వకమగు నంశము లీ వ్యాసమున నిరూపింపఁబడినవి.

రామానుజమతావలంబకులయిన సాళ్వవంశ రాజులు, సంగమ వంశ్యుల (వీరశైవులు) విజయనగరసామ్రాజ్యము నాక్రమించి పరిపాలించినకాలములో ప్రజలలో మత విప్లవమునకు రక్తపాతమునకు స్థానములేకుండ, చల్లచల్లగానే పయిమార్పును గావించియుండిరి. వీరశైవరాజ్యములో నీ రామానుజమతీయులు క్రీ. శ. 1419-1491 మధ్య కాలములో నీయుద్యమవిషయమున నిపుణత్వముతో, కుతంత్రములతో, స్వతంత్రముగఁ దమ యభిలాషమును సాధించికొనినారు. త్రిపుండాంకితమయిన వీరభద్రవిగ్రహము, ఊర్ధ్వపుండ్రాంకితమయిన వేంకటరమణమూర్తిగాఁ బరిణతి నొందినది.

వీరశైవమతావలంబకులయిన సంగమవంశరాజులకు రామానుజమతీయులైన వైష్ణవరాజులతోఁ గలిగిన మతాంతర వైవాహిక సంబంధములు, బాంధవ్యములు ముఖ్యముగా నిందుకుఁ గారణములయి ప్రజలలో బహిరంగముగ విప్లవము కలుగకుండఁగనే తిరుపతిక్షేత్రమందలి వీరశైవ విగ్రహమును శ్రీనివాసమూర్తిగా మార్పుచేయఁ

గల్గినవి. దక్షిణ హిందూ దేశచరిత్రములో క్రీ.శ. 1419-1491 మధ్య కాలమున నీ తిరుపతి దేవాలయమందలి వీరభద్ర విగ్రహము వైష్ణవ విగ్రహముగా మార్పు నొందుటకుఁ గారణమయిన వాస్తవచరిత్ర మీఁకింద నుదాహరించిన ప్రమాణికాధారములను బాగుగాఁ బరిశీలించినఁ బరిశోధకులకు విమర్శకులకు వ్యక్తము కాఁగలదు.

(1) కన్నడమున విరూపాక్షపండితుఁడు (క్రీ. శ. 1584) రచించిన చెన్నబసవపురాణము గూర్చి అర్. నరసింహాచార్యులుగారు రచించిన కర్ణాటకవిచరిత్ర ద్వితీయభాగము పుటలు3 07-310 లో నున్న విషయములు.

(2) విజయనగరసామ్రాజ్యమును స్థాపించిన సంగమరాజులు, అసలు కురుబ (గొల్ల) వంశమునకుఁ జెందినవారు. కర్ణాటకవిచరిత్ర ద్వితీయభాగము పుటలు 461-465 లలో తిరుమలరాయలు (క్రీ. శ. 1645-1706, గూర్చి వ్రాసిన విషయములు.

(3) సాళ్వవంశ రాజులు, వారి వైష్ణవమతమునుగూర్చిన వివరములకు డాక్టరు ఎస్. కృష్ణస్వామి అయ్యంగారు రచించిన Historical Insciptions of Sonthern InJia (దక్షిణ హిందూదేశ చారిత్రిక శాసనములు) అను గ్రంథమందలి వంశానుక్రమణపట్టికలను, మైసూరు విశ్వవిద్యాలయ పక్షమున వెలువడిన ప్రబుద్ధకర్ణాటక వృష సంవత్సర దీపావళిసంచిక 10 పుటలో, పదునేనవ శతాబ్ది యందలి కన్నడవాఙ్మయమునుగూర్చి ధార్వారులోని కర్ణాట విశ్వవిద్యాలయోపన్యాసకులు, ప్రొఫెసరు S. S. Malavad గారు ప్రకటించిన వ్యాసము చూడఁదగును.

(4) సాళ్వరాజుల ప్రియదైవతము. అహోబలక్షేత్రమందలి నృసింహస్వామి - రాజనాథడిండిమపండితుని సాళ్వాభ్యుదయము (సంస్కృతకావ్యము) పుట 60 చూడుఁడు. డాక్టరు ఎస్. కృష్ణస్వామి

అయ్యంగారు రచించిన Ancient India (ప్రాచీనభారతదేశము) South Indian History and Culture (దక్షిణ హిందూదేశ చరిత్ర, సంస్కృతి) అను గ్రంథము ద్వితీయ సంపుటములో విజయ నగరరాజ్యమునుగూర్చి తెలియవచ్చిన స్వల్ప చరిత్రాంశములు (A Little known chapter of Vijayanagar History) అను అధ్యాయము చూడుఁడు.

(5) క్రీ. శ. 1419 రెండవ దేవరాయలకు (ప్రౌఢదేవరాయలు) వీరశైవాగమసారసంపన్న" అను బిరుద మీయఁబడినది. 1928 సంవత్సరము మైసూరు ఆర్కియాలజీరిపోర్టు 91 పేజి నెం. 92 శాసనము, మైసూరు విశ్వవిద్యాలయము ప్రొఫెసరు డాక్టరు ఎస్. శ్రీకంఠశాస్త్రిగారు రెండవ దేవరాయలుగూర్చి 1928 మే నెల ఇండియను అంటిక్వేరీ 57 వాల్యూములో వ్రాసిన వ్యాసము.

(6) క్రీ. శ. 1430 రెండవ దేవరాయలు చామరసు వలన వీరశైవదీక్ష నొందెను. కర్ణాటకవి చరిత్ర ద్వితీయ భాగము 64,65 పుటలు. వైష్ణవ రామానుజమతీయుఁడైన సాళ్వతిప్పదేవుఁడు, వీరశైవుఁడయిన రెండవ దేవరాయల జ్యేష్ఠ సోదరి నారమ్మను వివాహమయ్యెను. విజయనగరసామ్రాజ్య రాజవంశానుబంధమునుగురించి కర్ణాట విశ్వవిద్యాలయము ప్రొఫెసరు డాక్టరు B. A. Salatore గారి వ్యాసము పుటలు 415, శ్రీ కృష్ణస్వామి అయ్యంగారు విజయనగర చరిత్రాధారములు (Sources of Vijayanagar History) పుట 62, ఇండియను అంటిక్వెరి 52 వాల్యూము 1-12 భాగములు 7 పేజి, 1913-14 మైసూరు ఆర్కియాలజీరిపోర్టు 47 పుట చూడుఁడు.

(7) క్రీ. శ. 1434 ప్రౌఢదేవరాయలమంత్రి లక్కణామాత్యుఁడు, దేవరాయల బావమఱఁది వైష్ణవుఁడు నయిన సాళ్వతిప్పదేవునకు కోలారుజిల్లాలోని తేకల్ (మాలూరు) పరగాణాను వప్ప

గించను. పైని పేర్కొనిన డాక్టరు B. A. Salatore గారివ్యాసము 7 పుట, 1928 మే ఇండియను ఆంటిక్వేరి 57 వాల్యూము పుటలు 77-85 చూడుఁడు.

(8) 1442 A. D:—చంద్రగిరి శాసనములో తిరుపతి దేవస్థానము శైవమునుండి వైష్ణవములోనికి మార్పునొందుచున్న ప్రారంభదశనుగూర్చిన ప్రస్తావనగలదు. 1933 ఏప్రియలు నెల Mystic Society త్రైమాసికసంచిక 23 వాల్యూము 477 పుట చూడుడు.

(9) క్రీ. శ. 1444:— తిరుపతి దేవస్థానము పూర్తిగా వైష్ణవగ్రస్తమయ్యెను. అప్పుడు విజయభూపతి కుమారుడు శ్రీగిరిభూపాలుఁడు చంద్రగిరి గవర్నరుగా నుండెను. పైనిజెప్పిన త్రైమాసిక సంచిక 476 పుట చూడుఁడు.

(10) ప్రౌఢదేవరాయలు క్రీ. శ. 1446 మెయి నెల 26 తేదీని నిర్యాణమొందెను. ఎపిగ్రాఫియా కర్నాటికా 2 వాల్యూము శ్రావణబెళగోళ 328; తిరుపతిదేవాలయము ఉత్తరపుగోడ దానిపై నట్టి వ్రాఁతలు లిఖింపఁబడక క్రీ. శ. 1446 వఱకు పూర్తిగా ఖాళీగా నుండెను. తిరుమల తిరుపతి దేవస్థానమువారి మాస సంచిక 4 వాల్యూము సంచిక (1933 నవంబరు).

(11) శ్రీపతి పండితారాధ్యుని శ్రీకరభాష్యము తిరుపతి దేవాలయమందలి విగ్రహము మొదట వీరభద్రునిదే యను విషయమును విశదీకరించుచున్నది.

“నను వేంకటేశ్వర వితలేశ్వర స్థానే విష్ణోరీశ్వర శబ్ద శ్రవణాత్ పరశురామావతారే, తస్య బ్రాహ్మణకులసంభవ శ్రవణాత్ కథం క్షత్రియత్వముపదిశ్యతే. ఇతిచెన్న వేంకటేశ్వరస్యాభావాద్విష్ణుత్వమ్, తదంగే నాగభూషణాది ధర్మాణాం ద్యోతనాత్, మూలవిగ్రహే శంఖచక్రాది లాంఛనానామదర్శనాత్, వీరేశ్వరస్య రామానుజ

కల్పిత వేంకటేశ్వరత్వం రజ్జు సర్పవదాభాసమాత్రమేవ, కించ తత్ప్రాణ్యాధో దేశ శివలింగదర్శనాదీశ్వరశబ్దో వ్యవహ్రియతే". దీని వలన తిరుపతి దేవస్థానమందలిది మొదట వీరభద్రవిగ్రహమే యనియు అందలి సర్పాభరణములు, పానికిందిప్రదేశమున శివలింగముండుట యిందుకుఁ దార్కాణమనియుఁ దెలియుచున్నది. మైసూరు పంచాచార్య ఎలిక్ట్రికలు ముద్రాలయములో 1932 లో ప్రకటితమయిన పండిత కాశీనాథశాస్త్రిగారి వీరశైవరత్న అను గ్రంథము పుట 51 చూడుఁడు.

(12) క్రీ॥శ॥ 1465 తిరుపతి దేవాలయ మంటప నిర్మాణము జరిగెను. 1914 ఇండియను ఆంటిక్వరీ 43 వాల్యూము 12;13,14 పుటలు చూడుఁడు.

(13) క్రీ॥శ॥ 1470 సాళ్వ నరసింహరాయలు, అతని భార్య, ఇద్దఱు కుమారులు పేర్లతో తిరుమల దేవాలయమునకు చతుస్తంభ మంటపనిర్మాణము జరిగెను. తిరుపతి దేవాలయమందలి కట్టడముల యభివృద్ధినిగూర్చి తిరుమల దేవస్థానమువారి మాససంచిక 4 వాల్యూము 12 సంచిక(డిసెంబరు1953) 10,11పుటలలో V. M.నరసింహము గారు వ్రాసిన వ్యాసము చూడుఁడు.

(14) క్రీ॥శ॥ 1471 సాళ్వ నరసింహరాయల ఏజెంటు ఈశ్వర నాయకుఁడు నరసింహ తిరుపతి అగ్రహారము (colony) నిర్మాణము జరిగించెను. 1921 సంవత్సరము మదరాసు ఎపిగ్రాఫికలు రిపోర్టు అనుబంధము 120 of 1921 ఉత్తర ఆర్కాటుజిల్లా, ఆర్ని డివిజను అయ్యపాలెయము శాసనము, రావుసాహేబ్ సి.హయపదనరావుగారిచే మైసూరు గెజటీరు 2 వాల్యూము మూఁడవభాగము 1628పేజీలో ప్రకటితమయినది చూడుఁడు.

(15) క్రీ॥శ॥ 1472 1482:_ తిరుపతిదేవాలయ గోపురనిర్మాణ

ము- సాళ్వ నరసింహరాయలు దుర్గా సముద్రమను గ్రామము దాన ముచేయుట తిరుమల దేవస్థానము మాసపంచిక 4 వాల్యూము 12 వ సంచిక (డిసెంబరు 1953) పుటలు 10,11 లలో V.Mనరసింహముగారు కట్టడముల నిర్మాణాభివృద్ధినిగూర్చి వ్రాసిన వ్యాసము.

(16) క్రీ॥శ॥ 1485:- వీరశైవరాజు మూడవ విరూపాక్షరాయల నాతని వజ్రసింహాసనమునుండి తొలగించి యాతని సేనాని సాళ్వ నరసింహరాయలు దాని నపహరించి యధిష్ఠించెను. S. కృష్ణ స్వామిఅయ్యంగారు దక్షిణ హిందూదేశ చారిత్రికశాసనములు పుటలు 71,72,73, అనంతాచార్యుల ప్రసన్నామృత కావ్యము, కృష్ణస్వామి అయ్యంగారు విజయనగర చరిత్రకాధారములు (నె 27 రు ఆధారము)

(17) మంటిన మఠనిర్మాణము- రామానుజ కూటమును స్థాపించి, చంద్రగిరికోటను రామానుజ మతీయుడయిన సాళ్వ నరసింహరాయ లొక్కడే నిర్మించెను. Mythic Sociaty వారి త్రైమాసిక పంచిక 1933 సంవత్సరము 23 వాల్యూము 477 పుట చూడుడు.

ఉపసంహారము

పైని పేర్కొనిన 17 అంశములువలన విజయనగర సామ్రాజ్యమును బరిపాలించిన సంగమ వంశ్యులలో మొదటి వీరశైవరాజగు రెండవ దేవరాయల (క్రీ॥శ 1419-1446) కాలముననే తిరుపతిదేవాలయమందలి వీరభద్రవిగ్రహము వేంకటరమణమూర్తిగా మార్పు నొందెనని తెలియనగును. ముఖ్యముగా 8,9,11 అంశములు చిత్తగింపుడు.

రెండవ దేవరాయల కొడుకు, రెండవ వీరశైవరాజు నయిన మల్లికార్జునరాయల కాలములో (క్రీ॥శ॥ 1446-1466) తిరుపతి దేవాలయ మంటపనిర్మాణము జరిగెను. 12వ అంశము చూడుడు-

తుదకు విజయనగర వీరశైవరాజులలోఁ గడపటివాఁడయిన మూఁడవ విరూపాక్షరాయల కాలమున (1465-1491) తిరుపతి దేవాలయము "నరసింహ తిరుపతి" యను పేరితో నూత్నక్షేత్రమయ్యెను. ఆ కాలముననే ఆ దేవాలయ గోపురనిర్మాణము జరిగెను. 14, 15 అంశములు చూడుఁడు.

వీరశైవరాజు మూఁడవ విరూపాక్షరాయల వలన పైనిజెప్పిన గోపురము, నూత్నక్షేత్రము నిర్మించుటకుగాను బహువిధములయిన దానములు, సాహాయ్యములు నొంది తుదకు స్వామిద్రోహులయి రామానుజమతస్థులు సాళ్వరాజు లాతనిని వజ్రసింహాసనమునుండి తొలఁగించిరి. అనఁగా నీ సాళ్వరాజులే విజయనగరమందలి వీరశైవ సామ్రాజ్యమును దద్వజ్ర సింహాసనముతోఁగూడ నపహరించియున్నారు. 16వ అంశము చూడుఁడు.

6వ అంశము వీరశైవుఁడయిన ప్రౌఢదేవరాయల సోదరికి, రాజకీయముగ వైష్ణవమతీయుఁడయిన సాళ్వతిప్పదేవునకు జరిగిన వివాహమును బేర్కొనును. ఇదియే తిరుపతియందలి వీరభద్రవిగ్రహము వేంకటరమణవిగ్రహముగా మాఱుటకు సులువుగా దారితీసినది. అనఁగా వీరశైవులకు, వైష్ణవులకు ఆనాఁడు రాజకీయముగ జరిగిన మతాంతర వైవాహిక బంధమే, తిరుపతిదేవస్థానముఁ బయి మార్పునుసంఘటించినది. సాళ్వతిప్పదేవునకుఁ దనసోదరి నిచ్చిన కారణమునఁ బ్రౌఢదేవరాయలు రామానుజమతస్థులయిన సాళ్వవంశమువారియెడ జాలి, చనవు, నెయ్యము నెఱపి తన వీరశైవ రాజ్యములో వైష్ణవమతీయులకు వలసినంత పలుకుబడి నధికారము కలిగించెను. తత్ఫలితముగనే తుదకాతఁడు నాతని పుత్త్రుఁడు మల్లికార్జునరాయలు, మూఁడవ విరూపాక్షరాయలు పేరికిమాత్రము చక్రవర్తులుగానున్నను వైష్ణవమతీయు

లైన సాళ్వరాజులచే సింహాసనభ్రష్టత్వము నొంది తమరాజ్యమును గోల్పోయిరి.

వేయేల! సంగమవంశ్యుల వీరశైవ రాజ్యము యావత్తు రామానుజమతీయుల స్వేచ్ఛావిహార పరివర్తనములకు గురియయ్యెను. ఉభయవంశ్యులుగూడ విభేదముల విడనాడి మనోవాక్కాయ క్రియారూపముగ స్నేహముతో మెలంగిరి. ఇందుచేతనే ప్రజలలో మతవిప్లవము గాని రక్తపాతముగాని లేకుండ రామానుజమతమువారు చల్లగా తమ యభీష్టానుసారముగఁ దిరుపతియందలి వీరభద్రవిగ్రహమును వైష్ణవ విగ్రహముగా మార్పఁగలిగిరి. సంగమవంశమువారికి సాళ్వవంశమువారికి, ఆనాఁడు రాజకీయముగ జరగిన రక్తసంబంధ బాంధవములే రక్తపాతము జరుగకుండఁ బయి పరిణామమును సాధింపఁగలిగెను. అభిషేకప్రియుఁడయిన శివుఁడు, అలంకార ప్రియుఁడయిన వేంకటరమణునిగా మార్పుచెందెను. పర్యవసాన మేమనఁగా రెండవ దేవరాయల కాలముననే (క్రీ॥శ 1419-1446) తిరుపతియందలి దేవుఁడు విష్ణువుగా మాఱుటయు, సంగమవంశ్యులలోఁ గడపటివాఁడగు మూఁడవ విరూపాక్షరాయలకాలమునాఁటికి రాజును ప్రజలునుగూడఁ బూర్తిగా రామానుజమతీయుల ప్రాబల్యముచే వైష్ణవమతీయులగుటయు జరిగినది.
అనంతాచార్యుని ప్రపన్నామృతము పుటలు 71,72,73 చూడుఁడు

శ్రీ కృష్ణస్వామిఅయ్యంగారు రచించిన విజయనగర చరిత్రాధారములలో నె 27 రు అధారము.

ఈ పరిశోధక వ్యాసముయొక్క ప్రధానసారాంశమేమనఁగా విజయనగర సామ్రాజ్యమును బరిపాలించిన వీరశైవరాజుల దౌర్బల్య కారణముననే వైష్ణవము క్రమముగఁ బ్రాబల్యమొంది భరతఖండ మందంతట వ్యాపించెను.

అనుబంధము

(1) పైని చేర్కొనిన యాధారములలో 11 వ ఆధారము శ్రీకర భాష్యముయొక్క రచయిత శ్రీపతి పండితారాధ్యులు క్రీ॥ శ॥ పదునొకండవ శతాబ్దమున శ్రీరామానుజాచార్యులకు కొంచెము తరువాత నుండినవాఁడు. శ్రీకర భాష్యమును వ్రాసినది యాతఁడేయయినచో * నాతఁ డందుదాహరించినట్లు లప్పటికే యాతని కాలమునాఁటికే తిరుపతిక్షేత్రమందలి శివవిగ్రహము విష్ణువిగ్రహముగాఁ గొంతవఱకు మార్పునొందిన ట్లూహింపనగును. శ్రీరామానుజాచార్య లానాఁడు దక్షిణహిందూదేశమున మతాధికారము నిర్వహించు సమ్రాట్టుగా వ్యవహరించుచుండి, శివవిగ్రహములను శివక్షేత్రములను విష్ణువిగ్రహములుగను క్షేత్రములుగను మార్చుచుండెననియు, యథారాజా తథా ప్రజా" అనునట్లులు ప్రజలుకూడ నాతనికి వశులయి వైష్ణవమతస్వీకార మొనర్చుచుండినట్లు గ్రహింపనగును.

---

* శ్రీకరభాష్యము వాస్తవముగా శ్రీపతి పండితారాధ్యుఁడు రచించినది కాదనియు, బసవేశ్వర, పంచాచార్య పార్టీలు కర్ణాటదేశమునఁ బ్రబలముగ లేగిన రోజులలో శ్రీ పండిత కాశీనాథశాస్త్రిగారు సికిందరాబాదునందు సమర్థుఁడగు నొక బ్రాహ్మణ పండితునిచే వ్రాయించి శ్రీపతి పండితారాధ్య కల్పితముగాఁ గల్పించిన గ్రంథమనియు నావిషయమునఁ దామా పండితుని కుటుంబమువారినుండి వాఙ్మూలములఁ దీసికొంటిమనియు నామిత్రులు శ్రీ T. H. సదాశివయ్యగారు MA.BL.(Retired District and Sessions Judge) నాతోఁ బలుసారులు ముచ్చటించియుండిరి, ఇట్టులీ శ్రీకరభాష్యరచనము వివాదగ్రస్త విషయముగనే యున్నది. ఇది పూర్వము తెలుఁగులిపిలో సికింద్రాబాదునందును, దేవనాగరలిపిలో, ముప్పదియేండ్లక్రిందట రావుసాహెబు సిహాయవదనరావుగారివలనను, మరల 1962 సంవత్సరములో మైసూరు విద్యాలయము ప్రొఫెసరు T.G. సిద్ధప్పారాధ్యులవారివలనను, శ్రీపతి పండితారాధ్య కృతముగానే ప్రకటితమయినది.

—బండారు తమ్మయ్య,

(2) తదితరాధారములనుబట్టి క్రీ॥ శ॥ 1419-1446 ప్రౌఢదేవరాయలకాలమున రాజకీయముగ నాతని సోదరికి వైష్ణవుఁడగు సాళ్వతిప్ప భూపాలునికి జరిగిన వైవాహికబంధము కారణముగా సాళ్వ నరసింహరాయల కాలమునాఁటికే క్రమముగా వైష్ణవము ప్రాబల్యమొంది తత్ఫలితముగా తిరుపతియందలి వీరభద్ర విగ్రహము పూర్తిగా నేఁటి వేంకటరమణమూర్తిగా మార్పునొందెననియు, ఇట్టి మార్పులు కొంతవఱకు మొదటఁ బదునొకండవ శతాబ్దియందే (రామానుజాచార్యుని జీవితకాలముననే) ప్రారంభమయి తరువాత మరలఁ బదునైదవ పదునాఱవ శతాబ్దులలోఁ బూర్తియయినట్లు మనము గ్రహింపవలసియుండును.

(3) వేంకటరమణమూర్తి విగ్రహమున నేఁడుగానవచ్చు శంఖచక్రములు కృత్రిమపు లోహముతోఁ దరువాత నిర్మింపఁబడినట్లే గాని మొదటనే ఱాతితోఁ జెక్కఁబడినట్లు కానరావు. శైవధర్మచిహ్నములు నాగాభరణాదికములు ఱాతిలోనే శరీరముపయి నేఁటికి నిలిచియున్నవి; హస్తముయొక్క దిగువను శివలింగము ప్రత్యక్షముగ నుండనే యున్నది.

శివయోగుల రచనలగూర్చి పరిశోధనము

సుప్రసిద్ధ శివయోగి, చిల్లకలవాఁడి వాస్తవ్యుఁడు బహుగ్రంథకర్తయునగు నిజగుణ శివయోగివర్యుఁడు తాళ్ళపాక అన్నమయ్యగారికి సమకాలీనుఁడు. ఆతఁడు ప్రౌఢదేవరాయల కాలమునఁ దిరుమల క్షేత్రమునఁ గొంతకాల మందుండెను. అతని గ్రంథములలో ఆనాఁడు తిరుపతి దేవాలయమందలి విగ్రహము నాతఁడెట్లు పేర్కొనెనో పరిశోధించుట నేఁటి చరిత్ర పరిశోధకులకెల్ల నీవిషయమున సత్యనిర్ణయమొనరించుటకయి పరమావశ్యకము. అందుకయి వారు శ్రద్ధవహింతురుగాక. (తిరుమల తిరుపతి దేవస్థానమువారి మాసపత్రిక: 4 వ వాల్యూము నె 1 రు జనవరి 1953 సంచిక పుటలు 15,16 చూడుఁడు)

కుమారసంభవమునఁ గాళిదాసు ప్రతిపాదించిన ప్రేమస్వరూపము.

శ్రీ అయ్యగారి నరసింహమూర్తి, తణుకు.

ప్రకృతిసిద్ధముగ హృదయ కుహరమునందు జనించు నొక పవిత్రమైన శక్తియే ప్రేమ. ఇది హృదయమునం దప్రయత్నముగ జరుగు వ్యాపారము. ప్రేమకు గమ్యస్థానము హృదయసంజనితానందమే. ఒకరికి మఱియొకరియెడఁ గల అమిత సద్భావమునకు అన్యోన్యవయః పరిమితినిబట్టి భక్తి, వాత్సల్యము, ప్రేమయని యందుము. పిన్నలకుఁ బెద్దలయెడఁ గల భావమును భక్తియనియు, పెద్దలకుఁ బిన్నలయెడఁ గల భావమును వాత్సల్యమనియు సమవయస్కులమధ్యఁ గల భావమును బ్రేమయనియుఁ జెప్పుదుము.

సుహృత్ప్రేమ, దాంపత్యప్రేమ-యని ప్రేమ రెండు విధములు. దంపతిభావము దాంపత్యము. ఈ దాంపత్యప్రేమ మఱల రెండు విధములు. ఒకటి బాహ్యసౌందర్యకారణముగా యౌవనమదముచే నరముల యుద్రేకమువలనఁ గలుగునది. దీనినే మోహమందురు. దీనికిఁ గామము ప్రధానము. అంగసౌఖ్యసంజనితానందములో నిది యణఁగిపోవును. రూపలావణ్యాదు లస్థిరములైనట్లే యీప్రేమయు నస్థిరమే. ప్రేమించి ప్రేమింపఁబడెడి రెండు వస్తువులకు హృదయ వైశాల్య నైర్మల్యములుండి, స్వార్థరహితమైనపుడు జనించు ప్రేమ నిష్కామప్రేమ. ఇయ్యది బాహ్యసౌందర్యము నాశింపక నిష్కపటమై నివాతదీపమువోలె నిశ్చలమై యనశ్వరమై యుండును. ఇట్టిప్రేమ సర్వసాధారణముగ సామాన్యులకు సాధ్యముగాదు.

కవికులతిలకుఁడగు కాళిదాసుచే కుమారసంభవమునఁ బ్రదర్శింపఁబడిన ప్రేమ నిష్కపటము, నిష్కామము, నిశ్చలమునై యన్యోన్యాశ్రయమై పరమపవిత్రమై యార్షసమ్మతమైనది. పార్వతీపరమేశ్వరులకును, రతీమన్మథులకును నడుమఁగల ప్రేమను దాంపత్య

ప్రేమయని యందురు రతీమన్మథుల ప్రేమ స్త్రీపురుషుల యన్యోన్యాశ్రయమున కుదాహరణము కాఁగా, పార్వతీ పరమేశ్వరుల ప్రేమ నిష్కామప్రేమ కుదాహరణమగుచున్నది. పార్వతి-తత్సఖులకును మన్మథ వసంతులకును నడుమఁగల ప్రేమను సుహృత్ప్రేమయని యందురు.

ప్రేమకుఁ బ్రధానము ధర్మముగాని కామముగాదు. నిష్కామప్రేమతత్త్వమునకుఁ గామము నిగ్రహింపఁబడవలెను. కామరహితమైనట్టి ప్రేమతత్త్వమును గాళిదాసు కుమారసంభవమున పార్వతీ పరమేశ్వరుల ద్వారమున వ్యక్తము చేసినాఁడు. పార్వతి తొలిజన్మమున మహేశ్వరుని పెండ్లియాడిన సతీదేవిగాని యన్యురాలుగాదు. వర్షము కురియుటతోడనే మొలకెత్తు బీజములరీతి నారదుని పలుకులు వినినంతనే యామె మనమునం దేమూలనో దాగియున్న ప్రేమాగ్ని ప్రజ్వరిల్లఁదొడఁగినది. నారదవాక్యప్రేరితుఁడైన నగసార్వభౌముఁడు హరుని పరిచర్యకుఁ గూఁతునంపఁగా నామె తనలావణ్యముచే శివుని లోఁగొననెంచినది. కాని పరమేశ్వరుఁడు సమాధినిష్ఠలో నివాతదీపమువోలె నిశ్చలమనస్కుఁడైయుండి తనపైఁ బుష్పబాణము నేయ నుంకించిన పంచబాణుని ఫాలాగ్నిచే క్షణములో భస్మీభూతు నిఁగావించెను. అట్లే కామదహనఘట్టము నిష్కామప్రేమకు సూచకమగుచున్నది.

తనకుగా నెప్పుడు మదనుఁడు కామారికంటిమంటకు ఆహూతుఁడయ్యెనో యపుడే శైలాత్మజ తండ్రి మనోరథము, తన శరీరసౌందర్యము నిష్ప్రయోజనమైనవని చింతించి శరీరలావణ్యాదులు మోహజనకములేగాని ప్రేమజనకములుగావనియు నప్పరమేశ్వరవశీకరణమునకుఁ దపోలావణ్యమే ప్రధానమనియెంచి తపముచేయఁ గృతనిశ్చయురాలయ్యెను.

పరమేశ్వరుని లోఁగొన నెంచిన పార్వతి తపముచేయఁ గృతనిశ్చయురాలైనదనువిషయము తల్లియగు మేనక యెఱిఁగి "తపః క్వ వత్సే క్వచ తావకం వపుః పదం సహేత భ్రమరస్య పేలవం శిరీషపుష్పం న పునః పతత్రిణః" అని తన తనయను దపోమార్గమునుండి మరలింప యత్నించెను. దీనినిబట్టి మాతృమూర్తికి బిడ్డపైఁగల వాత్సల్య మెట్టిదియో వ్యక్తమగుచున్నది.

"గురుర్నియోగాచ్చ నగేంద్రకన్యా, స్థాణుం తపస్యన్తమధిత్యకాయామ్ అన్వాస్త..." "శైలాత్మజాపి పితురుచ్ఛిరసోఽభిలాషం వ్యర్థం సమర్థ్య..." అనువానివలనఁ గూఁతునకుఁ దండ్రిపైఁ గల భక్త్యనురాగము లెట్టివో వెల్లడియగుచున్నవి.

సకల సంపదలకు నిలయమై యిష్టకామ్యసిద్ధిగల యింటఁబుట్టి రాజసభావముతో నంతఃపురములందు మెలఁగెడి నగసార్వభౌముని కూఁతున కొక్కుమ్మడిని సత్త్వగుణమలవడఁజాలదు. అంతఃకరణమునందలి మాలిన్యము క్షాళితమై చిత్తశుద్ధి గలిగినపిమ్మటఁగాని సత్త్వగుణ ప్రధానురాలుగాదు. అట్టిగుణ మలవడిన పిమ్మటఁగాని శివుని సపర్యకును, దపోధ్యానమునకును నధికారముగాని యర్హతగాని చేకూఱదు. అట్టిపరిణామము గలుగుట కామె యాదిలో నరణ్యములం దుండి యచటి చేతనాచేతనములకు సేవచేసెను. ఆమె మనమునందు నైర్మల్యము పొడసూపిన పిమ్మట మునిజనంబులకుఁ బూజలుచేయుచు కఠోరమగు నియమములచేఁ దపముచేసి మేనును గృశింపఁజేసి, అహంకారాదిగుణముల నంతరింపఁజేసి సత్త్వగుణసంపన్నురాలై పరమేశ్వరునిలోఁగల పరమోత్కృష్ట సౌందర్యమును బరిగ్రహింపఁగలిగెను.

స్వచ్ఛము, అమలినము నైన యపర్ణ మనమునందలి యాదర్శప్రేమను నిరూపించుటకై కాళిదాసు శివుని మాయాబ్రాహ్మణ బ్రహ్మచారివేషమునఁ దపోనిష్ఠలోనున్న పార్వతిని బరిపరివిధములఁ బ్రశ్నిం

పఁజేసెను. ఆపరీక్షయం దామె నెగ్గెను. ఈవిధముగఁ బార్వతి ధర్మదీక్షతోఁ నిష్కామప్రేమను సాధించినది. కనుకనే పరమేశ్వరుఁడు "అనేన ధర్మస్సవిశేషమద్యమే, త్రివర్గసారః ప్రతిభాతి భావిని, త్వయా మనోనిర్విషయార్థకామయా, యదేక ఏవ ప్రతిగృహ్యసేవ్యతే" అని పలికినాఁడు

అగ్నితప్తమైన యపరంజివలె నపర్ణ హృదయ మమలినమగుటచే బ్రహ్మచారి ప్రశ్నముల కన్నిటికి నుచితమైన సమాధానము లొసఁగి, పరమేశ్వరునిఁగూర్చి యిఁక శ్రుతికటువగు మాటలను విననోపక! "నివార్యతామాళికిమప్యయం వటుః పునర్వివక్షుః స్ఫురితోత్తరాధరః నకేవలంయో మహతోఽపభాషతే శృణోతి తస్మాదపియస్స పాపభాక్" అని చెలికత్తెలతోఁ బలికి యటనుండి వెడలిపోవ నుంకించెను. సత్త్వగుణసంపన్నయు, నిర్భరతపఃకృశ కోమలదేహయునగు పార్వతి తనూవిలాసమే యయస్కాంతమువలెఁ బరమేశ్వరుని నాకర్షించి పట్టి బంధింపసాగినది. తత్క్షణమే చంద్రశేఖరుఁడు నిజస్వరూపముతోఁ బ్రత్యక్షమై "అద్యప్రభృత్యవనతాఙ్గి! తవాస్మిదాసః క్రీతస్తపోభిరితి వాదిని" యనిపల్కి యామెనర్ధాంగిగా స్వీకరించుట కంగీకరించెను.

పార్వతీపరమేశ్వరు లిరువురును బరిణయోత్సుకులై యున్నను గాంధర్వవివాహము నెఱపక ఆర్షసంప్రదాయానుగుణముగ "కన్యకను, పితృపరాధీన నగుటచే దేవరచిత్తంబున నవధరింపవలయు" నని చెలిచే విన్నపంబుచేయించి పవిత్రప్రేమను ఆదిమ దంపతుల మూలమునఁ గాళిదాసు లోకమునకుఁ జాటిచెప్పెను.

కామోద్రేకమువలనఁ గలిగిన యింద్రియచాపల్యము కాదు కనుకనే పరమశివుడు మునీశ్వరులతో "సోఽహంతృష్ణాతురైర్వృష్టిః విద్యుత్వానివచాతకైః అవివిప్రకృతైర్దైవైః ప్రసూతింప్రతి యాచితః" అని స్పష్టముగఁ బల్కినాఁడు.

ఆదిమదంపతులగు పార్వతీపరమేశ్వరుల ప్రేమ విషయకాల్య

ముచే జనించినదిగాదు గనుకనే యౌవనమదముచేఁ గలుగు దుష్కృత్యములకు లోనుగాక ధర్మబద్ధమైయుండెను. ఈశ్వరుండును బితృదత్తమైన కుమార్తెను చేఁబట్టి కుమారోత్పత్తిచేఁ దాను జగమునకు జనకుఁడై యామెనుజననిగాఁ జేసి యిష్టఫలసిద్ధితోఁ గృతకృత్యుఁడాయెను

తన సఖులు గొనివచ్చిన పుష్పములను స్వహస్తలూనములగు పుష్పములను గలిపి హరుని కర్పించుచుండిన పార్వతి కామదహన సందర్శమునఁ దనసఖుల సమక్షముననే తన మనోరథము భగ్నమయ్యెనని యెంతేని వ్యథనుజెందెను. కాని తత్సఖులామెచేయుప్రయత్నము కెల్లవేళలఁ దోడ్పడిరి. అట్లే మాయాబ్రాహ్మణ బ్రహ్మచారి రూపమున వచ్చిన మారవైరికిఁ జెలికత్తె ద్వారమునఁ దన మనోభీష్టమును (వరునివిషయమును) నెఱింగించెను. ధర్మపరీక్షయందు విజయమునొందిన పిమ్మట సాక్షాత్కరించిన చంద్రకళాధరునకుఁ దనతండ్రియగు హిమవంతుఁడు కన్యాదానముచేసిన పిమ్మటఁ బరిగ్రహింపవలయునన్న సందేశమును జెలికత్తెద్వారమునఁ దెలియఁబఱిచెను. తపోనియమ సమయమందుఁ బార్వతి, తత్సఖులును సుహృద్భావముతో మెలఁగిరి. వసంతుఁడు మన్మథున కెడబాటులేని మిత్రుఁడు. మన్మథుని కష్టసుఖములను దనవిగా భావించుకొనెడివాఁడు. కనుకనే రతీదేవి భర్తృమరణమునకై విలపించుచుఁ దనకు దర్శనమీయకున్నను బ్రియమిత్రుఁడగు మాధవునకు దర్శనమీయుమని కోరినది.

“దయితాస్వనవస్థితం నృణాం నఖలు ప్రేమచలం సుహృజ్జనే” అను దానినిబట్టి కైతవములేని స్నేహబంధ మెంతసుస్థిరమైనదియో మనమూహింపవచ్చును.

ఇఁక రతీ-మన్మథుల ప్రేమయు నన్యోన్యానురాగాశ్రయమై పవిత్రమైనది.

అన్యోన్యానురాగాశ్రయమైన దాంపత్యప్రేమ ప్రకృతిలో నెచటనైనను గాంచనగును. వసంత వర్ణనమున స్థాణ్వాశ్రమమునందలి ప్రాణులయన్యోన్యాశ్రయ భావశృంగారచేష్టలను గవియిట్లు వర్ణించినాఁడు

"మధుద్విరేఫఃకుసుమైకపాత్రే పపౌప్రియాంస్వామనువర్తమానః
శృంగేణ సంస్పర్శనిమీలితాక్షీం మృగీమకండూయత కృష్ణసారః"
పర్యాప్తపుష్పస్తబకస్తనాభ్యాఁ స్ఫురత్ప్రవాళోష్ఠమనోహరాభ్యాం
లతావధూభ్యస్తరవోఽప్యవాపుర్వినమ్రశాఖాభుజబన్ధనాని"

స్త్రీశక్తి యెట్టిదైనను ప్రకృతిసిద్ధముగాఁ బురుషునిపై నాధారపడియుండును. స్త్రీ పురుషునిపై నాధారపడియున్నను నన్యోన్యాశ్రయములేనిదే యవి శోభింపఁజాలవు. ఈవిషయమునే కాళిదాసు మనోజ్ఞమైన యుపమలలోఁ గూర్చినాఁరు.

పురుషుఁడు దీపమువంటి వాఁడనియు, స్త్రీ యందలి వత్తి యనియు, దీపమాఱిపోయినచో వత్తికిఁ బ్రయోజన ముండదనియు, వత్తి లేనిచో దీపముండదనియు, కనుక స్త్రీ పురుషు లిరువురు దీపము వత్తి వలె నన్యోన్యాశ్రయులని చెప్పెను. రతీదేవి భర్తృమృతికై విలపించుచుఁ దా నాఱిపోయిన దీపపువత్తి పొగవలెఁ బొగులుచున్నానని వసంతునితోఁ బల్కెను. పురుషుఁడు వృక్షమువంటివాఁడనియు. స్త్రీ దాని నంటియుండు లతవంటిదనియుఁ జేర్కొనెను. వృక్షము పోయినచో లతకాశ్రయముండదు, లతలేనిచో వృక్షమునకు శోభయుండదు. లతావృక్షములవలె స్త్రీపురుషు లన్యోన్యమపఁగి పెనఁగి యున్నపుడే సుందరముగా నుందురు.

ఇట్లీవిధముగఁ గవికులతిలకుఁడగు కాళిదాసు నిష్కామప్రేమతత్త్వమును, అన్యోన్యానురాగాశ్రయ విలసితమైన దాంపత్యప్రేమస్వరూపమును గుమారసంభవమునఁ బ్రతిపాదించి జగజ్జనకులగు పార్వతీపరమేశ్వరులు లోకకళ్యాణార్థమై కుమారోత్పత్తికిఁ బాటుపడి చరితార్థులైన విధముగ నయ్యాదిమ దంపతుల విషయమును గావ్యముగా లిఖించి యందుఁ దననాఁటి యార్షసంప్రదాయములను వెలువరించి తానును జరితార్థుఁడాయెను.

శ్రీ కాళిదాస సౌందర్య సమారాధనము—విశ్వప్రేమము

శ్రీ ఖండవిల్లి సూర్యనారాయణశాస్త్రి

(గతసంచిక తరువాయి)

వాస్తవమున కీ నాటకములోఁ జక్కని రెండు కలయికలు కలవు. మొదటి యంకములోని నాయికానాయకుల కలయిక భౌతికమై, అస్థిరమైన సౌందర్యముతోను, శృంగారముతోను గూడియున్నది. ఇఁక జివరియంకములోని కలయిక శాశ్వతానందదాయకమగు మారీచ మహర్షి దివ్యాశ్రమములో జరుగుటచే ఆధ్యాత్మికానంద దాయకమైయున్నది. ఇట్లీ నాయికానాయకుల మొదటి సమావేశము చివరి నైతిక సమ్మేళనముగా నెట్లు పరిణతమైనదో అట్టి పరిణామ క్రమమును జూపుటయే యీ నాటకలక్ష్యము.

ఒక ప్రత్యేక భావప్రబోధమునకుఁగాని లేక, ఒక ప్రత్యేక పాత్రచిత్రణమునకుఁగాని యీశాకుంతలనాటక (రచన) ముద్దేశింపఁబడలేదు. ఇఁక ఈనాటక కథావిషయమంతటిని ఒక ప్రపంచమునుండి

(గతసంచిక 63 పేజీలోని ఇంగ్లీషువాక్యముల తరువాయి భాగము)

We are apt to pass over this eulogy lightly as a mere poetical out burst. We are apt to consider that it only means in effect that Goethe regarded Sakuntala as fine poetry. But it is not really so His stanza breathes not the exaggeration or rapture but the deliberate judgment of a true critic. There is a special point in his words. Goethe says expressly that Sakuntala contains the history of a development—the development of flower into fruit of earth into heaven, of matter into spirit.

In truth there are two visions in Sakuntala and the motive of the play is the progress from the earlier union, in the first Act, with its earthly unstable beauty and romance, to the higher union in the heavenly hermitage of eternal bliss described in the last Act.

మఱియొక ప్రపంచములోనికిఁ బరివర్తనము సేయుటకును, భౌతిక సౌందర్యపరిమితమగు ప్రేమనుండి నైష్ఠికసౌందర్యసంయుతమై, శాశ్వతానందదాయకమైన దివ్యప్రణయస్వర్గమునకు భారతీయదంపతుల నుద్ధరింపఁజేయుటకును ఈనాటక ముద్దేశింపఁబడినది.

శాకుంతలమునుగూర్చి వ్రాసిన శ్రీ రవీంద్ర కవీంద్రునియొక్క పై యాశయములలోని పరమార్థమును శాకుంతలోదాహరణములతో నిఁక నిరూపించి చూపెదను. పార్వతీ సౌందర్యమునువలె శకుంతలా సౌందర్యమునుగూడ "పూర్వోత్తర"రూపముగ విభాగించి చూచిననే యిచ్చటి విశిష్టత విశదమగును. కనుక ముందుగ శకుంతలా భౌతిక సౌందర్య వైభవము నవలోకించుదము.

ఈనాటకములోని నాందీప్రారంభవాక్యమే శకుంతలాసౌందర్య సర్వస్వమునకు నాందియగుచున్నది.

"యాసృష్టిస్స్రష్టురాద్యా..." యా=ఏ శకుంతల; స్రష్టుః=
=(కాళిదాసః వి) బ్రహ్మయొక్క; ఆద్యాసృష్టిః=మొదటిసృష్టియో;
అనఁగా "కాళిదాసకవి బ్రహ్మయొక్క సుందరవస్తుసృష్టిలో శకుంత

This drama was meant not for dealing with a particular passion, not for developing a particular character, but for transmiting the whole subject from one world to another-to elevate love from the sphere of physical beauty to the eternal heaven of moral beauty.

* In the first Act the poet has not concealed the gross earthliness of the fall of Sakuntala; he has clearly shown, in the conduct of the hero and heroine alike, howmuch desire contributed to that fall. He has fully painted all the blandishments, playfulness and flutpering of the intoxicating sense of youth, the struggle between deep bashfulness and strong self expression.

లయే యుత్తమోత్తమముగు మొట్టమొదటి సుందరవస్తుసృష్టి"యని యిట ధ్వనించుచున్నది. ఈ ధ్వన్యర్థమే యిట వివరింపఁబడుచున్నది.

దుష్యంతుఁడు కణ్వాశ్రమముంజేరి పాదపాంతర్హితుఁడై యచ్చటికన్నెల విస్రంభాలాపములు వీనులవిందుగ వినుచుండఁగా నాయిక,

"అనసూయే! అదయపినద్ధేన అనేన స్తనవల్కలేన ప్రియంవదయా
బలవన్నియంత్రితాస్మి శిథిలయ తావదేనం".

అని ప్రతి క్షణమునను సంవర్ధమానమగుచున్న తన యౌవనసంరంభంబును అప్రయత్నంబుగనే యచ్చటి విశాంపతికి నామె వినిపింపఁజేయును.

ఇందుల కామె ప్రియసఖి ప్రియంవద:- సఖిశకుంతలే! అత్రతావత్పయోధరవిస్తారయితృకమాత్మనో యౌవనముపాలభస్వ కిం మాముపాలభసే?

ఇట్లు ముగ్ధమోహనములైన యాముదితల మోహనాలాపములనువిని రాజు అప్పటి నాయికా యౌవనవిలాస వైభవములను జూచిచూచి తనలో "ఈశకుంతల ధరించిన వల్కలము (నారచీర)

This is a proof of the simplicity of Sakuntala. Dushyantas conquest of Sakuntala has been very naturally drawn. With equal ease has the poet shown the deeper purity of her character in spite of her fall-her unimpaired innate chastity. This is an other proof of her simplicity.

The flower of the forest needs no servant to brush the dust off her petals. She stands bare, dust settles on her, but in spite ef it, she easily retains her own beautiful cleanliness· Dust did settle on Sakuntata. but she was not even conscions of it like the simple wild deer; like the mountain spring, she stood forth pure in spite of mud·

ఇట్లే శకుంతలకు పతినిరాకరణరూపమైన భౌతికపతనము క్రమపరిణతితో నాధ్యాత్మికోన్నతిగ పరిణామముఁ జెందినవిధమే పై రవీంద్రుని యాంగ్లవాక్యములలోని విషయము.

ఈమె శరీరమునకుఁదగనిదే. ఇట్టి యీ వల్కలముకూడ నీసహజ సౌందర్య శోభితకు అలంకారశోభనే యాపాదించుచున్నది. ఎట్లనఁగా-

"పద్మమునకుఁ జుట్టువారియున్ననాచు, ఆపద్మమునకు ఒక క్రొత్తయందము నాపాదించినట్లును, చంద్రునిలోని మలినకళంకము కూడ ఆచంద్రునికి కాంతి లక్ష్మినే ప్రసాదించియున్నట్లును, ఈశకుంతలకు అననురూపమైన యీ వల్కలముకూడ అధికసౌందర్యమునే గల్గించుచున్నది. స్వతఃమధురమైన యాకృతిగలవారు ఎంతటి తక్కువ వస్తువును ధరించినను, ఆవస్తువు వారికి సమధికసౌందర్యమునే సమకూర్చుచుండును. "స్త్రీలు తాము అలంకారములు ధరించనప్పుడు కూడ ఎవరియాకృతి రమణీయముగా నుండునో అట్టి "యాకృతి" "మాధుర్యము" అనఁబకును. నిరలంకారలై వృక్షసేచనముఁ గావించుచున్న మునికన్యకలను జూచి రాజు తనలో "అహో! మధురమాసాందర్శన"మ్మనుచు, వారి యపురూపపుటందమున కచ్చెరువందును.

ఇట్టి రూప"మాధుర్యము"నే యీకవి, తనమాళవికాగ్నిమిత్ర నాటకములో మాళవికనుగూర్చి రాజుచే "అహో! సర్వావస్థాసు చారుతా శోభాంతరం పుష్యతి"అనిపించును. ఇట "సర్వావస్థాసు..." అనఁగా అలంకారములు లేనప్పుడును అని భావము ఇట్లు "మాధుర్య" లక్షణములతోఁగూడిన శకుంతలాసౌందర్యము, స్వర్గాలంకారమైన యూర్వశీసౌందర్యమునుగూడ "త్రోసిరాజు" అనుచున్నదిట అవధరింపుఁడు.

"ఆభరణస్యాఽభరణ" ప్రసాధనవిధేః ప్రసాధనవిశేషః।
ఉపమానస్యాపిసఖే ప్రత్యుపమానం వపుస్తస్యాః॥

(విక్రమోర్వశీయనాటకము 2-3)

అగ్నిమిత్రుఁడు విదూషకునకు ఊర్వశీసౌందర్యము నిట్లు తెలుపుచున్నాఁడు.

"మిత్రమా! ఊర్వశియొక్క యుజ్జ్వలరూపము ఆభరణవస్తువులన్నిటికిని ఉత్తమాభరణము. ఇట్లే యామెరూపము అలంకరణ విశేషములకెల్ల నూతనాలంకరణము. వేయిమాటలేల! వయస్యా! ఈ యూర్వశియొక్క యనుత్తమరూపము ఉపమానవస్తువులకే (చంద్రారవిందాదులకే) ఏకైకమైన యుత్తమోపమానము" ఇట్లూర్వశీరూపము ఆభరణములకే యాభరణము కాఁగల్గుచుండఁగా శకుంతలారూపము ఆభరణములు కాని (తక్కువైన) వస్తువులనుగూడ నందగింపఁ జేయుచు, అట్లందగించుచున్న యా(తక్కువ) వస్తువులచేఁ దిరిగి యా శకుంతలారూప మందగింపఁజేయుబడుచుండుట, యిట గమనింపఁదగిన కమనీయవిషయము * ఈమె కాళిదాసకవి బ్రహ్మయొక్క సుందర వస్తుసృష్టిలో నాద్యమైన సుందరవస్తువుగదా! ఇట్టి రూపసౌకుమార్యమునీసౌందర్య తత్త్వవేత్త "కుసుమమివలోభనీయం యౌవన మంగేషుసన్నద్ధం" అని పుష్పసౌకుమార్యముతోఁ బోల్చినాఁడు. పై భావములోని పరమార్థమును జూఱగొన్న "గెథే" మహాకవి, శకుంతలను గూర్చి "Young years blossoms...." అనుట ప్రత్యక్షరసత్యము.

ఇఁక నీ శకుంతలారూపతత్త్వము తనకు గోచరించినరీతిని దుష్యంతుఁడు విదూషకునితో నిట్లు ముచ్చటించుచున్నాఁడు,

"చిత్రే నివేశ్య పరికల్పిత సత్త్వయోగా రూపోచ్చయేన విధినా మనసా కృతాను। స్త్రీరత్నసృష్టిరపరా ప్రతిభాతి సా మే ధాతుర్విభుత్వ మనుచింత్య వపుశ్చ తస్యాః॥ శాకుంతలే అంకః (2 శ్లో. 9)

---

* సౌందర్యము వస్త్వాశ్రితమైనదే కాని, ఆత్మాశ్రితము, అలంకారాశ్రితము కాదని ..మొదట నాచేర్కొన్నవిషయము నిట విస్పష్టమైనది"

"బ్రహ్మయొక్క స్త్రీలోకసౌందర్యసృష్టి సామర్థ్యమును, ఈ శకుంతలా సౌందర్యసృష్టిసామర్థ్యమును దులనాత్మకరీతిగఁ జూచుచున్న నాకు (దుష్యంతునకు) మిత్రమా! నా చూచిన శకుంతల ఇంకొక నూతనబ్రహ్మయొక్క లోకోత్తర స్త్రీరత్నసృష్టివలె భాసించుచున్నది. ఎందుకనఁగా ఆమెను సృజించినబ్రహ్మ ఆమెరూపమును ముందుగాఁ జిత్తరువులో దిద్దితీర్చి, యాచిత్రగత చిత్రణము తనకు నచ్చినపిమ్మటనే (బ్రహ్మ) యారూపవతికిఁ బ్రాణసంయోగము చేసి యుండవలెను. లేక చంద్రుఁడు, పద్మము మున్నగు నుపమానవస్తువులందలి కేవల కాంతిద్రవ్యమునంతను (ఆ నూతనబ్రహ్మ) ఒక్కటఁ జేర్చి, ఆసుకుమారద్రవ్యమును జేతముట్టక, ఆశకుంతల నతఁడు, ఒక్క యాకాంతి ద్రవ్యసాధనముచేత నే (ఇది ఉపాదానకారణము) తన మనస్సుచే (ఇది నిమిత్తకారణము) నామెను ఆ బ్రహ్మ సృజించి యుండవలెను.

పై శకుంతలాసృష్టిరీతి పురాణబ్రహ్మయొక్క సృష్టిరీతికంటె విలక్షణమైయున్నది. కనుక ఈసృష్టి, పురాణ (పాత) సృష్టి కాక, మఱియొక నూతనబ్రహ్మయొక్క సృష్టియై యుండవలెను." అని విదూషకా! నాకుఁ దోఁచుచున్నది." ఇట్లు బ్రహ్మకు లభ్యముకాని యద్భుతసుందరవస్తుసృష్టి స్వాతంత్ర్యము మనకవి బ్రహ్మకు లభ్యమైన కారణముచేతనే అభిజ్ఞులు "అపారమైన కావ్యప్రపంచమునకు కవియే ఏకైకబ్రహ్మ యగుచున్నాఁడ"నియు నీ కవిబ్రహ్మ తన కావ్యప్రపంచమును దనకుఁ దోఁచినరీతిగ మార్చివేయ గలఁడనియు*నిశ్చయించినారు. పురాణబ్రహ్మ యథాపూర్వముగ శకుంతలను పాంచభౌతికరూపముతో సుఖదుఃఖసమ్మిశ్రితముగ సృజించెను. కనుక బ్రహ్మ సృష్టి యగు శకుంతలకు "కారణగుణన్యాయము"చే+ పాంచభౌతికధర్మము

---

* "అపారే కావ్యసంసారే కవిరేకః ప్రజాపతిః। యథాఽస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే॥ X "కారణగుణాః కార్యే సంక్రామంతి" (తర్కపరిభాష)

లైన దుఃఖములు తప్పవు. కాని కాళిదాసకవి బ్రహ్మచే సృష్టమైన శకుంతలకు అట్టి పాంచభౌతికము (దుఃఖము) లేదు. కనుకనే కాళిదాస శకుంతలారూపము అనశ్వరమై, కేవల కాంతిదివ్య మయశరీరముతో శాకుంతల కవితాంబరమున ధ్రువతారయై వెలుంగుచునే యున్నది. మఱియు నూర్వశీ రంభాదుల దివ్యరూపము పురాణబ్రహ్మయొక్క సుందరవస్తుసృష్టికిఁ బరమావధియైయుండఁగా నిప్పటి శకుంతలారూపసృష్టి పై రంభాదుల రూపసృష్టినిదోసి రాజనుచున్నదిగాన, "రంభాదులను సృజించిన బ్రహ్మకంటె నీశకుంతలను సృజించినబ్రహ్మ మఱియొక నూతన (కాళిదాసకవి) బ్రహ్మ కావలసియుండవలెను." అను దుష్యంతునియూహా యుక్తియుక్తము, శాస్త్రసమ్మతము కూడనై యుండలేదా? పార్వతీరూపసృష్టికంటె నీకవి శకుంతలారూపసృష్టిలో సంపూర్ణముగ సిద్ధహస్తుఁడైనాఁడనుటకు ఇట ఇతని'మానస'సృష్టియే నిదర్శనము కనుకనే ఈకవిబ్రహ్మ "అపరా స్త్రీరత్నసృష్టిః..." అని బ్రహ్మనే యతిక్రమించఁగల్గెను.

ఈకవి బ్రహ్మయొక్క యీ వినూత్నసృష్టిని విలోకించియే కాబోలు శ్రీ బాణభట్టకవి తన "కాదంబరి"లో బ్రహ్మయొక్క మతంగ కన్యారూప సృష్టిని భంగ్యంతరముగా నిట్లు భావించినాఁడు.

'మన్యేచ మాతంగజాతి స్పర్శదోషభయాత్ అస్పృశతా ఇయ ముత్పాదితా ప్రజాపతినా అన్యథా కథ మియమక్లిష్టతా లావణ్యస్య? నహికరతలస్పర్శక్లేశితానా మీదృశీ భవతి కాంతిః॥ (కాదంబరి)

"అంత్యజాతియగు మాతంగజాతి కన్యను జేతముట్టినచో పాపము కల్గును" అను సంశయముతో బ్రహ్మ, ఆ మాతంగకన్యను జేత ముట్టకయే నిర్మించియుండును. (చేతితోఁ జేయనిది) మనోభావనచేతనే చేయఁబడవలయునుగదా!)అని తలంచెదను (బాణకవి) చేతితోఁజేసిన వస్తువుల కింతటి సౌకుమార్యమును, నైగనిగ్యమును (నిగనిగ) కాం

తియు అనునవి యెట్లు చేకూఱఁగలవు? కనుక నీ మతంగకన్య బ్రహ్మ యొక్క మానస సృష్టియై యుండవలెను." ఇట్లు బాణభట్టు "మనసా" అను కాళిదాసు ప్రయోగమును జెప్పకయే దాని భావమును భంగ్యంతరముగాఁ బ్రకాశింపఁజేసి "కవి భావనా పరిభావము" నిట వెలయించినాఁడు. బాణభట్టుయొక్క పై "అక్లిష్టత" కూడ కాళిదాసు యొక్క "అక్లిష్ట బాలతరుపల్లవలోభనీయం" అను దానినుండి గృహీతము కానోపును. ప్రకృతమనుసరామః ప్రస్తుతమున శకుంతలారూపము నింతగా వర్ణించియుఁ దనివినొందక రాజు తద్రూపవిషయకమైన రహస్యము నిట్లు విదూషకునితో ముచ్చటించుచున్నాఁడు.

"ఇదంచ మేమనసివర్తతే. (ఇదికూడ నామనసులోనిమాట)
"అనాఘ్రాతంపుష్పం కిసలయ మలూనంకరరుహై
రనావిద్ధంరత్నం మధునవమనాస్వాదితరసం
అఖండం పుణ్యానాం ఫలమిచతద్రూపమనఘం
నజానే భోక్తారంకమిహ సముపస్థాస్యతివిధిః॥ (అంకం 2-10)

శకుంతలారూప మింతవఱకు నేయొక్కనిచేతను నాఘ్రాణింపఁబడని పుష్పము. ఇట్లే తద్రూపము ఏయొక్కనిచేతి గోరును దాఁకని చిగురుటాకు. 2. తద్రూపము ఇంతవఱకు రంధ్రముచేయఁబడని రత్నము. 3. (వావిరివుట్టురత్నము) ఇట్లే యది చవిచూడఁబడని తేనియ. 4. అఖండపుణ్యములఫలము. 5. ఇట్టి నిరుపమ, నిర్దుష్టరూపమును అనుభవించుటకు బ్రహ్మ ఏపుణ్యాత్ముని సృజించియుంచెనో? యిత్రిమా! నాకుఁ (రాజునకు) దెలియదు.

ఇదంతయు దుష్యంతుని మనసులోనిమాటయేకదా! నాయిక యొక్క రూపపుష్పము నూతనముగ వికసించి విలసిల్లుచున్నదిగాన, ఈ నవకుసుమము నాఘ్రాణించు నభిలాష నాయకుని మనసులో గాఢముగ నున్నట్లిట సూచితమగుచున్నది. ఇట్లె యీమెరూపము,

నఖక్షతములు లేని నవకిసలయము కనుక, నిట్టి కిసాలముపై నఖక్షతములు సేయు కోరిక లీతనిలో నీరికలెత్తుచున్న వనవలెను. ఈరీతినే ఈ నవ్యరమణీయ రత్నమును ముందుగాఁ దానే స్వీకరింపవలయు నను నాస ఈ యువనీపతికి ఆ జన్మసిద్ధమైన దే యనవలెను. "రత్నహారీను పార్థివః" అని అభిజ్ఞ లనుచుందురుగదా! ఇదేవిధముగ క్రొంగ్రొత్త తేనియను ముందుగఁ జవిచూడవలెనను నాస లీ భూపతిలో దాగుడుమూతలాడుచున్నవనియు, నింతటి పుణ్యాలపంట వేపుణ్యాత్మునకుఁ దక్కునో? యని యీతనివేదన మధికమగుచున్నదనియు నీశ్లోకమున సూచితములగుచున్నవి. ఇట్టి శ్లోకమును భావించిన కొలఁది శృంగార భావములు మొలకలెత్తుటే కాక యిద్దానినుండి యుత్తమభావములు కూడ నుదయించుచున్నవి. నవవికసితమైన యీమె రూపపుష్పము, తన వినూత్న సరస సౌరభములతో నాగంతుకులకు నిట ఆమెతలో సంగవలసియున్నది. ఐనను నీ పుష్పము ఇంతదనుక ఏయొక్కనిచేతను నాఘ్రాణితము కాలేదు వికసితపుష్ప మిట్లొరులచేఁ దెలియఁబడకుండుటకు ఇట ఏదోయొక బలవత్తర కారణ ముండియుండవలెను. అట్టి కారణ మఱయఁగా నా కవగతమైన కారణమిది. మధుకరాంగనలకు పూచిన సంపెంగపొలుపు అంటరానిదై భోగబాహ్యమగుచుండును. ఇట్లే ఇట శకుంతలారూప పుష్పములోని పొలుపుకూడ, అన్యపురుష దృష్టి మధుకరాంగనలకు అంటరానిదై భోగబాహ్యమగుటలో వింత యుండదు. పై నాభావమునకుమూ కాళిదాసమహాకవి చూపిన యుక్తిఁజూడుడు. "శమప్రధానేషు తపోధనేషుగూఢం హిదాహాత్మక
మస్తి తేజః।
స్పర్శానుకూలా ఇవసూర్యకాంతా స్తదన్యతేజోఽభి భవాద్వమంతి॥
(2-7)

అన్యతేజమునుండి పరాభవముకల్గినపుడే సూర్యకాంతపుమణులు వం

దినట్లు శాంతిప్రధానులైన తాపసజనులు పరాభవప్రాప్తి సమయము ననే తమ శాపరూపమైన దాహకశక్తిని గనఁబఱచుదురు. (శకుంతల నెక్కెనఁ జేతఁజిక్కించుకొను మన్న విదూషకునితో రాజు చెప్పినపద్యాఖ్యాన సందర్భములోని దిది) కనుక భారతీయ సతీమతల్లుల రూపపుష్పములు వారి పతులకు దక్క, పరులదృష్టి భృంగాంగనలకు అంటరాని వేయగుచున్నవని యిట స్పష్టమైనది. ఇట ఇంకొక విశేష మేమనగా పుష్పము చేతఁదాకనంతవఱకె దాని వినూత్న వికాసములు నిత్యనూతనములై, వస్తునిష్ఠములై విరాజిల్లును. ఈ విశిష్టవిషయమునే "కీట్సు" అను నాంగ్లేయకవి యిట్లు తెలిపినాడు. (ఒకచిత్రములోఁ బ్రియురాలి చెంత నిలిచియున్న ప్రియుఁడామెను దాఁకక యామెవైపు వలపులఁ జూపుచు నట్లే నిలిచియుండుట యిట సందర్భము)

"Bold lover, never never canst thou kiss thovlgh winming mear the gool yet, do mat grvieve She cannat fade, though thou hast mot thy bliss for ever wilt thon love, ond she be fair"

"ప్రియుడు ప్రేయసికి అత్యంత సన్నిహితుఁడై ప్రేమోద్రేకమును జూపగల్గినను, అతఁడు ప్రియురాలిని ముద్దిడలేడు. అంతమాత్రమున నతఁడు ఖిన్నుఁడుకాఁడు. మర్త్య స్పర్శలేనంతవఱకు సౌందర్యము క్షీణించదు. శృంగారానుభూతితో సౌందర్యము వస్తునిష్ఠత్వమునువిడిచి, పరిచ్ఛిన్నము, భౌతికము కాగలదు. కావున (సౌందర్యవతిని ముట్టక) ఆస్థితిలోనే అతఁడున్నచో శాశ్వతముగా నామెను ప్రేమించగలఁడు. శాశ్వతముగా నామె సుందరముగా నుండగలదు."

(మా. శ్రీ. పో. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సౌందర్యమీమాంస)

ఈ "కీట్సు"నకుఁ బదునెన్మిదివందల వత్సరములకుఁ బూర్వకాలములో నున్న మన కాళిదాస కవీంద్రుఁడు పై యాంగ్లకవి భావమును దన శాకుంతలములో—

"—ముఖమంసవివర్తి పక్ష్మలాక్ష్యాః కథమప్యున్నమితం
న చుంబితంతు" (మా. అంకము 3 శ్లో 26)

సహజ సౌందర్య సజ్జితయగు శకుంతలా ముఖమును కాళిదాసు నాయకునిచేఁ బైకెత్తించియు, నద్దానిని రాజుచేఁ జుంబనముచేయించక తత్సౌందర్యమును వస్తునిష్ఠముగను, శాశ్వతముగను సంరక్షించి, కీట్సున కీ సౌందర్య తత్త్వవేది మార్గదర్శకుఁడయ్యెను. మఱియు మన కవి యీ నూత్న సౌందర్య దృశ్యమును దన దృశ్యకావ్యచిత్రమునఁ జిత్రించి, తత్సౌందర్య కుసుమము, యుగాంతములవఱకును వాడకుండునట్లును, ఇప్పుడు పాంచభౌతిక శకుంతల లేకున్నను నామె తన శాకుంతలములోఁ జిత్రింపఁబడి సజీవమై, నిత్యనూతనమగు దివ్యసౌందర్యముతో దీపించుచున్నట్లును, అట్టి సౌందర్యవతిని దుష్యంతుఁడు శాశ్వతముగఁబరమాదరముతోఁ బ్రేమించుచు నామెను జుంబించక, తత్సౌందర్యమును వస్తునిష్ఠముగనే కాపాడినట్లును, నిత్యముగఁ జిత్రించి చూపినాఁడు. ఇట్లు చిత్రగత, లేక కావ్యగత శకుంతలాది పాత్రలు సజీవవ్యక్తుల లేక రూపములకంటె సత్యములై నిత్యానందదాయకము లగుచున్నట్లు కీట్సు ఇట్లు తెలిపినాఁడు :

"Heard melodies are sweet, unheard are sweeter"

గాయకుల గానములు వినినంతవఱకె (పాడినంతవఱకె) మధురములగుచుండగా, చిత్రచిత్రితములైన గాయకుల గానదృశ్యములు చిత్రమున్నంతవఱకును వీనులవిందుగ వినుపించుచునేయున్నట్లు మధురతరము లగుచుండును.

"కీట్సు"యొక్క పై భావమునకుఁగూడ మూలము భారతీయ కవుల భావమే అనుట కీక్రింది శ్లోకమే నిదర్శనము.

"ఆదిరాజ యశోబింబమాదర్శం ప్రాప్యవాఙ్మయం॥
తేషా మసన్నిధానేపి నస్వయం పశ్య నశ్యతి॥"

శ్రీరామచంద్రుఁడు మొదలగు మహారాజుల "కీర్తి" బింబము (సంస్కృత) వాఙ్మయము అను నద్దములోఁ బ్రతిఫలించి నేఁడా రాజులు ఎదుట లేకున్నను, తత్కీర్తి బింబము మాత్రము తద్వాఙ్మయాదర్శములో నిత్యసన్నిహితమై కనుపించుచునే యున్నది మహాకవులచేఁ దమ కావ్యాదర్శములో వర్ణితమైన (ప్రతిఫలింపఁజేయఁబడిన) ఉత్తమనాయకుల యుదార చరితమను బింబము, భౌతికవస్తు బింబమువలెఁ దాత్కాలికముగాఁ గాక నిత్యమై యుండుఁ బ్రకాశించుచునేయుండును. అని భావము.

ఇఁక "అనాఘ్రాతం పుష్పం .." అను శ్లోకములోని పుష్ప, కిసలయ, రత్న, మధు, పుణ్యఫలములు క్రమముగ, సురభిళ, సుకుమార. సుదీప్త, సుమధుర, సుకీర్త్యమైనవై శకుంతలారూపముకంటె నభిన్నములై యున్నవి ఇట్టి విశిష్టవస్తు పంచక సాన్నిధ్యముచే నాయకునిలో నాశానురాగముల నినుమడింపఁజేసి, యామె లాభమునకై నాయకుని బూర్తిగఁ బ్రేరేచినాఁడు. కాని శకుంతల "అఖండపుణ్యఫలము" కలవానికే లభ్యము కాఁగలదు కదా! దీనితో తేనిచిత్తమింకను ఆమెకై యుత్తలపడి, యతని యాస లింకను అంబర మంటినవి. దీనితో రాజు చిత్తములో రాజసము రగుల్కొన్నది. "రాజు రత్నహారికదా!" కనుక ఇఁక నెట్లైనను ఈ స్త్రీరత్నమును సంపాదించులేయాలని ముఖ్యకర్తవ్యమై యున్నది. వెంటనే రాజు విదూషకునిఁ గారణాంతర కల్పనముచేఁ బంపించివేసినాఁడు. ఇట్టి రాజసమే శకుంతలనుగూడ ఆవరించి, ఆమెను పతిధ్యానైక పరాయణగను, విషయలంపటగను దయారుచేసినది, ఆమె యిప్పటి యౌవనోద్దామత, ఆమె శాంతచిత్తమును కల్లోలితమొనర్చి విషయవాగురలో నామెనుజిక్కింపఁజేసినది. అహా! యౌవనవిజృంభణశక్తి యెంతటివారినైనను జీకాకుపఱచునుగదా !

"అంచితమందాక్షంబులు । సంచితదరహాసకాంతిసౌభాగ్యంబుల్ ।
వంచితసుజ్ఞానధనా ॥ భ్యంచితములు విషమదములు
యౌవనభరముల్"

ఇట్లు మన సౌందర్య తత్త్వవేత్త, శకుంతలయొక్క భౌతిక సౌందర్య సర్వస్వము నొక్కుమ్మడిగ నొలికించి, ఇట్టి యస్థిర సౌందర్య తారళ్యముచేఁ గల్గిన యామె భావచాంచల్యాఽహంకారాఽశాంత్యాదులను భావి దూర్వాసశాపమునకు మూలకములుగఁ జిత్రించి, యుద్దీపన విభావ భావితులైన యీ నూత్ననాయికా నాయకులను ఒక్కసారి మన కవి కలిపి చూచినాఁడు. ఈయపరిణామదశలో నున్న వీరి యీ కలయిక కేవల కాముకత్వ ప్రధానమైనది. "మోహేహ్యక సక్తస్స జనో జఘన్యః" అను సూక్తి ననుసరించి కేవల "కామ" పురుషార్థ సేవనము మన వైవాహిక సంప్రదాయరీత్యా నింద్యమైనది. "దాతా ధర్మార్థకామేషు, త్వయా, ఏషా, న, అతిచరితవ్యా" అని మొదటి నిబంధనము. అస్థిర యౌవనోద్వేగ మచిరమైనట్లు, అస్థిర కాముకత్వముకూడ అచిరమై ప్రేమను అస్థిరముసేయును.

అస్థిరమగు నిట్టి యౌవనోద్వేగమువలన జనించిన ప్రేమ అస్థిరమగుటయే కాక, విషాదాంతముకూడఁ గాఁగలదు. మంగళాంతముకావలసిన భారతీయ సంస్కృతికిఁ బై విషాదాంతరీతి విపరీతమైనది. మన భారతీయ ప్రణయము పుత్రోదయఫలకమై పిమ్మట, ఆధ్యాత్మిక ప్రేమముతోఁ గలిసి విశ్వప్రేమముగ విస్తృతము కావలసియున్నది. ఇట్టి మన సంస్కృతికి మంగళాలంకార మనఁదగిన మన మహాకవి సమయము దొరకినప్పుడెల్లఁ బై విశిష్టవిషయమును వాచ్యముగనో+ వ్యంగ్యముగనో సూచించుచునేయున్నాఁడు పైశ్లోకములోని "అఖండం పుణ్యానాం ఫలమివచతద్రూప" మ్మనుటచేత పుణ్యఫలము తపస్సా

+ "వార్ధకేమునివృత్తీనాం యోగేనాంతే తనుత్యజాం" రఘువంశము స॥

ధ్యమనియు, నీతపము చిత్తశుద్ధికిఁ గారణమై యాధ్యాత్మిక చింతనకు మార్గదర్శకమగుననియు, నిట్టి యాధ్యాత్మికతత్త్వము ప్రధానముగ, లేక చరమలక్ష్యముగాఁగల ప్రేమయే శాశ్వతానందదాయకమైన నిజమగు భారతీయప్రేమ యని యిట మన మహాకవి వ్యంగ్యమర్యాదచే సూచించినాఁడు. మఱియు :-

"అనాఘ్రాతం" అను శ్లోకములోని "పుష్పం" మున్నగువస్తు పంచకము జ్ఞానేంద్రియగ్రాహ్యమై (జ్ఞానేంద్రియమైన ఘ్రాణేంద్రియమే "పుష్పము"ను దెలిసికొనఁగలదు) శకుంతలా రూపమగుచున్నది. కనుక శకుంతలా రూపము, అనఁగా శాకుంతల కథారూపతత్త్వము జ్ఞానముచేత గ్రాహ్యమైనది. అనఁగా "తత్త్వము జ్ఞానదృష్టికే గోచరమగును." అను ధ్వన్యర్థ మిట కవిచే నిక్షిప్తము. పై విషయము "కాళిదాసు- తత్త్వజ్ఞానవైభవము" అను వ్యాసభాగమున విస్పష్టము చేయఁబడినది. ఇట్లైహికవిషయములతో నాముష్మికవిషయములు మిళితములైయుండుట ఈకవి కవితలోని ప్రత్యేకత.

పై విధముగ మనకవి, శకుంతలా భౌతికసౌందర్య సర్వస్వముతో నాయకుని భౌతికవాంఛల రేకెత్తించి, తపోవనమున కకారణబంధువైన శకుంతలను దుష్యంతుని- అంతఃపుర స్త్రీరత్నసంయుక్తుని ప్రేమవాగురలో నొక్కమాఱుగఁ జిక్కునట్లు చేసినాఁడు. శాఠ్యమెఱుఁగని శకుంతల సులభముగ రాజునకుఁ జిక్కినది- ఇపుడీమె తనతొల్లిటి శాంతిపదమునుండి పతితయైనట్లు కూడ నామెకుఁ దెలియదు. కనుకనే యిప్పటి యీమె పరిస్థితిని వర్ణించుచు రవీంద్ర కవీంద్రుఁడు ఆరణ్యక పుష్పముపై "దుమ్ము" పడినను అది, ఆపుష్ప సౌందర్యమునకుఁ బ్రతిబంధకముకాలేదు" అని నుడివినాఁడు * కనుకనే యాపుష్పదళముల

* "Dust settles on the flower of the forest. But in spite of it she easily retains her own beautiful cleanliness"

నైసర్గికశోభ, మాలిన్యయుతమైనపుడుకూడ చెక్కుచెదరక అట్లే (యథాపూర్వముగ) నిలిచియున్నది.

నైర్మల్యముతో నిత్యప్రకాశమానమైన యిట్టి స్వాభావిక సౌందర్యవిశేషమును దుష్యంత ముఖమున మనకవి యిట్లు పలికించినాడు.

"శుద్ధాంత దుర్లభ మిదంవపురాశ్రమవాసినో యదిజనస్య ।
దూరీకృతాః ఖలుగుణైరుద్యానలతా వనలతాభిః"(అంకము 1)

ఈ యాశ్రమవాసినుల యందు నైజముగ భాసించుచున్న రూపవైభవము, అంతఃపురస్త్రీలకుఁగూడ అలభ్యమేయైనదైనచో, నీ తపోవనలతలు తమ స్వాభావిక సుగుణగణముచే, నుద్యానవనలతలను వెనుకకు నెట్టుచున్నవి. ఇట్టి సుగుణముల చేతనే ఆశ్రమ కురంగము వలె భయసందేహము లెఱుంగని శకుంతల సులభముగనే రాజునకుఁ జిక్కినది. శ్రీ రవీంద్ర కవీంద్రుఁ డనినట్లు "సులభముగ సంప్రాప్తమైనది సులభముగనే సురిగిపోవును." కనుక ఇట శకుంతలా దుష్యంతుల భౌతిక-అస్థిర శారీరక సంసర్గమును శాశ్వతానందదాయకమగు నైతిక (మానసిక) సమ్మేళనముగా దిద్ది తీర్చవలసిన బాధ్యత యిఁక మన మహాకవిపై నున్నది.

ఇప్పుడు శకుంతల దుష్యంత పరిణీతయై తన స్వార్థసంయుత ప్రేమసామ్రాజ్యమునకు ఒక్క దుష్యంత సార్వభౌమునే సార్వభౌముని గఁ జేసికొన్నది. ఇప్పుడామె హృదయమున ఒక్క "దుష్యంతునకు" వినా మఱియేయొక్కరికిని- చెలికత్తెలకుగాని, తుదకుఁ బ్రాణాధికమైన "వనజ్యోత్స్న"కుఁగాని ♦ చోటులేదు. సంకుచిత హృదయముల లో "విశ్వప్రేమము"నకు విశిష్టస్థానము లభించదుగదా! నాల్గురోజులలోఁ దన యంతఃపురమునకుఁ దీసికొని వెళ్ళెదనని నమ్మించి వెళ్ళిన

♦ ..అనసూయా -: త్వయాస్మృతినామ ధేయా వనజ్యోత్స్నతిఏవాంవిస్మృతాసి
శకుంతలా -: తథా యది ఆత్మానమపి విస్మరిష్యామి. (అంకము 1)

నాథునివద్దనుండి యెట్టివార్తయు రాదయ్యె. కనుక అనన్యమానసయై శకుంతల పతిధ్యాన ముద్రిత చిత్తయై యున్నది ఇట్టిసమయమున సులభకోపనుఁడైన దూర్వాసమహర్షి వచ్చి, తదేకచిత్తయై, తద్ధ్యాననిమగ్నయై యున్న యామెకు దుర్భరశాపమిచ్చి వెడలినాఁడు. ఇట్టి శాప వార్తనుగూడ నామె వినలేదయ్యె. ఈకవి తన రఘువంశ కావ్యమునఁ జెప్పినట్లు "ప్రతిబధ్నాతిహి శ్రేయః పూజ్యపూజావ్యతిక్రమః" పూజ్యులను బూజింపకుండుట తమ భావి శ్రేయస్సునకుఁ బ్రతిబంధకమేయగును. కనుక నీమె దుర్వాసముని విషయమునఁ జేసినపూజా వ్యతిక్రమము, ఈమె భావిశ్రేయమునకు విఘ్నముగ మాఱినది. ఇట్టి సంఘటన మిట మన కవీంద్రునిచే బుద్ధిపూర్వకముగనే చేయఁబడినది. ఇట్టి విషమసంఘటనమునే మన మహాకవి యిట కల్పించకున్నచో, శకుంతలయొక్క పూర్వ శాంతినికేతన జీవిత గౌరవమంతయుఁ గలుషితమై యది యింకొకలాగునఁ బరిణమించి, శకుంతలను "భరతమాత" అను ప్రపంచ ప్రశస్తినుండి దూరము చేసియుండెడిది.

ఒకవేళ మన కవి కరుణించి యీ నాయికా నాయకులను దూర్వాస శాపహతి నుండి కాపాడి పండువంటి కాపురములో వెంటనే ప్రవేశపెట్టినాఁ డనుకొనుఁడు. అప్పుడు శకుంతల తన పొంగారు నిండుజవ్వనములో రాజాంతఃపురమున రాజ్ఞీపీఠ మధివసించి. నిరాఘాటమైన తన యాజ్ఞను జలాయించుచు నామె తన భావిజీవితమును బూర్తిగ రాజసమునకే యంకితము చేసియుండెడిది. యౌవనము, ధనసంపత్తి, ప్రభుత్వము, అవివేకిత్వము" అను నీ దుష్టచతుష్టయములో నేయొక్కటి యున్నను అనర్థమున కది దారిసూపుచుండగా నీ నాల్గును నొక్కచో * గూడియున్నచో నచ్చట అనర్థ పరంపరలు

* "యౌవనం ధనసంపత్తిః ప్రభుత్వమవివేకితా । ఏకైకమప్యనర్థాయ కిము యత్ర చతుష్టయం" (హితోపదేశసూక్తి)

దమంతదామూ వలచివచ్చునుగదా! ఇంతియేకాక శకుంతల, పతిగృహమున వెంటనే కాపురముసేయ సమకట్టెఁ జో భారతీయ పవిత్రప్రణయ ప్రాభవములోని గురుత్వ, మహత్త్వ, పటుత్వ సంపదలు మనకింతగాఁ దెలిసియుండెడివికావు. కనుకనే మన సౌందర్యవిదగ్ధుఁడు (కాళిదాసు) క్రొంగ్రొత్తగాఁ గాఁపురమునకు వచ్చిన యీ సౌందర్యరాశి, శకుంతలకు రాజగృహమునఁగాని, తుదకు పతి చిత్తమునఁగాని (శాపసాధనముచే) రవంతయైనను స్థానము దొరకనీలేదు. ఇఁక నీమెకుఁ గణ్వాశ్రమములోఁ గూడ స్థానములేదు. భారతీయవనితామ తల్లులకుఁ బతిగృహమున దాస్యమైనను గౌరవప్రదమైనదే. కనుకఁ బతినిరాకృతయైన యిప్పటి శకుంతల యగతికయై "భగవతివసుధే! దేహిమేవివరమ్మ"ని దుఃఖించుచు నంతర్ధానమందినది. (ఇది పూర్వభాగము)

ఐహికాముష్మికములేగాక, సౌందర్యముకూడ శక్తివంతమై, చరితార్థతనందుటకు "తపస్సు" ప్రథమసాధనమైనట్లు మనము గిరిజా సౌందర్య వర్ణనాభాగమునఁ దెలిసికొనియుంటిమి. ఆతపస్సునకుఁ బవిత్రవాతావరణ మత్యవసరమైనది. కనుక గౌరికి గౌరీశంకరశిఖరము వలె నీమెకు మన కవిమహర్షి, మారీచమహర్షియొక్క- దివ్యాశ్రమము తపశ్చరణానుకూలముగఁ జేసినాఁడు. అట ఆమెచేఁ గఠినాతికఠినమైన తపస్సుఁజేయించి, యామె సౌందర్యాహంకార కిల్బిషమంతటిని క్షాళితముఁజేసి, యామె నొక వినిర్మలసౌందర్య విరాజితమూర్తిగఁ బరిణమింపఁజేసినాఁడు. అట దుష్యంతుని చిత్తములో నభిజ్ఞానాంగుళీయక దర్శనముతోఁ బరితాపాగ్నిని బ్రజ్వరిల్లఁజేసినాఁడు. ధర్మరక్షణార్థమై ధర్మాసన మధిష్ఠించిన తాను (దుష్యంతుఁడు) ఒక పూతచరిత్రయెడ- ఒక యమాయికయెడఁ గావించిన దారుణకృత్యముఁ దలంచినకొలందియు నది వానియెడందను గాల్చిచ్చువలెఁ గాల్చివేయుచున్నది. తన గృహమునకు వచ్చిన తన గృహలక్ష్మిని-

తన కులాఽభ్యుదయలక్ష్మిని- ని దానమని వచ్చిన తన జీవితానందా భ్యుదయలక్ష్మిని, నిరాకరించి పొమ్మన్న తన (రాజు) యప్పటి యా మోహప్రాబల్యము, ఆ యజ్ఞత, ఆ స్మృతి తిరోధానము తలచిన కొలందియుఁ దనలో (దుష్యంతునిలో) దుఃఖతరంగము లతివేలములై పొంగి పొరలుచున్నవి ఇట్టి పశ్చాత్తాపముచే రాజు-

"సంరోపితేప్యాత్మని ధర్మపత్నీ త్యక్తామయానామకుల ప్రతిష్ఠా।
కల్పిష్యమాణా మహతేఫలాయవసుంధరాకాల ఇవోప్తబీజా॥

"సకాలములో విత్తనములు చల్లి ఫలవంతముగఁజేసి, పంటసిద్ధమై చేతికి వచ్చుసమయములో నట్టి తన పంటపొలమును దానిచేతులార విడిచిపుచ్చిన తెలివిలేనిరైతువలె నేను (రాజు) యుక్తకాలములో [1] బీజాఽవాపనము (రేతస్సునుంచుట) చేసిన కతన మహాఫలమును (సత్పుత్రుని) బ్రసాదించుటకు సిద్ధముగనున్న-కులప్రతిష్ఠకు కారణమైన యీ నాగృహలక్ష్మిని చేతులారంగ విడిచిపుచ్చితిని" పైయుపమానముచే 'వసుంధరా' శబ్దము 'క్షేత్ర' వాచకమై "క్షేత్రం కళత్రే కేదారే" అని తనభార్యనే సూచించుచున్నది. భార్యావాచకమైన యీ "వసుంధర" "మహాఫలప్రదాత్రి" కౌరా! ఎంతటి సారస్యము. ఇంతటి మంచిపంట పొలమును-సిద్ధముగ ఫలమునీఁగలతనక్షేత్రమును దనచేతులార విడిచినరైతు మెంతటి యవివేకి ? కాని ప్రబలమైనకారణాంతరముచేఁ దనపంటపొలమును రైతునే తన కాలఁదన్నినాఁడు. తిరిగి స్మృతిగలిగి, తన యవివేకిత్వము తనకే తెలియఁగల సుసమయము ప్రాప్తమైనది. ఐననేమి ? "గతజలసేతుబంధనమే" ఇట్టి విచిత్ర సన్నివేశముగల పై యుపమానబలముచే రాజునకుఁ బ్రాప్తించవలసిన రెండు ప్రధానప్రయోజనములిట (శకుంతలాత్యాగముచే) భగ్నము

[1] పతియే భార్యగర్భమునఁ బ్రవేశించును. పతిర్భార్యాం సంప్రవిశ్య గర్భోభూత్వేహజాయతే (మనుస్మృతి)

లైనవి. "సిద్ధమన్నం ఫలంపక్వం నారీ ప్రథమయౌవనం। సువాసితంచ తాంబూలం సద్యోగృహ్ణాతిబుద్ధిమాన్" అను సూక్తిచే శకుంతలా త్యాగకారణముగ రాజునకు ఐహికభోగరాహిత్యమే కాక, "పున్నామ్నోనరకాత్త్రాయత ఇతి పుత్రః" అనునట్లు పుత్రోత్పత్తికి ఆది కారణమైన యామెను విడనాడుటచే, వంశవిచ్ఛేదము అను రెండవ మహోపసర్గముగూడఁ గలిగినది. అపుత్రికుఁడైన సార్థవాహవృత్తాంత కల్పనచేఁ గవి, రాజును మూర్ఛాకరవశునిఁ జేసి, ఇట రాజుయొక్క యజ్ఞతాదురిత జాలమంతయు నంతరించుటకై తగినంత ప్రాయశ్చిత్తమును గూర్చినాఁడు. దీనితో రాజునకు "చిత్తశుద్ధి" చేకూర్చి చిత్తము వినిర్మలమై భారతీయ పవిత్రప్రణయానుభవమునకుఁ బాత్రత చేకూర్చినవి. ఈ శుభసమయములో శకుంతల-వినిర్మల ప్రణయమూర్తి-విశ్వప్రేమ విరాజితవిశుద్ధగాత్రి-ఎంతదుర్లభవస్తువో! ఎంతటియారాధ్యమూర్తియో, తనఁ(రాజు)కైహికాముష్మిక సుఖంబుల కెంతటిమూలకందమో దుష్యంతున కిప్పుడయవగతమైనది. అట గిరిజతపశ్చరణానంతరమున శివున కెంతటి సత్యసౌందర్య రూపిణియైనదో, యిట దుష్యంతునకు శకుంతల యిప్పటి నంత సత్యసౌందర్యరూపిణిగ భాసించుచున్నది. ఇఁకఁ దద్విరహవినోదమునకై యామెను జిత్రించి వినోదించుటకైనను ఇప్పటి యొక్క భావములో భాసించుచున్న యామె సత్య నిత్య నిరవద్య సౌందర్యమును జిత్తరువున రాజు చిత్రింపలేకున్నాఁడు. "యద్యత్సాధున చిత్రేస్యాత్క్రియతే తత్తదన్యథా । తథాపితస్యాలావణ్యం రేఖయా కించిదన్వితం" (అంకము 6 శ్లో 13) రమ్యముకాని భాగమును దిద్ది తీర్చి మనోహరముగఁ జేయుటకుఁ జిత్రము ముఖ్య సాధనము. అట్టి చిత్రములోఁ గూడ నిప్పటి శకుంతలా సౌందర్య సర్వస్వములో రేఖామాత్రమే చిత్రించుటకు సాధ్యమగుచున్నదిట. ఆహా! మనకవి యెంతటి సౌందర్యతత్త్వవేత్తయో కదా! ఈదివ్య సౌందర్య

వైభవము "యతోవాచోనివర్తంతే" అను నుపనిషత్సూక్తిని దల పించుచున్నది. ఇప్పుడీమె రాజునొక్క ప్రేమలప్రణయ స్వారాజ్య మునకు ఏకైకరాజ్ఞియైనది. ఇక రాజున కేకైకధ్యేయ మీమెయే. ఇంక నీమె తనకు లభించుటెట్లు ? కనుక నీమెకై విలపనమే రాజునకింక శర ణ్యము. శ్రీరామచంద్రునకుకూడ నిండుచూలాలైన సీతాదేవిని లోకారాధనమునకై * అరణ్యములపాలుచేసి యామె ప్రణయమును దలంచుకొని యిట్లే విలపించినాడు. "ఇయంగేహే లక్ష్మీః ఇయ మమృతవర్తిర్నయనయోః। కి మస్యాన ప్రేయో యదిపున రసహ్యోన విరహః॥ ఉ. రా. చ. నాటకము సీత శ్రీరామచంద్రుని గృహలక్ష్మి ఒక్క గృహలక్ష్మియే కాదు. ఆమె రాముని నేత్రముల కమృతదీపము; ఆనందలక్ష్మి; మఱియు సీత రామునికులాభ్యుదయలక్ష్మి; భారతీయ వనితా పాతివ్రత్యకీర్తిలక్ష్మి; ఇట్టి తనయర్ధాంగలక్ష్మి సంబంధములగు చెయిదములన్నియుఁ దనకు (రామునకు) ఆనందజనకములేగాక ఒక్క యామెవిరహము మాత్రమిప్పుడు దుర్భరమగుచున్నది. ఇట్లే దుష్యం తునకు శకుంతలావిరహముకూడ దుర్భరమై యామెయందుఁ బూజ్య భావమతిశయింపఁ జేయుచున్నది. ఇప్పట్టున నామె తిరిగి తనకు దర్శన మిచ్చినచో నీతని శుష్కజీవితవృక్ష మొక్కుమ్మడిగఁ జిగుళ్ళుదొడిగి కుసుమితమై స్తబకితమై ఫలించును. ఈసందర్భమున బృహదారణ్య కోపనిషత్సూక్తి కొకటి స్మర్తమైయున్నది."

"నవా అరే! జాయాయై కామాయ జాయాప్రియాభవతి ఆత్మ నస్తు కామాయ జాయాప్రియాభవతి॥" (బృహదారణ్యకము 2-4-5) కేవలం భౌతిక భోగదృష్టితోనే యొక్కడును భార్యను నిత్య ముగ ప్రేమించలేదు. ఇంక నామెయందలి (యంతరాత్మ) ఆధ్యాత్మి

---

* "...అపివా జానకీమపి। ఆరాధనాయలోకస్య ముంచతో నాస్తి మేవ్యథా॥"
(ఉ. రా. చ. నాటకము.)

కప్రేమముచేఁ బతి ఆమెను నిత్యముగఁ బ్రేమింపఁగల్గుచున్నాఁడు. "ఇది నిజమేకదా! ఇదివఱకు కీమెయం దతనికిఁగల భౌతికచాంచల్య ప్రేమ యిపుడు స్థిరమై యాధ్యాత్మికప్రేమగను నిదియే విశ్వప్రేమగను బరిణమించినదిగదా! భారతీయుల యాదర్శదాంపత్యమునకు శారదామణిని ప్రణయదేవతగఁ బూజించిన రామకృష్ణపరమహంస యొక్క యాదర్శ దివ్యప్రేమయే ప్రత్యక్షప్రమాణము. ఇతఁడు తన భార్యను భార్యగా నిత్యముగఁ బ్రేమించలేదు.

ఇట్లు మన మహాకవి పశ్చాత్తాప తపస్సన్నివేశముతో నాయికానాయకుల కామవృత్తిని మథించి వీరిరువురకుఁ జిత్తశుద్ధిని సమకూర్చి వీరిని పవిత్రప్రణయ ప్రకాశిత ప్రవిమలమూర్తులుగ రూపొందించినాఁడు. ఇటుపైని వీరిప్రేమ వెనుకటివలె వికారవిషాదములను జనింపఁజేయునదికాక నిర్మలమై, సర్వసంఘపరివ్యాప్తమై, భారతీయ దాంపత్య ప్రభావమును బ్రకాశింపఁజేయఁజాలియున్నది. దుష్యంతుని దృష్టికిపుడు శకుంతల మహిమాన్వితమగు నొక దివ్యప్రేమజ్యోతి. జీవనజ్యోతి.

ఇప్పటికి మన కవీంద్రుని యభిలషితమంతయు ఫలించినది. కనుక నిటుపైని నీ ప్రణయమూర్తులను ఒకయింటివారినిగఁ జేయవలసియున్నది. ఇందుకనియే నాయకునకు దేవేంద్రసహాయార్థమై నాకలోకప్రయాణము కల్పితమైనది. ఈ స్వర్లోకయాత్రతో మర్త్యత్వమునకు అమర్త్యత్వము భౌతికమునకు ఆధ్యాత్మికత్వము ప్రాప్తమైనది. చూచుచుండగనే భూలోక మొక్కసారిగ స్వర్గలోకముగ పరిణతమైనది. ఇంద్రసమ్మానముచే నాయకునిలో దివ్యత్వము దీపించినది. ఇక దివ్యప్రణయలాభప్రాప్తి కావలసియున్నది. కనుకనే స్వర్గమునుండి వచ్చునపుడు మారీచమహర్షిని దర్శించుకోరిక రాజునకుఁ గలిగినది. ఈకోరిక రాజునకుఁ బుత్త్రసందర్శన జనితసమ్మోదమునకు, శకుంత

లాపునస్సమాగమరూప మహాఽభ్యుదయమునకు మూలమైనది. + మహాత్ముల సందర్శనభాగ్యము మానవజీవితమునకు మహాఽభ్యుదయసంపాదనాసమర్థమైనదికదా! ఈదివ్యాఽశ్రమములో రాజునకు నైదేండ్ల బాలుఁడొకఁడు తల్లిపాదుగులోనున్న సింహశిశువును బలాత్కారముగలాగి దానితో నాడుకొనుచుఁ గన్నులపండువుగఁ గానుపించినాఁడు. ఈసన్నివేశముతో రాజుచిత్తములోని భాతికసందేహతరంగములు ఒక్కసారిగ నుచ్చలితములైనవి. తుదకా దౌష్యంతి దుష్యంతునకు ఆత్మజ్ఞానము (తాను ఆత్మస్వరూపమే అను జ్ఞానము; లేక "ఆత్మావైపుత్రనామాసి" అని ఈబాలుఁడు తన స్వరూపమే అను నిశ్చయజ్ఞానము) కలిగించి, వానికి మానుషానందమునంతను నొక్కసారిగఁ గలుగజేయును. ఆత్మజ్ఞానలాభముగొన్నవానికిబ్రహ్మానందము సులభమేకదా! ఇఁక రాజు, ముక్తుఁడైహికబంధవిముక్తుఁడైనట్లు పితృఋణవిముక్తితో ఋణవిముక్తిని బడయును. ఈవిముక్తితో నీరాజునకు జీవన్ముక్తునకు మోక్షలక్ష్మీప్రాప్తివలె వెన్వెంటనే శకుంతలాసమాగమరూప మహాభ్యుదయము చేకూఱినది. ఇప్పటి శకుంతలారూపమిదిగో.

"వసనే పరిధూసరే వసానా నియమక్షామముఖీ ధృతైకవేణీ ।

అతినిష్కరుణస్య శుద్ధశీలా మమ దీర్ఘం విరహవ్రతం బిభర్తి" (7-21)

ధూళిధూసరితములైన వస్త్రములను ధరించి, కఠిన తపోనియమములతోఁ గృశించిన ముఖముకలదై ఒకేజడను ధరించి విశుద్ధశీలయై యీామె యతికఠినాత్ముఁడనైన నావిరహవ్రతము నిట్లు సాగించుచు

+ "ఈసన్నివేశకల్పనముచే మన మహాకవి" "ధర్మప్రజాసంపత్త్యర్థం స్త్రియముద్వహే" అని ఆదిలో వరుఁడు చేసిన వాగ్దానమును సార్థకముచేసి గృహ్యసూత్రప్రకారముగ భారతీయ దివ్య సంప్రదాయమునిటఁ బోషించినాఁడు.

న్నది. స్త్రీలకు "విశుద్ధశీలము" సత్య సౌందర్య సంపాదకమైనట్లు "తథాహి తే శీలము దారధర్మనే! తపస్వి నామప్యుపదేశతాంగతం" అని కుమార సంభవసూక్తిసువ్యక్తము చేసిన ట్లిచ్చటగూడ "శుద్ధ శీలా" అను విశేషణము శకుంతలాసౌందర్యములో సత్య, నిత్య, నిర వద్య, నిరంతరనిస్తులసౌందర్యమును దీపింపఁజేయుచునే యున్నది. ఇట్టి దియు నిత్యోత్కర్షణోల్లసితమైనదై, "ప్రియేషు సౌభాగ్యఫలాహి చారుతా" అను చారుత్వ లక్షణ లక్షితమై ప్రియుని నేత్రచకోరము లకుఁ జంద్రికయే యగుచున్నది. కనుక నిప్పటి శకుంతలలో నీతని కదేదో మహత్తర ప్రభావభాషితమైన—పవిత్రతేజస్సందీప్తమైన—దివ్యసౌందర్య మగపడుచున్నది. కనుక నాదరభక్తి భావములతోఁ గూడిన పవిత్ర ప్రణయభావ మీమెయెడఁ జూపుచు రాజు ఆ పతి వ్రతతో "ప్రియే! క్రౌర్యమపి మే త్వయి ప్రయుక్త మనుకూలపరిణా మంసంవృత్తం" "ప్రాణేశ్వరీ! నేను ముందుగ నీవిషయములోఁ జూపిన నాక్రౌర్యభావమిపుడు అనుకూలమైన (అభినంద్యమైన) పరిణా మము కలదైనది" అని పలుకును. ఇప్పటి శకుంతల భరతమాత యైనది. ఈమెలోని యిప్పటి "ప్రేమ" వాత్సల్యరూపమై సర్వ జీవ కోటియందును సమానమై శాశ్వతసౌజన్యముతో శోభిల్లుచున్నది. ఈమె నైష్ఠికసౌందర్య మిపుడు 'సత్య'మై లోక "శివం"కరమై నిత్యమై తేజరిల్లుచున్నది. 'గథే' మహాశయుఁడనినట్లు నవ వికాస విలసితము లగు పుష్పములు క్రమముగ తమపరిణామరూపములైన ఫలముల మధురిమలతోఁ జెందిన సరసస మ్మేళనమువంటిదే శకుంతలా దుష్యం తుల కీ సుముహూర్తసమయమున జరిగిన నైతికసమ్మేళనము. ఈస మ్మేళనము ఈదివ్యభూమిలో దివ్యప్రణయస్వర్గమైనది. ఇఁక వీరి యీ పవిత్రప్రణయము ఎన్నటికిని జలించనిది; కృశించనిది; క్షీణనిది. ఇఁక

భూతలముకూడ కాళిదాస కమనీయ కవితా గౌరవముచే నతిసహజముగనే స్వర్గముగఁ బరిణమించినది.

"The earth and Heaven itself in one sole...name combine అన్న గథే కవీంద్రుని పద్యభావమిట సార్థకమైనది.

ఇంతవఱకుఁ గల నాభావములను వివరించుచున్నట్లున్న శ్రీ రవీంద్రకవీంద్రుని భావరత్నములఁ గొన్నిటినిటఁ బొందుపఱచెదను.

The poet has shown here, as in Kumarasambhava that the beauty that goes hand in hand with moral love is eternal, that the calm, controlled, and beneficent form of love is its best form, that beauty is truly charming under restraint and decays quickly when it gets wild and unfettered.

He teaches us that the love of man and woman is not, beautiful, not lasting 'not fruitful, so long as it is self- centered, so long as it does not beget goodness, so long as it does not diffuse itself into society over son and daughter, guests and neighbours.

The beauty that he adores is lit up by grace· modesty, and goodness ! in its intensity it is true to one forever; in its range it embracas the whole universe. flt is fulfilled by renunciation, gratified by sorrow, and rendered eternal by religion. In the midst of this beauty the impetuous unruly love of man and woman. has restrained itself and attained to a profound place like a wild torrent merged in the ocean of goodness, Therefore such love is higher and more wonderful than wild and untrained passion·

రవీంద్రునిపై యాఙ్గ్లమాతృకకిది శ్రీ బొ. పురుషోత్తము M. A. గారి యాంధ్రానువాదము. (చూ. కాళిదాసకవిత) "ధర్మమున కవిరుద్ధముగా ప్రేమభావముతో నడచు సౌందర్యము శాశ్వతమైనది......

నైష్ఠికసౌందర్యమే శుభప్రదమై నిత్యోత్కర్షణోల్లసితమైనది. నియమరహితమును, సంస్కృతమునగు సౌందర్యము క్షణభంగురము. కవి యిట్టి పవిత్రభావములను కుమారసంభవమునందువలె నిందును (శాకుంతలమున) కాంతాసమ్మిశ్రముగా నుపదేశించెను. . . . దంపతులప్రేమ స్వార్థయుతమైనచో నెట్టి సత్ఫలితముల నొసంగదనియు, వాత్సల్యరూపమున సంఘమునందుఁ బరివ్యాప్తము కానంతవఱకును దాని కెట్టి సౌందర్యముకాని, శాశ్వతత్వముకాని, చరితార్థతకాని లేదనియు నీకాళిదాసమహాకవి ముక్తకంఠమున నుద్ఘోషించెను. . . కాళిదాసుని సౌందర్యజగత్తు జీవకళతోఁ గళకళలాడునది సౌజన్యముతో శోభిల్లునది. సాధుత్వమును సనదరించుకొన్నది. సువిశాల విశ్వమును సుగుచిరప్రేమభావముతో నాలింగన మొనర్చుకొన్నది. కాళిదాస ప్రతిపాదిత సౌందర్యము త్యాగముచే సిద్ధించును. దుఃఖముచే నూతనత్వమును బొందును. తపస్సుచే దివ్యత్వము నార్జించును. ఇట్టి దివ్యసౌందర్యార్ణవమునందు నియమరహితములైన కామోద్రిక్తతా ప్రవాహములు అనేకములు సంగమించి (భారతీయ) ప్రణయభావసిద్ధితోఁ బరిపూర్ణతను అనుభవించును సకలప్రపంచమును అట్టి దివ్యసౌందర్యధామము (నిలయము)గాఁ బరివర్తింపఁబడవలయుననియే (మన) శ్రీ కాళిదాసకవీంద్రుని యాశయము."

పై రవీంద్ర కవీంద్రుని యాశయములకు మన మహాకవి శాకుంతలనాటకము పూర్తిగఁ బాత్రమైయున్నట్లు పైవిషయములనుబట్టి తెలిసికొనియుంటిమి. ఇట్లీ భారతీయుల పవిత్ర ప్రణయప్రాభవమును దన మహాకావ్యములముఖమునఁ బ్రపంచమునకుఁ జాటి, భారతజాతిని తరతరాలవఱకుఁ బతిష్ఠముగను, మహిమాన్వితముగను దిద్దితీర్చి, ప్రపంచములో మనకొక ప్రత్యేకస్థానమును బ్రసాదింపఁజేసిన కాళిదాసమహాకవికి నిజముగ మనమందఱము ఋణపడియుంటిమి. మఱియు

స్వార్థ సంకుచితప్రేమను విశ్వమానవ ప్రేమగాఁ బరిణమింపఁజేసి, భూమండలమునంతను నేకకుటుంబముగ +నాదరభావముతోఁ జూడఁ గల్గిన-ప్రకృతియంతటిలోఁ దన ప్రేమామృతము నొలికించి స్థావర జంగమరూప ప్రపంచమంతటిని సమానగౌరవముతో, సమానప్రేమ తోఁ జూడఁగల్గిన జాతీయమహాకవి కాళిదాసమహాకవి ఇట్టి జాతీయ మహాకవియొక్క కావ్యసందేశమూలముననే భారతజాతియంతయు విశ్వమానవప్రేమతో విశ్వజనీనమై విశ్వమంతటిలో విశిష్టస్థానము నార్జించుకొనఁగల్గినది. కనుక మన జాతీయమహాకవి కవితను వివేచనా దృష్టితో నధ్యయనము చేసి యాతని కావ్యములలోని "విశ్వప్రేమ"తో విశ్వమునకు-ముఖ్యముగ చైనావంటి దురహంకారపూరిత దుష్టసంఘ ములకు-వెలుఁగుబాటను జూపుట విజ్ఞుల కర్తవ్యమై యున్నది.

"సర్వస్య సద్భావనాఽస్తు విశ్వస్య కళ్యాణమస్తు
లోకాస్సమస్తా స్సుఖినోభవంతు" ఇతిశం జగజ్జనస్యర్పణమస్తు.

"ఓం తత్సత్"

+ "ఉదార చరితానాంతు వసుధైవ కుటుంబకం."

పంచారామములు పరమశివక్షేత్రములే

చిలుకూరి పాపయ్యశాస్త్రి.

పాశ్చాత్యులొఱవడి పెట్టిన పద్ధతిలో భారతీయసారస్వతమును చారిత్రిక నిదర్శనముల సమన్వయముతోఁ బరిశీలింప మొదలుపెట్టి సరికి, చాలవిషయములలో నేకవాక్యత కుదురుటలేదు. మన పురాణములలోఁ గానవచ్చెడి విషయములకు, ఇప్పటివిమర్శకుల సమన్వయమునకుఁ జాల అంతర మేర్పడుచున్నది. శాసనాద్యాధారములతోను పురావస్తుతత్త్వ పరిశీలనములతోను పరిశోధనము గావించుచు వచ్చుసరికి వెనుకటి సిద్ధాంతములు, అనఁగా నేటికిఁ బది వత్సరముల వెనుక నేర్పఱచుకొన్న సిద్ధాంతముల నీనాఁడు మార్చుకొనవలసి వచ్చుచున్నది. ఉదాహరణమున కింతకుముందు, పల్నాటి పరిసరములకుఁ బాలకులుగానుండిన ఇక్ష్వాకులు బౌద్ధమతావలంబకు లనుకొనుచు వచ్చుచుండఁగా, నాగార్జునకొండ త్రవ్వకములలో బయటఁబడిన, వారికాలమునాఁటివిగా గుర్తింపఁబడిన అశ్వమేధయాగచిహ్నములు, శివకేశవాదిమూర్తులు, దేవళములు విహారములు స్తూపములు ఈనాఁడు బయటఁబడునప్పటికి, వారిలో పురుషులు వైదికమతావలంబులనియు, స్త్రీలు బౌద్ధాదిమతానుయాయినులనియు ననుకొనవలసివచ్చినది. వారికాలములో సర్వమతసహనమే యున్నట్లు కాన్పించుచున్నది. శాతవాహనుల పాలనకాలములోనివిషయముగూడ నంతటిదే.

ఈవిధముగనే త్రిలింగదేశమధ్యమునందున్న పంచారామములు పరమశివక్షేత్రములని, మనపురాణములు ఆ యా క్షేత్రములందున్న ప్రాచీనశాసనములు తెలుపుచుండ, అవి బౌద్ధసంఘారామములేయనియు, శైవమతము మనదేశములోఁ బ్రబలినది మొదలు సంఘారామములందలి ఆయకస్తంభములే శివలింగములుగాను, విహారస్తూపాదికములే ఆలయములుగా మాఱినవని, ఈమార్పు మతవ్యాప్తిమూలమున నేర్పడినదని యొకసిద్ధాంత మేర్పడినది. ఆంగ్లభాషలో త్రిలింగ

దేశమునకు సంబంధించిన చరిత్రమును నిర్మింపఁబూనినవారు, తదను యాయులు నీసిద్ధాంతము బయలుదేరినది మొదలుగ నీనాఁటివఱకు నీవిషయమునే పురశ్చరణ చేయుచున్నారు. చరిత్రకారులని ప్రఖ్యాతులైనవారి రచనములందంతట నిది కానవచ్చుచున్నది. ఈ సిద్ధాంత మెంతవఱకు పరిగ్రాహ్యమో ? పరికింతము.

భారతదేశమునందలి శివక్షేత్రములలో శివలింగములనుగాని, విష్ణుక్షేత్రములలోని విష్ణు విగ్రహములనుగాని ప్రతిష్ఠచేయునప్పుడు తత్తదాగమోక్తపద్ధతిని శ్రుతిస్మృతిసదాచారానుసరణముగ నాయా పనులు నిర్వర్తించుటయే జరుగుచుండుననుట సర్వథా సత్యము. వైదికమతము నవలంబించి లింగాదులను ప్రతిష్ఠచేయువారు, వేదప్రామాణ్యము నంగీకరింపని యితరమతస్థు లుపయోగించిన వస్తువులను నుపయోగించుపరిపాటి యున్నట్టు లీ త్రిలింగదేశములో నేనాఁడును వినఁబడదు కనఁబడదు. కావున బౌద్ధసంఘారామాదులను శివాలయములుగా మార్చుటగాని, ఆయకస్తంభములను శివలింగములుగాఁ జేసి ప్రతిష్ఠచేయుటగాని జరిగియుండెననుట కాధారమేపాటియుఁ గానరాదు.

మొదట నిట్టియూహచేయుటకు మూలము, కృష్ణవేణీనదీతీరముననుండిన అమరేశ్వరావాసమైనక్షేత్రము అమరారామమగుచు, అచటనేయున్న ధాన్యకటకము (ధరణికోట) బౌద్ధస్తూప సంఘారామ విహారాది సమన్వితమగుటవలనను, అమరేశ్వరలింగ మొకప్పుడు పెకలింపఁబడి పునఃప్రతిష్ఠితమగుటచేతను, ఆరామమనఁగా బౌద్ధసంఘారామమేయనియు, అచటి ఆయకస్తంభములు తెల్లగానుండుట, పంచారామములలోని శివలింగములు తెల్లగానుండుటయుఁ జూచి, ఆయక స్తంభములే శివలింగములైననుటనో బౌద్ధశైవములు రెంటను సమృద్ధముగానుండిన చోటున నూహించిన సిద్ధాంతమును, బౌద్ధచిహ్నము లేపాటియుఁ గనఁబడని మిగిలిన యారామములన్నిటికి సతికింపఁ

బడినది. కొన్ని ప్రసిద్ధక్షేత్రములలోనుండెడి శివశక్తిమూర్తులు విష్ణుమూర్తులుగా మాఱినట్లుగా వార్తలు దేశమందంతటను వ్యాప్తిలోనుండుట దీని కుపోద్బలకమైనది. కాని యిట్లూహించి సిద్ధాంతీకరించుట భావ్యము కాదని నా మనవి.

ఈనాఁడు ప్రాచీనచరిత్రమును నిర్మింపఁబూనువారికి పౌరాణికవచనములకంటె, వెనుకటికాలమునందుండెడి తామ్రశిలాశాసనవాక్యములు పరమప్రమాణములు. శాసనములు తెలిపెడి విషయములు, సారస్వత ప్రతిపాదిత విషయములు ఏకవాక్యతకు వచ్చిననాఁడు చేయు నిర్ణయము నిజమైనసిద్ధాంతమగుటలో నెవ్వరికి మతభేదముండఁబోదు. ఆ పద్ధతిని పంచారామములనుగూర్చి వెనుకటిశాసనములలోఁ దెలిపియున్నవిషయమును వివరించి యాతరువాత భీమేశ్వరపురాణవాక్యము లెట్లు సమన్వితములగునో? నాయూహాపోదమునంతకుఁ దెలిపెదను. దత్తనామాత్యసోముఁడు శా. స. ౧౧౬౮ క్రీ శ. 1146 లో బెజవాడలోను, శా. స. ౧౧౭౧ క్రీ. శ. 1149 లో రాజమహేంద్రవరమునందును దాను చేసిన దానములకు పద్యశాసనములను శిలాస్తంభముల మీఁద నెలకొల్పెను. ఆ రెండు పద్యములను వివరించెదను.

భీమాపురము దాక్షారామియు [న] మాడాలు
గుడిపూఁడి యుంబొలుకొలనీఁ
భద్రేశ్వరంబున భాపట్టునం దాంబ్రి
పురిం బి [ద] పురమునంబరఁగుదూబ
ఘంటశాలాపురిం గౌతసంబుననునే
లీశ్వరఁబునను వేగీశ్వరమున
విజయవాటికనుండ విల్లివేలు ఫూరం
గరమొప్ప గొంటూరం గడలిపల్లి

కనకవలయములను ఘనలోహ వరదండ
ములు నఖండదీపములునుం బెట్టి
మ [ర] లం బెక్కు గుడ్లుం జెఱువులు గొంటూర
నిలిపె మం [త్రి] మ [తి] ం ఘ భుజంగుం.
భీమాపురము డాక రేమివాల్కలను [దా్రి, ద]
క్షారామపురి శ్రీమదమరడాలు
య [న] ను నంధ్రిధరణి పంచారామములు మహా
దేవరలకు బుద్ధదేవరకుం
జేంబోలిల నమ్మహాసేనునకును బిద
పురము హుంకారశంకరికిం గరము
నూ్ఢి కెక్కిన బెజవాడ మల్లేశ్వర
దేవరకు నఖండ దీపతతులు
వెట్టి గొంటూరం జెఱ్వులం బెక్కుగుడ్లు
నిల్పి సప్తసంతతు లసంఖ్యముగం జేసె
దత్తైనామాత్యసోముండు ధర్మపరుం డు
దారభానుజుం డాచంద్రతారకముగ.

ఈ రెండు పద్యములు కీ. శే. జయంతి రామయ్యగారు సంక లనముచేసిన శాసనపద్యమంజరిలో ప్రకటితములై యున్నవి. ఇవి దక్షి ణహిందుస్తాన శాసనసంపుటములందును ముద్రితములై యున్నవి. కీ. శే. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ఈ రెండు శాసనములను మరలఁ జదివి ప్రతివ్రాసి 1952 సం॥లో వీనిని వివరింపుమని నాకుఁ బంపినారు. ఈ రెండుపద్యములలోను పంచారామములు పరమశివక్షేత్రములుగా నిరూపింపఁబడియున్నవి. రెండవ పద్యములో పంచారామము లందలి మహాదేవరలకంటె బుద్ధదేవరను వేఱుగఁ జేర్కొనుటచేతను, తరువాత మరల శివక్షేత్రములనే నిరూపించుటచేతను పంచారామములు శివ

క్షేత్రములనుట స్పష్టము. ఈ రెండు పద్యములందును ప్రారంభములోఁ దెలిపిన పంచారామములు నొక్కటియే యనుటలో విప్రతిపత్తి యేమాత్రమును లేదు. వానిలో మొదటిది.

1. భీమాపురము—నేఁటి సామలకోట భీమవరము. దీనికి కుమారారామమనియు, స్కందారామమనియు, భీమవరము, చాళుక్య భీమవరము, చాళుక్య భీమాపురము అను నామములుండినట్లు, అచటి చాళుక్య భీమేశ్వరాలయమందున్న శాసనములనుబట్టి తెలియవచ్చుచున్నది. భీమాపురము భీమవరమనుకొని, అది పశ్చిమగోదావరిజిల్లాలో ప్రసిద్ధముగానుండిన గుణుపూఁడిభీమవరమని చాలమంది భావించుచున్నారు. ఆ భావన సరిగాదని నామనవి. కుమారస్వామిచేఁ బ్రతిష్ఠితుఁడైన భీమేశ్వరుడుండినకారణమున నది కుమారారామమైనది. చాళుక్యభీమున కది రాజధానియగుటచే భీమవరమైనది. చాళుక్యభీమున కాదేవుఁ డిష్టదేవతయగుటచే, నాలయప్రాకారాదులను నిర్మింపఁ జేయుటచే, నాయీశ్వరునకు చాళుక్య భీమేశ్వరుఁడను పేరు తరువాత వచ్చినది.

2. డాకరేమి—దాక్షారామము. దక్షారామ భీమేశ్వరాలయములోని శాసనములు 380 కి పైఁబడియున్నవి. వానిలో సంస్కృతపదముగా వాడినపుడు దక్షారామము లేక దాక్షారామము అను రూపములు గానవచ్చుచున్నవి. చాళుక్యచోళులకు సంబంధించిన శాసనములలో 'పెద్ద డాకరేమి, పెద్ద డెకరేమి, డాకరేమి' యను రూపములు గానవచ్చుచున్నవి. రాజరాజనరేంద్రుని తరువాత వేంగీదేశపాలకులుగా వచ్చిన చోళులశాసనములందే తొలుతగా నీపదము గానవచ్చుటచే నిది తమిళభాషనుండి కొనిరాఁబడినట్లే కనఁబడుచున్నది. తరువాత నిది యీసోముని శాసనములలోఁ బొడసూపుచున్నది. ఇది యిట్లుండ, డాకరేమి పదము ప్రాకృతమనియు, బౌద్ధ

వాఙ్మయము ప్రాకృతమయమనియు, ఆపదము దశారామమున కుప యోగించుటచే తొలుత నిది బౌద్ధసంఘారామమేయైయుండి, తరువాత దాశారామమైనట్టులు కొందఱూహించియున్నారు. అమరావతిలోఁ గాక, మిగిలిన నాలుగారామముల పరిసరములందు బౌద్ధచిహ్నము లేపాటియుఁ గానరాకుండుటచే నిట్టి యూహకూడ సరిపడదనియే నా మనవి.

3. అమాడాలు—అమరడాలు అని చదువుకొనవలెను. అమరడాలు అనఁగా నేఁటి అమరావతియనుపేర వ్యవహరింపఁబడు అమరారామము. అమరారామము, ధాన్యవాటి, ధాన్యకటకము, ధరణికోట ధరణకోట అను నీపదములు సమానార్థకములుగా అమరేశ్వరాలయమునందలి శాసనములలో వ్యవహరింపఁబడినవి. కృష్ణవేణీనదీతీరమున ధాన్యకటకపురిని అమరేశ్వరునిచేఁ బ్రతిష్ఠితుఁడైన యీశ్వరుఁడు అమరేశ్వరుఁడు. అతఁడు నెలకొనినచోటగుటచే అమరారామమై క్రమముగ అమరడాలై తరువాత అమరావతియైనట్లు కనఁబడుచున్నది. ధాన్యవాటియే అమరావతియైనదనుటకు- "శ్రీమతు వేమనంగారు శకవర్షంబులు ౧౧౮౩ అగు ప్లవ సంవత్సర శ్రావణ బ ౫ గు...పంచారామంబులకుఁ బ్రధమారామంబైన అమరాగామంబను ధాన్యవాటిపురంబునకు అధీశ్వరుండైన అమరేశ్వర శ్రీమన్మహాదేవరకు" అను అమరేశ్వరాలయశాసనమే నిదర్శనము. అక్కడి మఱికొన్ని శాసనములలో ధాన్యవాటి నమ్ము తేశు...దన్నలకోట అమరేశలింగమున్.. ధాన్యకటకపురవరాధీశ్వర, అమరేశ్వర మహాదేవర...ఇత్యాదిగాఁ గానవచ్చుటచే నవియన్నియుఁ బర్యాయపదములే యనుట నిశ్చయము. కృష్ణవేణీనదీతీరమున శ్రీశైల మల్లికార్జునస్వామి తరువాత నంతటి ప్రసిద్ధశివక్షేత్రము ధాన్యకటకవాసియైన యమరేశ్వరలింగమే యనుట నిశ్చయము.

4. పాలుకొలను—అనఁగా పశ్చిమగోదావరిజిల్లాలో నేఁడు పాలకొల్లు అని వ్యవహరింపఁబడు గ్రామము. దీనికి సంస్కృతమున క్షీరారామమనిపేరు. ఈ క్షీరారామరామేశ్వరుని యాలయమున వెలసియున్న శాసనములు పెక్కింటిలో 'పాలుకొలని క్షీరారామేశ్వర శ్రీ మహాదేవరకు' అని గలదు. ఇచటిలింగము పీఠముమీఁద రెండడుగుల యెత్తుమాత్రముండును. ఇచట బౌద్ధచిహ్నము లేపాటియుఁ గానరావు.

5. గుడిపూండి—నేఁటి పశ్చిమగోదావరిజిల్లాలోని భీమవరము నంటియున్న గుణుపూఁడి యని వ్యవహరింపఁబడుగ్రామము. దీనినే రెండవశాసనములో (ద్రా[ద]చ్యారామపురి-అనినాఁడు. ద్రాచ్యారామపురి యనఁగా ద్రాక్షారామమని చరిత్రకారులు సూచించినారు. అది సరిపడదని నామనవి. ఇచటి యీశ్వరలింగము సోమేశ్వరలింగము. పీఠముమీఁద రెండడుగుల యెత్తుగలిగి, ఫాలనేత్రముతోఁగూడి, శుద్ధస్ఫటిక వర్ణముగలిగిన లింగము. ఆలయమునకు బైట చిన్న ఱాతి స్తంభముమీఁద నంది యున్నది. దీనికి సోమారామమని ప్రాచీనకాలమునందలి వ్యవహారము. కుమారారామమునందును ఆలయమున్బైట పెద్ద ఱాతిస్తంభముమీఁద నంది యున్నది. కనుక సోమేశ్వరాలయము దగ్గఱనే నందివిగ్రహమున్న శిలాస్తంభముండుటచే సోమారామమిది యే యనుట నిశ్చయము. చాళుక్యభీముఁడు తనపేర ప్రతిష్ఠించిన భీమేశ్వరతింగముండుటచే గుణుపూఁడిని చేరియున్న గ్రామమునకు భీమవరము అను పే రేర్పడినది. రెండేండ్లక్రిందట హిందూపత్రికలో సోమారామము 'కోటిపల్లి' అని నిర్దేశింపఁబడినది. ఈసోమారామమే దత్తైనసోముని పట్టినశాసనములో ద్రాచ్యారామమని పేర్కొనఁబడినది. దీనిలో నేగాదు. కాటయవేముని అన్నమాపురదానశాసనములోఁ గూడ నిది ద్రాచ్యారామమనియే వ్యవహృతమైనది. ఆ శ్లోకమిది.

శ్లో. తత్ర దాక్షా మరక్షీర కుమార దాక్ష్య పూర్వకాః
పఞ్చారామాః ప్రకాశన్తే క్రీడాస్థానాని ధూర్జటేః.

త్రిలింగ దేశములో—దాక్ష, అమర క్షీర కుమార దాక్ష్య అను పదములు పూర్వమందున్న ఆరామములు, పరమశివునకు విహారస్థానములై వెలయుచున్నవని యీ శ్లోకభావము. దాక్ష్యారామమనఁగా దక్షిణ దిక్కునందుండెడి యారామమని యనుకొనవలయుననిపించుచున్నది. ఈ దాక్ష్యశబ్దము గుణుపూఁడికి బదులుగ వాడఁబడినది. ఈ యర్థమును గ్రహించుటకు భీమేశ్వరపురాణమునందలి యీ క్రిందివాక్యములుపోద్బలకములు. త్రిపురాసుర సంహారానంతరము పరమశివుఁడు పంచారామములను వెలయించిన క్రమమును దెలిపిన ప్రకరణములోనిదీ గద్యము.

"అనంతరంబా యంబికావల్లభుండు...కృతకృత్యుండై త్రిపుర దైతేయుల కులదైవతంబైన యద్దివ్యలింగంబును పంచబ్రహ్మ పంచాక్షరీ తంచతత్త్వ పంచభూతమయంబగుటంజేసి, పంచఖండంబులుగా ఖండించి, కృష్ణవేణీ మహానదీతీరంబున ధరణాలకోటయను గ్రామంబున నమరేశ్వరునిచేతం బ్రతిష్ఠితంబగుటంజేసి యమరలింగంబునాఁ బ్రసిద్ధంబైన యమరారామంబును, గౌతమీతీరంబున దక్షిణకూలంబున గుణపూఁడియను గ్రామంబున సోమునిచేతఁ బ్రతిష్ఠితంబగుటంజేసి సోమలింగంబనఁ బ్రఖ్యాతంబైన సోమారామంబును, పాలకొలనను గ్రామంబున శ్రీరామచంద్రునిచేతం బ్రతిష్ఠితంబగుటంజేసి రామలింగంబునాఁ బ్రసిద్ధంబైన క్షీరారామంబును, చాళుక్యవంశ రాజధానిధానియగు చాళుక్యభీమవరనామక గ్రామంబునఁ గుమారరత్నంబైన కుమారస్వామిచేతం బ్రతిష్ఠితంబగుటంజేసి కుమారభీమలింగంబనఁ బ్రఖ్యాతినొందిన భీమారామంబును, మొదలిమామయగు దక్షప్రజాపతియునికిపట్టైన యారామంబగుట దాక్షారామంబున శివసన్నిధా

నంబై తానుండుమనట్టుగా నీప్రకారంబున భోగమోక్షప్రదంబులైన పంచారామంబులఁ బ్రతిష్ఠ నొందించి, తానును మున్నీటితటంబున విశుద్ధస్ఫటికసంకాశంబును ద్రిదశలోకభామినీ విలోకనచ్ఛాయా గుళుచ్ఛాచ్ఛజ్యోత్స్నాభిషేక యుక్తాంగంబగు భీమేశ్వరలింగంబునం దధివసించె."

భీమ. 4 అశ్వాసము.

సమకాలికమైన చారిత్రికాంశముల కేపాటియు విరోధము లేకుండ పౌరాణికవిషయములను పరమసత్యములుగా నిరూపించు శ్రీనాథుఁడు కూర్చిపెట్టిన గద్యమిది. ఈవాక్యమునుబట్టి పంచారామములకు ప్రాచీనకాలమునందుండెడి నామములు తెలియుటయేగాక, వాని కా యా నామములెట్లు వచ్చినవో స్పష్టమగుచున్నది. పంచారామములు పరమశివక్షేత్రములే యనుట దీనిలో స్పష్టము చేయఁబడినది. అఖండగౌతమీప్రవాహయుతమైన రాజమహేంద్రవరమునకు, గోస్తనీ నదీతీరస్థమైన గుణపూఁడి దక్షిణదిశయందుండుటచే నది దాక్షారామమని యూహించుటకు వలనుపడుననిపించుచున్నది. గుణపూఁడి సోమారామమని స్పష్టముగఁ దెలిపినవాఁ డాతఁడొకఁడే. కుమారారామమునందలి భీమేశ్వరలింగమునకు చాళుక్య భీమేశ్వరుఁడను వ్యవహార మెట్లేర్పడెనో? ఆవిషయమునుగూడ స్పష్టపఱచినాఁడు. దాక్షారామము పరమశివునకు ప్రధాననిలయమగుటకుఁ గారణమును తెల్లము చేసినాఁడు. శాతవాహనచక్రవర్తియగు హాలుఁడు సింహళకన్యయగు లీలావతిని దక్షారామ భీమేశ్వరసన్నిధిని వివాహము చేసికొనినట్లు, 'లీలావఈకహా' అను ప్రాకృతకావ్యము తెలుపుచున్నది. కావున పంచారామములు పరమశివక్షేత్రములేగాని బౌద్ధసంఘారామము లెట్లును కాఁజాలవని నా మనవి.

భారతీయాగమసంప్రదాయములకు సరిపడునట్లు, చారిత్రకాధారములతో ప్రాచీనదేవాలయాది చరిత్రమునూహించుట భావ్యముగాని, 15 వ శతాబ్దిలోఁగాని త్రిలింగదేశములోఁ దలయెత్తిన మతవిద్వేషములను, తత్పురస్కృతమైన విధ్వంసములను వెనుకటికాలమునకుసైత మంటఁగట్టి, పురాణములన్నియుఁ బుక్కిటిపురాణములని, ప్రాచీన భారతీయసంస్కృతిని, ఆగమవిజ్ఞానమును సరిగా నెఱుఁగనీయని చారిత్రకసిద్ధాంతములన విచారితముగ నామోదించుటగాని, తదనుగుణముగ మన రచనలను మలచుటగాని న్యాయ్యముగాదని సవినయముగ నివేదించువాఁడ.

గ్రంథ స్వీకారము సమీక్ష

శ్రీ బండారు తమ్మయ్య,

(11) నీవు, నేను- క్రౌనుపుటలు 58+12

గ్రంథకర్త:- శ్రీ గోటేటి సత్యనారాయణమూర్తిగారు.

(District Prohibition Officer Kakinada)

ఇది రచయిత యప్పుడప్పుడు భగవద్భక్త్యుద్బోధకములుగ రచించిన ఖండకృతుల సంపుటి. నీవు (భగవంతుఁడు) నేను (జీవాత్మ రూపకుఁడు-కృతికర్త). భక్త్యావేదనలతో జీవుఁడు భగవంతునియెడఁ గావించు నివేదనములే యిందు మంగళాచరణము. ప్రాతరుద్బోధము, ప్రాంజలి, ప్రార్థన, ప్రియతముఁడు, దైవబలము, చిత్తశుద్ధి, సత్సాంగత్యము, తృప్తి, ఛాయాదేవత, స్థితప్రజ్ఞుఁడు, చింతనము, ఆత్మబోధ, విన్నపము, సమర్పణము, అను 15 శీర్షికలతో నీ కావ్యరూపమును దాల్చినవి. వీనిలోఁ గొన్ని కేవల మీశ్వరస్తుతులుగాక పౌరాణిక చారిత్రకములగు కథలతోఁ గల్పితములయియున్నవి. అంతటను భగవన్మహిమము మాత్ర మంతర్వాహినిగా నుండును. కవిగారు పోలీసు శాఖలో నున్నతోద్యోగమున నుండియు నిట్టి యమూల్యకృతిని లోకమున కర్పించుట వారి సుకృతవిశేషము. కవితాశైలి గాంగఝరివలె ధారాళమై పావనతరమై, యలరారుచున్నది. హృదయంగమమయిన యీ చిన్ని ఖండకృతి యందఱు తప్పక యాదరింపఁదగియున్నది. కవివర్యులు శ్రీ గడియారము వేంకటశేషశాస్త్రిగారు (ప్రొద్దుటూరు) మద్దులపల్లి వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు (నంద్యాల) రచయిత నభినందించుచు పద్యాత్మకముగ వెలువరించిన ప్రశంసలు "ఒకమాట" అను పేరితోఁ గవిగారియొద్ద పోలీసుశాఖలోనే గుమాస్తాగాఁ బనిచేయుచుండిన సారస్వతపిపాసి, శ్రీ గొల్లాపిన్ని రామకృష్ణశాస్త్రి (నంద్యాల) ప్రకటించిన సమీక్ష కృతి కలంకారములుగ నున్నవి. ఇట్టి యుత్తమ కృతినిరచించి లోకమునకు నిస్స్వార్థముగ నందించిన కవిగారి నెంతయు నభినందించుచున్నాము.

మచ్చునకుఁ గొన్ని పద్యములు:-

(1) అతని మేలుచాటునటు లల్లనెపుల్గులు గెల్లుసెల్లసం
త్రాతకు సర్వమంగళవిధాతకు జే యనిపాడఁ దియ్యనన్.
గాతుక మొప్పఁ బ్రాక్సతి మొగంబునఁ గుంకుమ
దీప్తియద్భుతం
బైతగఁబట్టుచున్నద దె యారతిబంగరుపళ్లెరంబునన్
(ప్రాతరుద్బోధమునుండి)

(2) పరహితమొంకు దక్కఁదనభావమునం దితరార్థకల్పనా
స్ఫురణయె లేని యానియతబుద్ధికిఁదోఁచని శాంతభక్తిత,
త్పరుఁడయి పామరత్వ మెడఁబాపఁగడంగిన రామదాసు శ్రీ
చరణమునంటి భిక్షనిడిసత్కృతిఁ జేసెడు వాంఛ యొక్కఁడున్,
(చిత్తశుద్ధినుండి)

(3) అనవిని, యాజ్ఞవల్క్యముని యానతిఁగైకొని, తేరిపై
రయం,
బునఁజని రాజుగాంచెఁ దనముంగల దారుణమారణాగ్నికిం
ధనమయి రాజధాని మసనంబగుచుండుటఁ గాందిశీకులై
లసప్రజతల్లడిల్లుచును దల్లికిఁబిల్లకుఁ దప్పుచుంటయున్
(స్థితప్రజ్ఞుఁడునుండి)

(12) గంగాలహరి:- క్రౌనుపుటలు 62 వెల రు 1-0-0

కర్త : రామచంద్రకౌండిన్యయను సాంకేతిక నామాంకితులగు డాక్టరు ఓరుగంటి రామచంద్రయ్యగారు, చరిత్రోపన్యాసకులు, ఆంధ్ర విశ్వ విద్యాలయము వాల్తేరు.

మిత్రులు శ్రీరామచంద్రయ్యగారు ఆంగ్లమున నున్నతపట్టభద్రులయ్యు వంశానుగతముగ వైదికవిద్యా సంపదకు, భగద్భక్తికి నిధానమయిన యుత్తమ విప్రకుటుంబమునకుఁ జెందినవారవుట మొద

టనుండియు నాధ్యాత్మిక సౌరభములఁ బ్రసారించు నుత్తమగ్రంథము లరచించుటకే యలవడిన భావుకులు. శ్రీ రమణమహర్షి యాశ్రమములోఁ గొంతకాలము తత్సన్నిధానముననుండి మహర్షి యాశీర్వాదమును బడసిన ధన్యజీవనులు. వీరి కృతులు రమణ స్మరణ, రమణాలహరి, తెనుఁగు మీరా మున్నగునవి యింతకుమున్నే యీ పత్రిక యందు సమీక్షగావింపఁబడి యున్నవి. వానివలననే వీరి యాధ్యాత్మిక తత్త్వము పాఠకులకుఁ గొంత కొంత గోచరమయి యుండును. ఏవంగుణ విశిష్టులగు వీరు నేఁడు పండితరాయల గంగాలహరి ననువదించి తమ వాణిని బునీతమొనరించుట ముదావహము. ఇందు మూల శ్లోకములుకూడ వీరి యనువాద పద్యముల కెదురుగా నొకవైపున ముద్రింపఁబడి యుండుట ప్రశంసనీయము. పాఠకుల కిది యెంతయు నుపయోగకరము. పండిత రాయలు మూలకృతిని జాలవఱకు మహిమ్న స్తోత్ర, శివానందలహరుల మార్గమును ననుసరించి శిఖరిణీవృత్తములలో రచించియుండ శ్రీరామచంద్రయ్యగారు తమ యనువాదమునఁ మూలాగ్రమున నుత్తమంబగు సంగ్రహీకరణప్రౌఢితోఁ జిన్న తేటగీతులందును నాటవెలఁదులందును రచించుట వారి యసాధారణప్రతిభ కాదర్శకముగ నున్నది. ఆధునికులు పలువురు గంగాలహరి కిదివఱకే వారి వారియనువాదములు ప్రకటించి యున్నారు. అవి చాలవఱకు మార్గకవితలో సంస్కృత వృత్తములలోఁ గూర్పఁబడినవి. నెల్లూరు మండలము వారగుట శ్రీరామచంద్రయ్యగారు సహజమయిన తెలుంగుఁదనము గుబాళింప నీకృతిని హృదయంగమములగు దేశిచ్ఛందములలో సహృదయ హృదయాకర్షకముగ రచించినందుకు వారి నెంతయు నభినందించుచున్నారము. పండితవర్యులు శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రి, వెంపరాల సూర్యనారాయణశాస్త్రి, మల్లంపల్లి సోమశేఖర శర్మ, విశ్వనాథ సత్యనారాయణగార లొసంగిన యమూల్యాభిప్రా

యములుగూడ నిందుఁ బ్రికటితములయి యీకృతి కెనలేని శోభ నా పాదించుచున్నవి. వామనుఁడు కావ్యగుణములలో నుదాహరించిన "ప్రౌఢి" పథములలో వాక్యార్థమును సంక్షేపించి చెప్పుటకీకృతి చక్కని నిదర్శనముగా నున్నది. మూలశ్లోకమందలి భావము నొకింతయుఁ బీరువోకుండఁ జిన్నగీతములలో నిమిడ్చి తీర్చిదిద్దిన యీకృతి సూక్ష్మములో మోక్షమను నుడికి దృష్టాంతమగుచున్నది. మచ్చునకు రెండు పద్యములు వాని మూలశ్లోకములతో నుదాహరించుచున్నాము.

శ్లో॥ శ్వవృత్తివ్యాసంగో నియతమథ మిథ్యాప్రిలపనం
కుతర్కేష్వభ్యాసః సతతపరపైశున్యమశనమ్,
అపిశ్రావం శ్రావంమమతు పునరేవంగుణగణా
నృతే త్వత్కో నామక్షణమపి నిరీక్షేత మవనమ్.

గీ॥ పరపుడమ్ము, కల్ల, పరపాపచింతన,
కపటవాదనిరతి కలుషగుణము
లిన్నివినుచువినుచు, ఈ మొగమిమ్మొద్దు
లెవరుచూతురమ్మ, యీవుదక్క. (ప 31)

శ్లో॥ పరామ్నామ్నాం స్తత్తజ్జనపద సమానక్రమనసో
హసంతః సోల్లాసం వికచకుసుమ వ్రాతమిషతః
పునానాః సౌరభ్యైః సతతమలినో నిత్యమ మలినాన్
సఖాయోనః సంతు త్రిదశతటినీతీర తరవః.

గీ॥ ఊరిపేరిముడి విడివోని మోటకులకు
విరియుపూవుల నవ్వుల వెక్కిరింత
కమ్మతావుల నళికోటికప్పు విప్పు
లోలయ నీతీరతరువులు చెలులు మాకు. (ప 43)

(3) శబ్దోత్పత్తిశతకము:—క్రౌను పుటలు 20 వెల 0-50.

కర్త;—విద్వాన్ కోగంటి దుర్గామల్లికార్జునరావుగారు రిటైర్డు తెలుగుపండితులు, పామఱ్ఱు, కృష్ణాజిల్లా.

శ్రీ మల్లికార్జునకవిగారు పాఠశాలావిద్యార్థులయు నుపాధ్యాయులయు నుపయోగమునకయి వ్యాకరణవిషయములకు సంబంధించిన పలురకముల శతకములు చిరకాలమునుండి రచించుచుండుట సర్వవిదితము. తత్సమ, నానార్థ, వచన, లింగ, రూపాంతర శతకము లీగణములోనివే. శబ్దోత్పత్తులగూర్చి కొన్ని భాగములుగ శతకములు రచించుచు నింతకుమున్ను 2 భాగములు ప్రకటించియున్నారు. వానిసమీక్ష యీపత్రిక పూర్వసంచికలలోఁ గావించియుంటిమి. ఇది మూఁడవభాగము. వెనుకటి భాగములవలెనే యిదికూడ విద్యార్థులకు నుపాధ్యాయులకుఁ బ్రయోజనకారి కాఁగలదు. కొందఱు పండితులొసంగిన సదభిప్రాయము లీగ్రంథమందే మునుముందు ముద్రితములైనవి. కవిగారికృషి ప్రశంసనీయము.

మచ్చునకు మూఁడు పద్యములు.

బేహారముఁగలవానిని । బేహారియని చెప్పినారు వినుతకవీంద్రుల్
బేహారముగలవానిని । బేహారి యనుచు నొడివిరి విద్వద్వర్యుల్. (ప41)
వాహంబునకరిగావున । వాహద్విషమని పలికిరి ప్రాజ్ఞవతంసుల్
వాహములుండెడికతమున । వాహినియని చెప్పినార పారమనీషుల్ (ప51)
విజయమునొందెడువానిని । విజయుండని చెప్పుచుంద్రు విద్వద్వర్యుల్
విజిగీషంగలవానిని । విజిగీషువనుచుఁ బలికిరి విశ్రుతవిబుధుల్ (ప52)

(4) ప్రపంచపాముఁడు: కర్త:—కవిరత్న, ఆంధ్రభాషావాచస్పతి, సహస్రావధాని, శ్రీరాం వీరబ్రహ్మకవిగారు, మచిలీపట్టణము.

ప్రకాశకులు:—కవిగారి శిష్యులు, విఘ్నేశ్వర గ్రంథమాలా స్థాపకులు, భారతీసమితి కార్యదర్శి శ్రీ విద్వాన్ కోగంటి దుర్గా మల్లికార్జునరావుగారు, పామఱ్ఱు, కృష్ణాజిల్లా. క్రౌను పుటలు 70+22 వెల 1-8-0.

ఇది నేఁడు భారతరాష్ట్రపతిగానున్న శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ పండితుల చరిత్ర సంగ్రహరూపకముగ రమారమి 250 పద్యములతోఁ గూర్పఁబడిన పద్యకృతి-రాధాకృష్ణపండితులు మొట్టమొదటఁ జిన్నతనముననే కళాశాలావిద్యార్థులకుఁ దత్త్వశాస్త్రమును బోధించు నధ్యాపకవృత్తిలోఁ బ్రవేశించి క్రమక్రమముగాఁ దమయసాధరణ శేముషీవిశేషమువలనఁ బ్రాచ్యపాశ్చాత్య తత్త్వశాస్త్రముల నామూలాగ్రముగ నవగాహించి ప్రపంచమందలి వివిధ విశ్వ విద్యాలయములలో గంభీరములగు తాత్త్వికోపన్యాసములమూలమున విశ్వవిఖ్యాతి గడించిన యాంధ్రమాతృ పుత్రరత్నము. ప్రపంచమంతయుఁ బర్యటించి సమస్త వైజ్ఞానిక లోకముయొక్క ప్రశంసలకుఁ దావలమయిన యీ మహాపురుషుని జీవితచరిత్రమునకు "ప్రపంచపౌరుఁడు" అనునామ మెంతయు సమంజసముగానున్నది. వయోవృద్ధులయిన శ్రీరాం వీరబ్రహ్మకవిగారు దేశచరిత్రములను, సంస్థానచరిత్రములను, ప్రఖ్యాతపురుష చరిత్రములను సేకరించి ప్రజోపయోగకరముగ గ్రంథరూపమున సంతరించుటలో సిద్ధహస్తులు. అట్టివారు శ్రీ రాధాకృష్ణ పండితుని జీవితచరిత్రమునకు సంబంధించిన ప్రధానవిషయము లెన్నెన్నియో సేకరించి సూక్ష్మములో మోక్షమనురీతి విద్వత్సమ్మతముగ నిట్టి చరిత్ర సంగ్రహము ధారావాహికమయిన లలితమధురశైలిలో రచించి దానిని రాధాకృష్ణపండితుని యామోదముతో వారికే యంకితమొసంగుట ముదావహము. పెద్దవయస్సులోఁ గూడ ధారణాశక్తి నించుకయుఁ గోల్పోవక సహస్రావధానాదికముల నవలీలగ నిర్వహించు ధీసంపన్నులు వీరబ్రహ్మకవిధీరులు దీని కర్తలగుట పసిఁడికిఁ బరిమళమబ్బినట్లుగ నున్నది. ఇందుకయి వారినెంతయు నభినందించుచున్నారము. రాధాకృష్ణపండితులు భారతప్రభుత్వము వారి రాయబారిగా మాస్కోలోనున్న కాలమున వారు సోవియట్ విధానములవిషయ

మున గడించిన యనుభవములను జక్కగా వివరించునిందలి "రహస్యాను గురించిన స్వానుభవోపన్యాసము" అను భాగము ప్రత్యేక ప్రశంసార్హముగ నున్నది. గ్రంథము మునుముందు తొలిపలుకు మున్నగువానిలో పలువురీ గ్రంథముపయి నొసంగిన యభిప్రాయము లవశ్యము పఠింపఁదగియున్నవి.

మచ్చునకుఁ గొన్ని పద్యములు.

శా. ఈయాంధ్రావనిఁ బుట్టినట్టి యతులోత్కృష్టోన్నత స్థానమి
ట్లీ యాంధ్రుండయినన్ గడించెనె యయారే తత్త్వధీ శ్రీనుపా
ధ్యాయుండౌటనె కాదు నిస్తులిత రాధాకృష్ణ విద్వన్మహో
మేయప్రజ్ఞయె కారణంబగునుసుమీ శాస్త్రులెన్న యోచింపఁగన్. (ప128)

శా. శాశ్వద్గుణ ధీరుఁడౌట మన రాధాకృష్ణ యార్యుండహో
లేశంబేని వచింప జంకొదవు నాంగ్లేయాధికారంబునన్
దేశంబెల్లను మ్రగ్గుచున్న తఱినే దేశాభిమానాన్వితా
వేశంబొప్పు ప్రబోధలెన్నొ సలిపెన్ విద్యార్థి లోకంబునన్ (ప 67)

గీ. మును కుచేలుని యటుకులా మోదచిత్తుఁ డగుచు శ్రీకృష్ణభగవాను
డందుకొనఁడె అటులె యీనాడు చిఱుకానుకనందికొనఁగఁ
ఆశ్రితులకు రాధాకృష్ణపండితేంద్రు. (ప 241)

శా. శ్రీగంగాలహరీసముద్గత వచశ్శ్రీ సాంద్ర! భవ్యాంధ్ర కాం
తా గర్భార్ణవ పూర్ణచంద్ర! విబుధోత్తంసస్తుతాం చత్సుధీం
ద్రా! గుప్తార్థ పరీతతత్త్వ విషయజ్ఞా! ధన్యమయ్యెన్ భవ
త్ప్రాగల్భ్యంబునఁ జేసి యాంధ్రికడు రాధాకృష్ణ విద్వన్మణీ. (ప247)

(౫) సిద్ధాంతశిఖామణిః:— డెమ్మీ. పుటలు 332)

మూలసంస్కృత శ్లోకకర్త:—శివయోగి శివాచార్యులు.

ఆంధ్రతాత్పర్య రచయిత:—శ్రీ శ్రీ యానందనామాపరనామకులు శ్రీ ఈశ్వర సత్యనారాయణశర్మగారు, శ్రీకాకొళము.

ప్రకాశకులు:—సాధనగ్రంథమండలి, తెనాలి. వెల రు3-0-0 లు.

వీరశైవ మతవిషయక విజ్ఞాన ప్రధానములగు భక్త, మాహే
శ్వర, ప్రసాది, ప్రాణలింగి, శరణ, ఐక్య అను షట్స్థలములయొక్కయు,
వానిలో నంతర్విభాగములు అంగస్థలములు 44 లింగస్థలములు 57
మొత్త మేకోత్తరశత-101 స్థలముల ధర్మములఁగూర్చి జగద్గురు రేణు
కాచార్యుఁడు అగస్త్యమహర్షికి బోధించినట్లుగా రచితమయిన యుత్త
మప్రామాణిక గ్రంథము సిద్ధాంతశిఖామణి; దీనికర్త శివయోగిశివా
చార్యుఁడు, రేణుకాచార్య వంశపరంపరకు సంబంధించినవాఁడు. వీర
శైవ పంచాచార్యులలోఁ బ్రథముఁడగు రేణుకాచార్యునికాలము నిర
్దిష్టముగ నిర్ణయించుట కష్టతరము. రేణుక నామధేయులు పలువురు
వేర్వేఱు కాలములలోనుండుట నీ జగద్గురుని కాలనిర్ణయము మఱింత
క్లిష్టమగుచున్నది. నేఁడు మైసూరు రాష్ట్రమున శృంగేరికి సమీపమున
రంభాపురి (బాలెహొన్నూరు)లోఁ బ్రతిష్ఠితమయియున్న రేణుకుని
(రేవణసిద్ధ)వీరసింహాసనమే యీప్రథమ వీరశైవ పంచాచార్యునికి
సంబంధించినది. కృతికర్తశివయోగి శివాచార్యుఁ డెప్పటివాఁడో నిర్ణ
యించుటకూడ సుకరము కాదు. దుర్గమములగు షట్స్థల వైజ్ఞానిక
విషయముల నీతఁడు హేలగా లీలగా సుగమమగు శైలిలో రచించి
యుండుట ప్రశంసనీయము. ఈగ్రంథశైలి వాల్మీకిరామాయణశైలి
తోఁ దులఁదూఁగుచున్నదని రసజ్ఞులు కీ. శే. గాడిచర్ల హరిసర్వోత్తమ
రావుగారు ప్రశంసించియున్నారు. ఈ గ్రంథము మొదట 1896
సంవత్సరప్రాంతమున ఏలూరులో తెలుఁగులిపిలో శైవ పంచకము
అను సంపుటమునందుఁ బ్రకటితమైనది. అందు నిరువది పరిచ్ఛేదములు
మాత్రమే యున్నవి. అటుతరువాత మైసూరులో పంచాచార్య పత్రి
కాధిపతులు తమ గ్రంథమాలలోఁ గన్నడలిపిలోఁ బ్రకటించియున్నా
రు. అందులో విభీషణుని ప్రార్థనముపయి రేణుకాచార్యుఁడు లంక
కేఁగి యచట నవకోటి శివలింగముల నేకముహూర్తముననే తన

యాచార్యత్వమున స్థాపించినట్లుగా వర్ణించు నేకవింశతి పరిచ్ఛేద మధి కముగాఁ గానవచ్చుచున్నది. ఇది ప్రక్షిప్తమని కొందఱు తలంచుచు న్నారు. కాశీనాథశాస్త్రిగారి గ్రంథమునుబట్టియే తరువాత 1940 సంవ త్సరములో దీని మూలశ్లోకములను తెలుఁగు దేవనాగరిలిపులలో శ్రీ చిదిరెమఠము వీరభద్రశర్మగారు ప్రకటించినారు. ఈసూత్నము ద్రణములను, శ్రీ కాశీనాథశాస్త్రిగారి కన్నడగ్రంథము ననుసరించియే ఆంధ్రవివరణకర్తలు శ్రీ సత్యనారాయణశర్మగారు ప్రకృతగ్రంథమును రచించినట్లున్నది. వీరు సరసకవితాశక్తిసంపన్నులు-దేవ్యుపాసకులు- ఇటీవలఁ దురీయాశ్రమస్వీకార మొనర్చినవారు. ఇట్టి గుణగణవిశిష్టు లీ యాంధ్రవివరణమును గూర్చుట ముదావహము. మూలగ్రంథము, శర్మగారి యాంధ్రవివరణముతోపాటు, మొదటి 21 పుటలలోను ముద్రితమయినవారిమున్నుడియు, కన్నడలిపిలో శ్రీ కాశీనాథ శాస్త్రి గారు ప్రకటించిన సిద్ధాంతశిఖామణియందలి యవతారికకు శ్రీ శర్మ గారి యనువాదముగూడఁ దప్పక సావధానముగఁ బఠింపఁదగినవని మనవిచేయుచున్నాము.

వివిధమతధార్మికగ్రంథములఁ బ్రకటించుచున్న తెనాలి సాధన గ్రంథమండలివారీ వీరశైవమతగ్రంథమునుగూడఁ బ్రకటించుట ప్రశం సనీయము. కృతికర్త శివయోగి శివాచార్యుఁడు గ్రంథప్రకాశకులు తలంచినట్టులంత ప్రాచీనుఁడయి యుండఁడనియుఁ బదునాల్గవ శతాబ్ది యందుఁగాకతీయ రెండవప్రతాపరుద్రునికాలముననున్న శివదేవయ్యయే యీశివయోగిదై యుండుననియు భారతిపత్రికలో నీ గ్రంథముపయి సమీక్షను బ్రకటించిన శ్రీ జగన్నాథశర్మగారు వ్రాసియున్నారు. కాని యిది సరికాదని మాయభిప్రాయము. శివదేవయ్యయు నాతని యగ్రజుఁడు విశ్వేశ్వరశివదేశికుఁడు (గణపతిదేవచక్రవర్తి దీక్షాగు రువు) పాశుపతశైవమునకుఁజెందిన గోళకీ మఠసంప్రదాయమునకు సంబంధించినవారు. దశవిధశైవములలో నైదవదియగు శ్రౌత శైవ మతావలంబకులేగాని కేవల వీరశైవులుగారు. శివదేవయ్య పేర వెల

సిన యొకయాంధ్రశతకములోని మకుటము "శివదేవధీమణీ"యనియే యున్నది. తుమ్మలపల్లి నాగభూషణకవి రచించిన "బసవవిజయము" అను గ్రంథమునఁ బ్రతాపరుద్రునకు శివదేవయ్య బసవేశ్వరుని చరిత్ర మును జెప్పినట్లున్నది. కావున నతఁడు బసవనికిఁ (క్రీ.శ. 1126-1168) దరువాతి వాఁడనుట విస్పష్టము. సిద్ధాంతశిఖామణి శ్లోకములు బసవేశ్వరునికిఁ బూర్వులయిన శ్రీకంఠశివాచార్యుఁడు, శ్రీపతి పండితారాధ్యుఁడు తమ బ్రహ్మసూత్ర భాష్యములలో నుదాహరించి యుండుటచే శివయోగి వారికిఁ జాలఁ బూర్వుఁడయి యుండుననుట నిర్వివాదము. కావునఁ బదునాల్గవ శతాబ్దిలోని శివదేవయ్య యాతఁడనుట యసంగతమని చెప్పనక్కఱలేదు మచ్చునకుఁ గొన్ని మూల శ్లోకములను వానికి సత్యనారాయణశర్మగారి యాంధ్రవివరణములను నుదాహరించుచున్నాము. ఏతాదృశ మతగ్రంథములఁ బ్రకటించు సాధనగ్రంథమండలివారిపరిశ్రమ యాంధ్రలోకమున కెల్ల నాదరణీయమని మనవిచేయుచున్నాము.

10 వ పరిచ్ఛేదము:—19. శివాద్వైత నిరసనస్థలము నుండి,

పూజ్య పూజయోర్లింగ జీవయోర్భేద వర్జనే 37
పూజాకర్మాద్యసంపత్తేర్లింగనిష్ఠా విరోధకః.
సర్వాద్వైత విచారస్య జ్ఞానాభావోవ్యవస్థితః
భవేన్మాహేశ్వరః కర్మీ సర్వాద్వైత నిరాసకః. 38

వివరణము:—పూజింపబడు శివలింగమునకును పూజించు భక్తునకును భేదము లేదన్నచో లింగనిష్ఠకు విరోధముగాన పూజాకర్మాదులకు స్వరూపనివృత్తి లేనందువలనను, సమస్తమైన యద్వైతవిచారముయొక్క జ్ఞానమునకు లేమియే స్థిరపడుచున్నది. అందుచే శివలింగ పూజాదికర్మములనుచేయు మాహేశ్వరుఁడు సర్వాద్వైతమును నిరసించువాఁడు కావలయు. "క్రియాద్వైతం నకర్తవ్యం" అనెడి ప్రమాణమువలన క్రియయందద్వైతము చేయరాదని తాత్పర్యము.

19 వ పరిచ్ఛేదము:—45 మహాకాశస్థలము.

పిండాండస్థం యథాకాశం వభిన్నం తద్వదాత్మనం
అభిన్నః పరమాత్మేతి మహాకాశస్థలం విదుః.

వివరణము: బ్రహ్మాండమందును పిండాండమందును ఉన్న ఆకాశ మెట్లు భిన్నముగా లేదో అటులే శివయోగియొక్క ఆత్మకంటె పరమాత్మ వేఱుగా లేదు. శివయోగి ఆత్మ, పరమాత్మ అను నీయిరువురును ఒకటే అను అభేదమునే జ్ఞానులు మహాకాశస్థలమందురు.

(6) శంకరగ్రంథ రత్నావళీ:—ఉపదేశగ్రంథములు నలువది. ప్రథమసంపుటము అనువాదకులు శ్రీ నిర్వికల్పానందస్వామి,

ద్వితీయముద్రణము:—పుటలు 293 వెల రు 4-0-0.

ప్రకాశకులు:—సాధనగ్రంథమండలి, తెనాలి.

అద్వైతమతాచార్యులగు శ్రీ ఆదిశంకరులు రచించిన మతగ్రంథములనన్నిటిని గ్రమముగాఁ దెలుఁగువివరణములతోఁ బ్రకటించు మహోద్యమము నాలంబించి శ్రీ సాధనగ్రంథమండలి వారందు ప్రథమసంపుటముగాఁ బ్రకటించిన యుత్తమగ్రంథమిది. అద్వైతానుభూతి, అనాత్మ శ్రీవిగర్హణప్రకరణము, ఆత్మషట్కము మున్నగు కేవల వేదాంతబోధక గ్రంథములు నలువది యీసంపుటమున సంకలితములైనవి. శివానందలహరి, సౌందర్యలహరి మున్నగు స్తోత్రగ్రంథములేవియు నిందుఁ జేరలేదు. అట్టివిగూడఁ దరువాతి సంపుటములలోఁ బ్రకటితములు కావచ్చునని యాశింతుము. ఆంధ్రవివరణమును రచించిన శ్రీ నిర్వికల్పానందస్వాములువారు సుప్రసిద్ధులు. శ్రీరామకృష్ణ మఠమునకు జేరిన మత ప్రచారకస్వామికోటిలోనివారు. జన్మతః ఆంధ్రులు ఆంధ్రులకు సులభముగ గ్రాహ్యమగు శైలిలో మతవిషయకవ్యాసములనేకములు పత్రికలలోఁ బ్రకటించిన పండితవర్యులు. వీరే రచించిన భారతీయ తత్త్వశాస్త్రము ప్రథమభాగము. షడ్దర్శనములు వేదాంత

సూత్రభాష్యము సంప్రదాయములు. (క్రౌనుపుటలు 192 వెల రు2-0-0) అను గ్రంథ మింతకుముందే యీసాధన గ్రంథమండలియందే ప్రకటిత మయి విశేషవ్యాప్తిని, జనాదరణమును గాంచియున్నది. ప్రకృతగ్రంథముకూడ నట్లే యాంధ్రసోదరుల యాదరణాభిమానములం జూఱగొనఁగాకయని యభిలషించుచున్నాము. శంకర గ్రంథములన్నియు శ్రీ నిర్వికల్పానందస్వాముల యాంధ్రవివరణములతో ప్రకటిత మయినచో నది యాంధ్రలోకమునకు మహోపకృతి కాఁగలదు. సాధన గ్రంథమండలి విశేషకృషితో దానిని నిర్వహించి చరితార్థత నొందఁగావలెనని హెచ్చరించుచున్నాము.

మచ్చునకుఁ గొన్ని మూలశ్లోకములను, వాని యాంధ్రవివరణములను నీ దిగువ నుదాహరించుచున్నాము.

(1) అద్వైతానుభూతినుండి-

శివ ఏవ సదాజీవో జీవ ఏవ సదాశివః
వేత్త్యైక్యమనయోర్యస్తు స ఆత్మజ్ఞో నచేతరః॥
క్షీరయోగాద్ యథా నీరం క్షీరవద్ దృశ్యతే మృషా
ఆత్మయోగాద నాత్మాయ మాత్మవద్దృశ్యతే తథా॥

వి॥ ఎల్లకాలముల శివుఁడే జీవుడు, జీవుఁడే శివుఁడు, ఈ యుభయులయైక్యము నెఱిఁగినవాడే ఆత్మజ్ఞుఁడు-ఇతరులుకారు. నిక్కము కాకుండినను నీరు పాలలోఁగలిసి పాలవలె గోచరించునట్లు అనాత్మరూపమగు ఈజగత్తు ఆత్మతోఁగలిసి ఆత్మవలెఁ దోఁచుచున్నది.

(30) యోగతారావలినుండి-

చిత్తేంద్రియాణాంచిర నిగ్రహేణ। శ్వాసప్రచారే శమితే యమీంద్రాః
నివాతదీపా ఇతి నిశ్చలాంగా। మనోన్మనీ మగ్నధియో భవంతి.

వి॥ చిత్తమును, ఇంద్రియములును మరిచలింపకుండునట్లు నిగ్రహింపఁబడినప్పుడు, శ్వాసక్రియ నిరోధింపఁబడినప్పుడు గాలిలేనిచోట నుంచఁబడిన దీపమువలె శరీరాంగములు కంపింపకుండునప్పుడు యోగులు ఈమనోన్మనీ (మనోలయ)స్థితియందునిమగ్నచిత్తులగుదురు.

వ్యక్తి వివేకము

భాగవతుల కుటుంబరాయశాస్త్రి.

(గతసంచిక తరువాయి)

ఉదా: "నిర్ఘాతోగ్రైః కుంజలీనాన్ జిఘాంసుః
జ్యానిర్ఘోషైః క్షోభయామాస సింహాన్
నూనం తేషా మభ్యసూయా పరోఽసౌ
వీర్యోదగ్రే రాజశబ్దే మృగాణామ్"

అర్థము:—పొదలలోఁ దాగుకొనిన సింహములను చంపనెంచి పిడుగువలె భయంకరములగు నారిమ్రోఁతలచే వానిని క్షోభింపఁజేసెను. ఆమృగములయొక్క, వీర్యోదగ్రమైన, రాజశబ్దమునందు (వీర్యోదగ్రమైన, ఆమృగములయొక్క రాజశబ్దమునందు) అతని కసూయయున్నదనుట నిశ్చయము.

ఇచట సింహములకు, రాజశబ్దవాచ్యత్వము లేదు. (అనఁగా రాజను నర్థము సింహశబ్దమునకు లేదు) వానికి రాజశబ్దసంబంధమును లేదు. అందుచే సింహములకు, "రాజశబ్ద"సంబంధము పొసగదు సింహశబ్దమునకు, సమానార్థకమగు మృగరాజశబ్దమునకు, రాజశబ్ద సంబంధమున్నను, నామృగరాజశబ్దము ప్రక్రాన్తముకాలేదు. 'మృగాణామ్' అనుటకు బదులుగ "మృగరాజానమ్" అనియును ప్రయుక్తము కాలేదు. అందుచే నిట మృగరాజశబ్ద మనుపయుక్తమే.

మఱియు సింహములకు, మృగములలో, రాజత్వము కలుగునుగాని, శబ్దముఁగాదు. అందుచే "వీర్యోదగ్రే"యను పదమును శబ్దమునకు విశేషణముగ నుపయోగింపరాదు. వీర్యోదగ్రత్వమనునది వస్తునిష్ఠముగాని శబ్దనిష్ఠముగాదుగదా! కావున నిచట సింహములకుఁగాని, మృగములకుఁగాని, వీర్యోదగ్రత్వమునకుఁగాని "రాజశబ్ద" అను శబ్దముతో నన్వయము సంగతముకాదు. కాననిది యవాచ్యమే. అందుచే "రాజభావే" అనికాని, "మృగేషు" అనికాని వాచ్యము గావలసియుండఁగా, నట్లు లేకుండుటచే నిట నవాచ్యవచనదోషమున్నది.

ఉదా॥ తపేన వర్షాః శరదా హిమాగమో
వసన్తలక్ష్మ్యా శిశిర స్సమేత్య చ
ప్రసూనక్లృప్తిం దధత స్సదర్తవః
పురేఽస్య వాస్తవ్య కుటుంబితాం యయుః.

తా॥ గ్రీష్మర్తువుతో వర్షర్తువు, శరత్తుతో హేమంతర్తువు, వసన్తలక్ష్మితో శిశిరర్తువును, కలిసి (దాంపత్యమువహించి) ఎల్లప్పుడు పుష్పసంపత్తినిగలిగి, ఋతువులు ఇతనిపట్టణమునందు వాస్తవ్యులగు (నివసించు) గృహస్థులైనవి. ఇతనిపట్టణమునందు కలిసి, కాపురము సేయుచున్నవని భావము.

వ్యాఖ్య:—ఇచట తప హిమాగమ శిశిరశబ్దములు పుంలింగములు. ఆలింగమహిమచే నాఋతువులకు పురుషభావమనుమితమగుచున్నది. వానికి కర్తృత్వముగూడ నున్నది. అందుచే వానికి ప్రాధాన్యమును చెప్పుట యుచితము. వర్షా, వసన్తలక్ష్మీశరత్ శబ్దములు స్త్రీలింగములు. వానికి సహభావము, అప్రాధాన్యమును నుండుట యుచితము. అనఁగా స్త్రీలతోఁగలిసి పురుషులు కాపురము సేయుచున్నారు, అని భావము రావలయును, అపుడు పురుషవాచకశబ్దములకు ప్రాధాన్యమునాధారముగఁ జేసికొని, ప్రథమావిభక్తియు, స్త్రీలింగశబ్దములకు వానియప్రాధాన్యము నాధారముగఁ జేసికొని "సహయుక్తే అప్రధానే" అను సూత్రముననుసరించి తృతీయావిభక్తి వచ్చుటయు నుచితము. అట్లున్నపుడే ఒక స్త్రీతో నొకపురుషుఁడు "కుటుంబి"యగు ననువాక్యము పొసగును. ప్రస్తుతము "శరదా హిమాగమః" "వసన్తలక్ష్మ్యా శిశిరః" అను నుపవాక్యములలో, శరత్ వసన్తలక్ష్మీ శబ్దములు తృతీయావిభక్తితోనే యున్నవి. హిమాగమ, శిశిరశబ్దములు, ప్రథమావిభక్తియందే యున్నవి. అట్లుండుట యుచితమే. "తపేన

వర్షాః" అనునపుడుమాత్రము పుంలింగమునందున్న తపశబ్దము తృతీయా విభక్తియందును, స్త్రీలింగమునందున్న వర్షాశబ్దము ప్రథమా విభక్తియందును నుండుట యుచితముగాదు. తపశబ్దము ప్రథమావిభక్తియందును, వర్షాశబ్దము తృతీయావిభక్తియందును నుండవలయును. అట్లు లేకుండుటచే నిట నవాచ్యవచనదోషము వచ్చినది.

శ్లో॥ కిమపేక్ష్యఫలం పయోధరాన్, ధ్వనతః ప్రార్థయతే మృగాధిపః
ప్రకృతిః ఖలుసా మహీయసః, సహతే నాన్యసమున్నతిం యయా.

తా॥ ఏఫలము నపేక్షించి, సింహము గర్జించుచున్న మేఘముల కెదురుగ వెళ్లును? (ఎదుర్కొనును?) అది గొప్పవానియొక్క స్వభావము. ఆ స్వభావముండుటచేతనే యతఁడన్యసమున్నతిని సహింపలేఁడు.

ఇచట "మహీయసః" యనుపద మేకవచనమున నున్నది. అగుటచే నన్యసమున్నతిని సహింపలేకుండుటయనున దొకని స్వభావముమాత్రమేయని వ్యక్తమగును. గొప్పవారందఱకును నది స్వభావమేయనునర్థము రాదు. ఆ యర్థము భాసింపవలయును. అందుకై వీప్సాసమానఫలకమగు (వ్యాప్తిని తెలుపు) "మహీయసా" మను బహువచన శబ్దమును ప్రయోగింపవలయును - అటువంటి ప్రయోగమున కుదాహరణము

"యావదర్థపదాం వాచ మేవమాదాయ మాధవః
విరరామ మహీయాంసః ప్రకృత్యా మితభాషిణః"

తా॥ అర్థసమ్మితమగు నక్షరములుగలమాట నీ విధముగపల్కి, మాధవుఁడూరకుండెను. గొప్పవారు, సహజముగనే, మితభాషులు.

ఇచట నర్థాన్తరన్యాసమునందు "మహీయాంసః" అని బహువచనము ప్రయుక్తమైనది. లేదా, వీప్సా (వ్యాప్తి)ర్థమును తెలుపు "సర్వ" మొదలగు శబ్దములనైనను ప్రయోగింపవలయును.

ఉదా: ఛాయా మపాస్య మహతీ మపి వర్తమానా
మాగామినీమ్ జగృహిరే జనతా స్తరూణామ్
సర్వోహి నోపనతమ ప్యపచీయ మానమ్
వర్ధిష్ణు మాశ్రయ మనాగత మప్యుపైతి.

తా॥ జనసమూహములు, తత్కాలముననున్న ఛాయ పెద్దదే యైనను, దానిని వదలివేసినారు. రాఁబోవునీడ నాశ్రియించినారు. లోకమునందందఱును, తమయొద్దనేయున్నను ఆయాశ్రయము, నశించునదిగ నున్నచో దానిని వదలి, ముందురాఁబోవునదేయైనను, నది వృద్ధినొందు స్వభావముగలదగుచో దానినే యాశ్రయింతురుగదా! ఇచట "సర్వోహి" అనునపుడు సర్వశబ్దము ప్రయుక్తమైనది.

పైని సూచించినరీతిని, మహీయసామ్ అని బహువచనమును గాని, సర్వశబ్దమునుగాని ప్రయోగింపమేని, పై వాక్యార్థములయందు భాసింపవలసిన సాధ్యసాధకభావము బాగుగ భాసింపదు. "కిమపేక్ష్య" అను శ్లోకమునందు ప్రకృతిమహీయస్త్వము సమర్థకమగు హేతువు. అన్యసమున్నత్యసహిష్ణుత్వము సాధ్యము. ఆ హేతువునకు సాధ్యముతోనున్న సర్వోపసంహారవ్యాప్తి భాసింపదు. అనఁగా మహాత్ములందఱకును నది లక్షణమను నర్థము భాసింపదు. అందుచే "ప్రకృతిః ఖలు సా మహీయసాం న సహన్తేఽన్య సమున్నతిం యయా" అని పాఠమును మార్చుట యుచితము. సర్వనామ పరామర్శయోగ్యమగు నర్థమును స్వశబ్దముతోఁ జెప్పుటవలన నవాచ్యవచనదోషము కల్గును. (సంగ్రహశ్లోకము 99.)

ఉదా॥ నిశి నాస్తిక స్థితామపి చక్రాహ్వః సహచరీం విలోకయతి
చక్రాహ్వోపి న సహచర మహహో సుదుర్లంఘతానియతేః"

తా॥ రాత్రిసమయమున మగచక్రవాకపక్షి, తన సమీపమునందేయున్నను, తన సహచరిని చూడదు (చూడలేదు.) ఆడు చక్ర

శోకముకూడ నట్లే తన సహచరమగు మగపక్షిని చూడదు. ఆహా ! దైవ మెంత దుర్లంఘ్యమైనది.

ఇందు రెండవ పాదమున చక్రాహ్వసహచరములు సర్వశబ్ద పరామర్శవిషయములుకావు. ముందు వివరించిన న్యాయమునను సరించి, వానిని సర్వనామశబ్దములచే పరామర్శించుట యుచితము. ఆ న్యాయము నంగీకరింపనిచో, చక్రాహ్వ సహచరశబ్దములు పునరుక్తములగును. పునరుక్తిదోషము కల్గుటయే గాక, సర్వనామశబ్దములకు విషయాపహారమే జరుగును. సర్వనామశబ్దప్రయోగమున కవకాశమే యుండదు. పై పద్యమున నట్లు సర్వనామములచే వానిని పరామర్శింపకుండుటచే అవాచ్యవచనము దోషము. అందుచే "విరహావిధురా న సాపి తమ్" అనుపాఠము నంగీకరించుట యుచితము.

ఇటులే,

"పరిపాతిప కేవలం శిశూ నితి తన్నామని మాస్మ విశ్వసీః"

తా॥ 'శిశువులను రక్షించును'-అను అర్థమునిచ్చు నతని నామమును నమ్మకుము. కవి, శిశుపాలశబ్దమునకు వ్యుత్పత్తినిచ్చుట కిట యత్నించి, "శిశూన్ పరిపాతీతి" శిశుపాలః-అను వ్యుత్పత్తిని వివరించినాఁడు. కాని యీవ్యుత్పత్తిననుసరించి "శిశుపరిప"యనుశబ్దమే సిద్ధించును. శిశుపాలశబ్దము సిద్ధింపదు. శిశుపాలుఁడను నామమే ప్రసిద్ధమైనది. శిశుపరిపశబ్దముగాదు. కవి యిచ్చిన వ్యుత్పత్తిననుసరించి, శిశుపాలశబ్దమునకే మార్పు వచ్చుచున్నది. అందుచే "స శిశూన్ కిల పాలయ త్యమూన్" అని పాఠమును సవరించుట మంచిది.

అవాచ్యవచనదోషము-వాచ్యావచనదోషము నిరూపితమైనది. ఇష్టార్థవిపర్యయాత్మకమగు అవాచ్యవచనదోషముగూడ, వాచ్యావచనదోషనిరూపణతో గతార్థమైనట్లు భావింపవచ్చును.

ఉదా॥ సరిత్సముద్రాన్, సరసీశ్చ, గత్వా
రక్షః కపీన్ద్రై రుపపాదితాని
తస్యాపతన్ మూర్ధ్ని జలాని జిష్ణోః
విన్ధ్యస్య మేఘప్రభవా ఇవాపః.

తా॥ నదులకు, సముద్రములకు, సరస్సులకును వెళ్ళి, రాక్షసులు, వానరులును తీసికొనివచ్చినజలములు, జయశీలుఁడగు రాముని శిరసునందు, మేఘమునుండి ప్రభవించిన యుదకములు, విన్ధ్యపర్వత శిరస్సునందువలెఁ బడినవి.

ఇచట విన్ధ్యపర్వతముపై మేఘోదకములుపడినవి. శ్రీరాముని శిరస్సుపై సరిత్సముద్రాదిజలములు పడినవి. ఈ రెండువాక్యార్థములకును నుపమానోపమేయభావమున్నది. కాని రెండు వాక్యార్థములయందును జలమను నొకయర్థమే పర్యాయశబ్దమాత్రభేదమున నుపాత్తమైనది. ఒకచో జలశబ్దము, మఱియొకచో "అప్" (అపః) శబ్దమును నుపాత్తమైనది. పరస్పరము విభిన్నములగు నర్థములకే యుపమానోపమేయభావ ముండవలయును. కాని యిచట నట్లులేదు. అందుచే నిట "నవాచ్య వచనదోషమున్నది." "విన్ధ్యస్యమేఘ ప్రభవాని యద్వత్" అని పఠించుచో నీదోషము పోవును. మూలపాఠమునందు అప్ శబ్దము స్త్రీలింగము. జలశబ్దము నపుంసకలింగము. అందుచే భిన్నలింగత్వమను నుపమాదోషముకూడ నందున్నది. సవరించిన యీపాఠమునందా దోషముకూడ పరిహృతమగును.

"పర్యాయమాత్రభిన్నమైన యొకేవస్తువున కుపమానోపమేయభావమును కల్పించుట యవాచ్యవచనదోషమగును."
(సంగ్రహశ్లోకార్థము 101.)

శ్లోకయుదాహృతి.

ఇయంగేహే లక్ష్మీ రియ మమృతవర్తి ర్నయనయోః
అసా వస్యాస్స్పర్శో వపుషి బహుల శ్చందనరసః
అయం కంఠేబాహుః శిశిరమసృణో మౌక్తిక సరః
కిమస్యా, నప్రేయో, యది పరమసహ్యాస్తు విరహః.

తా॥ శ్రీరాముఁడు తనగొబడిలో, నిదురించుచున్న సీతను, గుఱించి పలుకు వాక్యములివి—ఈమె యింటిలో లక్ష్మి. ఈమె కనుల కమృతవర్తి. ఈ యీమెయొక్క స్పర్శ నాశరీరమున నధికమగు చన్దన రసము. ఈ యీమె బాహువు, నాకంఠమున (నాకంఠమునందలి యీ బాహువు) శిశిరమును మసృణమును (చల్లని, నున్నని) ముత్య ములసరము. విరహమొక్కటి సహింపరానిదికానిచో నీమెకు సంబం ధించినదేది ప్రియమైనదిగాదు ?

పై పద్యమున రెండు మూఁడు నాల్గవపాదములయందు, సీతకు సంబంధించినవిషయములు వర్ణితములైనవి. వానిలో నామెకు సంబం ధించిన దే దైనను విరహము ప్రియముగాదనియు విరహముతక్క, మిగి లినవన్నియు ప్రియములే యనియు వర్ణితమైనది. కాని మొదట పాద మున "ఇయంగేహేలక్ష్మీః, ఇయమమృతవర్తిర్నయనయోః" అనునపు డు, నాయికయే సాక్షాత్తుగ వర్ణితమైనది. విరహమును, తదితరము లును, సీతను సంబంధించినవై యుండఁగా,సీతను సాక్షాత్తుగ వర్ణించుట దోషము. ఆమెకు సంబంధించినవానిలోనే ప్రియములు నప్రియములు నని విభాగము సేయుట కవివివక్షితము. సాక్షాన్నాయికావర్ణనముగాదు. అందుచే సాక్షాద్వర్ణనము దోషము. "ముఖం పూర్ణశ్చంద్రో" "వపుర మృతవర్తిర్నయనయోః" (నా నేత్రముల కామెముఖము పూర్ణచం ద్రుఁడు ఆమెశరీర మమృతవర్తి) అని పాఠమును సవరించుచో నీదో షము తొలఁగును.

ఉదా॥ "శోకానలధూమ సంభార సంభృతాంభోదభరిత
మివ వర్షతి నయనవారి ధారావిసరం శరీరమ్"

అర్థము:—"శోకమనెడు అగ్నియొక్క ధూమసంభారముచే నుత్పన్నమై మేఘములచే నిండినదా యున్నట్లు, శరీరము కన్నీటిధారల సమూహమును వర్షించుచున్నది."

ఇచట శోకమున కౌకానౌక సాధర్మ్యము నాశ్రయించి అగ్నితో నైక్యమారోపితమైనది. అనఁగా శోకమునకును అగ్నికిని రూప్యరూపకభావమువలన రూపకాలంకారమభిహితమైనది. అది యుక్తమే. ధూమమునకు మఱి యే యుపమేయముతో నైక్యమభిహితముగా లేదు. అందుచే నిది యవాచ్యమే-"శోకానల దాహాభీతేవ నహృదయ మవతరతి" (శోకాగ్నియొక్క దాహమునకు భయపడినదేమోయనినట్లు హృదయములోనికి దిగుటలేదు) అను వేఱొక ప్రయోగమునందువలె నిచటఁగూడ నున్నచో బాగుండెడిది. రూప్యము వేఱొకటి యున్నచో నపుడు దోషమేమియును లేదు.

ఉదా॥ "తస్యా ధౌతాంజనశ్యామా హృదయం దహతో౽
నిశమ్, శోకాగ్నేర్ధూమలేఖేవ గలత్యశ్రుకణావలిః"

అర్థము:—ఆమెయొక్క హృదయమును నిరంతరము దహించుచున్న శోకమనెడు అగ్నియొక్క ధూమరేఖయా యనునట్లు కడుగఁబడిన కాటుకచే నల్లనైన యశ్రుకణావలి స్రవించుచున్నది.

ఇచట కాటుకచే నల్లనైన కన్నీటికి సామ్యమును స్ఫురింపఁజేయుటకై ధూమలేఖాపదప్రయోగమిట నుచితముగనే యున్నది. కజ్జలమలినమైన యశ్రుకణావళి యనెడు రూప్య మిచట నుండుటచే, ధూమ పదప్రయోగమున దోషము లేదు.

ఆక్షేపము:—ధూమము అగ్నికి కార్యమగుటచే (అగ్నినుండి

పుట్టినదగుటచే) ధూమశబ్దము "శోకానల సంభార" యనుచోటం గూడ దోషముకాదు.

సమాధానము:—అనవస్థ, అతిప్రసంగము ననుదోషములకవకాశము కల్గుటచే, నచట ధూమశబ్దమవాచ్యమే.

ఉదాహరణాన్తరము:—"తప్తే మహావిరహవహ్ని శిఖావలీభిః
ఆ పాండురం స్తనతటే హృదయే ప్రియాయాః"

అర్థము:—మహావిరహమనెడు అగ్నియొక్క శిఖావలులచేత, ప్రియురాలిహృదయము తప్తముకాఁగా. ఇచట శిఖావలీభిః అను పదము వాచ్యము.

రూపకమునకు ఉపచారసహమైనక్రియ యొకటియే యుండవలయును. ఉదాహరణమునకు-అగ్నికి దాహమనుక్రియ; ఇతరములైన వసంభవమగుటచే, కార్యాదులును పనికిరావు. (సంగ్రహ శ్లోకార్థము 102.)

"దృఢతరనిబద్ధముష్టేః కోశనిషణ్ణస్య సహజమలినస్య
కృపణస్య కృపాణస్యచ కేవల మాకారతో భేదః"

అర్థము:—దృఢతరనిబద్ధముష్టేః=గట్టిపిడికిలి గలట్టియు, కోశనిషణ్ణస్య=ధనమునందే (ధనాగారమునందే)కూర్చుండినట్టియు, సహజమలినస్య=సహజముగనే మలినమైనట్టియు (మంచిస్వభావము లేనట్టియు) కృపణస్య=లోభికి, దృఢ...ముష్టేః=గట్టిపిడిగలట్టియు, కోశనిషణ్ణస్య=ఒరయందున్నట్టియు, సహజముగనే మలినమైనట్టియు (నల్లగనుండు) కృపాణస్యచ=ఖడ్గమునకును, ఆకారతః కేవలమ్ భేదః=

(1) అకారమను నక్షరమువలననే భేదము కనుపడును (కృపణశబ్దమునందు హ్రస్వమైన అకారమున్నది. కృపాణశబ్దమునందు దీర్ఘమైన అకారమున్నది.)

(౨) స్వరూపములోనే భేదము.

ఇచట కృపణునకును, కృపాణమునకును ఆకారమాత్రభేదమని వ్యతిరేకాలంకార మభిహితమైనది. అది అయుక్తము.

ఆకారార్థము రెండు విధములనున్నది. ఒకటి సన్నివేశలక్షణము-అక్షరవిశేషలక్షణము రెండవది. ఇందు మొదటి యర్థమిచట ననుపాదేయమే.

సహావస్థానములేని రెండు విషయములు, ఎప్పుడును కలిసి యుండనేయుండవు. (కృపణ కృపాణముల యాకారము లెప్పుడును భిన్నములే.) అయినపుడు, కృపణ కృపాణములకు సన్నివేశలక్షణ మగు ఆకారమాత్రమున భేదమున్నదనుట సహృదయులగువారికి చమత్కారమును కలిగించువిషయముగాదు.

ఇఁక రెండవ విషయమునుపరిశీలంతము. అక్షరకృతమగు విశేషము శబ్దైకవిషయము. ఆవిశేషము మనుష్యులకుఁగూడ వర్తించు ననుట యసంభవమైన విషయము. అందుచే అక్షరకృతభేదము కృపణ కృపాణములకు వర్తించుననుటయు సమంజసముగాదు.

సందేహము:-"విషయత్వమనాపన్నైః శబ్దైర్నార్థః ప్రకాశ్యతే
న సత్తయైవ తేర్థానామగృహీతాః ప్రకాశకాః"

తా॥ బుద్ధికి విషయములుకాని శబ్దములు అర్థమును ప్రకాశింపఁజేయవు. శబ్దములు శబ్దమాత్రముగ నున్నంతమాత్రమున, బుద్ధి గృహీతములు కానున్నను, అర్థమును తెలుపవు. అను ప్రమాణము గుఱించి స్వరూపముగూడ శబ్దమునకర్థమే యగునుగదా అగుచో నిట కృపణ కృపాణశబ్దస్వరూపములలో భేదమున్నదిగదా? ఇఁక నిట దోషమేమి?

సమాధానము:—సత్యమే అయినను, శబ్దస్వరూప పరమగు నర్థము, ఇట, తాత్పర్యముచే వివక్షితముగాదు. అందుచే నిట 'ఆకార'

శబ్దమునకు, శబ్దస్వరూపరూపమగు ఆకారమును, అర్థముగఁ జెప్పుటకు వీలులేదు. ఒకవేళ, శబ్దస్వరూపార్థము తాత్పర్యవివక్షితమేయని యంగీకరించినను, అదియును శబ్దస్వరూపమేగదా! శబ్దస్వరూపమాత్రముననే భేదమగుచో దృఢతరనిబద్ధముష్టి-ఇత్యాది విశేషణములకు సంగతి ఎట్లు కుదురును? అందుచే నిచట కృపణ కృపాణములకు ఆకారమాత్రభేదమును దెలుపుట చమత్కారావహముకాదు.

వేఱొక యుదాహరణము:—

యేనాలంకృతముద్యానం విహారేణామునా తవ
తేనైవ నిర్వికారేణ కరికుంభ నిభౌ కుచౌ.

అర్థము:—యేన, అమునా, తవ, విహారేణ=ఏ నీయొక్క ఈ విహారముచేత, ఉద్యానమ్, అలంకృతమ్=ఉద్యానవనము అలంకరింపఁబడినదో, నిర్వికారేణ="వి" అను అక్షరము లేని ఆ "విహారముచేతనే" కరికుంభనిభౌ కుచౌ అలంకృతౌ=కరికుంభసమానములగు కుచములు అలంకరింపఁబడినవి.

విహారశబ్దములో, 'వి' తొలఁగిపోయినచో, 'హార'యను శబ్దము మిగులును. నీకుచములు హారములచే నలంకరింపఁబడినవని, కవి యిట చెప్పఁదలచినాఁడు-కాని, 'వి' అను నక్షరము లేని విహారము-శబ్దమే యగును. ఆశబ్దములచే కుచము లలంకృతములగుట పొసగదు. అందుచే ఇచటగూడ అవాచ్యవచనదోషమే యున్నది.

ఈక్రిందివిషయము మాత్రము సమంజసముగనే యున్నది.

"అక్షరాణా మకారోఽహమితియః స్వయ మభ్యధాత్
సోపి త్వయామునా స్వామిన్ ఆకారేణ లఘూకృతః"

తా॥ అక్షరములలో నేను "అకారము" అని శ్రీకృష్ణుఁడు స్వయముగఁ జెప్పినాడు. ఓ స్వామీ, ఆ అకారముగూడ, నీచేత, ఈ ఆకారముచే, అల్పమైనదిగాఁ జేయఁబడినది.

త్రివిక్రముఁడవగు నీ యీ స్వరూపముచే ఆ అకారస్వరూపము అల్పముగఁ జేయబడినది. అని యొక యర్థము. ఆకారము అనఁగా ఆ అను అక్షరము. 'ఆ' యను నక్షరముచే అకారము లఘువుగాఁ జేయఁబడినది. అనియు నిట నర్థము. అకారము ఆకారము రెండును శబ్ద స్వరూపము లేయగుటచేతను అకారము లఘువు, ఆకారము గురువు అగుటచేతను, అకారము, ఆకారముచే లఘూకృతమైనదనుట యుక్తముగనే యున్నది. "దృఢతర నిబద్ధముష్టేః" "యేనాలంకృతమ్ ఉద్యానమ్" అను శ్లోకములలో, అక్షరవిశేషాత్మమగు ఆకారభేదమే లక్షణముగాఁగల శబ్దధర్మము అర్థమునకు విశేషణముగాఁ జెప్పఁబడినది. అట్లు చెప్పుట కూడదు. అందుచే అవాచ్య వచనదోషము వచ్చినది.

యద్య ప్యర్థావుభౌ శబ్దః క్రమేణాభి దధాత్యయమ్
స్వరూపంచార్థరూపంచ తథాప్యస్యాభిధాక్రియా (103)
తత్పరత్వా ద్వివక్షాయా విశ్రామ్యత్యర్థ ఏవ హి
భిన్నధర్మతయా తేన భిన్న కక్ష్యతయాపిచ. (104)
నార్థాత్ జాతుచిదిమౌ శ్లిష్టమేకం విశేషణమ్
మాభూదేకాత్మతాపత్తి దోషోఽనయోరితి. (105)

సంగ్రహశ్లోకములు.

తా॥ శబ్దము, స్వరూపము, అర్థరూపము, అను రెండర్థములను, క్రమముగఁ జెప్పును. కాని కవి వివక్ష అర్థముగనే యుండుటచే శబ్దమునకున్న అభిధాశక్తియు, అర్థమునందే విశ్రమించును. అనఁగా అర్థస్వరూపమగు నర్థమునే చెప్పి విరమించును. స్వరూపపరమగు నర్థమును చెప్పదు. వానిలో ఒకటి శబ్దస్వరూపము. ఒకటి అర్థస్వరూపము. ఆ రెండును పరస్పరభిన్నధర్మములు గలవి. అందులో నొకటి కార్యకారి. వేఱొకటి కార్యకారికాదు. అందుచే నవి భిన్నకక్ష్యలకు

సంబంధించినవియు నగును. ఇట్లు భిన్నధర్మములు, భిన్నకర్తృలు కలవి యగుటచే నారెండును నెప్పుడును శ్లిష్టమై ఏకరూపముగనుండి విశేషణముగ నన్వయింపవు. అట్లన్వయించుచో శబ్దార్థము లేక రూపము కావలసివచ్చును. అట్లగుట దోషము.

ఉదా॥ "యమిన్ద్రశబ్దార్థనిషూదనం హరేః

హిరణ్యపూర్వం కశిపుం ప్రచక్షతే" (శిశుపాలవధ 1-42)

అర్థము:—హరేః=ఇంద్రునియొక్క, ఇన్ద్రశబ్దార్థనిషూదనమ్=ఇంద్రశబ్దమునకుఁగల యర్థమును నాశనముసేయు (ఇన్ద్రశబ్దమునకు పరమైశ్వర్యమని యర్థము.-ఆయర్థమును తొలగఁజేయు-అనఁగా ఇంద్రునియొక్క యైశ్వర్యము నపహరించు-అని యర్థము) యమ్=ఏ రాక్షసుని, హిరణ్యపూర్వం, కశిపుమ్=హిరణ్య అనుశబ్దము, పూర్వమందుఁగల కశిపుమ్='కశిపు' అను శబ్దముగా ప్రచక్షతే=చెప్పుదురో-హిరణ్యకశిపుఁడని యందురో అనియర్థము.

ఇచట 'హిరణ్యకశిపు'అని చెప్పుటకుబదులు "హిరణ్యపూర్వం కశిపుమ్' అని చెప్పుటవలన అవాచ్యవచనదోషము వచ్చునది.

ఇచట హిరణ్యశబ్దము కశిపుశబ్దము అభిధేయ ప్రధానములా? స్వరూపమాత్రప్రధానములా ?-అభిధేయప్రధానములగుచో నర్థమునకు సమన్వయముండదు. హిరణ్యశబ్దమునకు బంగారమర్థము. కశిపు శబ్దమునకు శయ్య అర్థము. ఈయర్థములు హిరణ్యకసిపుఁడను రాక్షసుని బోధింపవు. అందుచే వీనికి ప్రస్తుతార్థసమన్వయము లేదు. కావున నివి యభిధేయప్రధానములనుటకు వీలులేదు. ఇంకొక దోషముకూడ నున్నది. కశిపుశబ్దము నపుంసకలింగము. అపుడు "కశిపు" అని మాత్రమే శబ్దముండవలయును కశిపుమ్-అని యుండఁగూడదు. అందువలనఁగూడ నీశబ్దములు అభిధేయప్రధానములనుటకు వీలు లేదు.

స్వరూప పరిధానములనుటకును వీలులేదు. హిరణ్యకశిపుఁడను రాక్షసుని, ఎవరును 'హిరణ్య పూర్వ కశిపుఁడు' అని పిలుచుట లేదు గదా! అతనిపేరున కిది యనుకరణము గానేఁ అదుగదా!

శబ్దానుకరణము రెండు విధములు:—(1) శాబ్దము (2) ఆర్థము. ఇతి అను శబ్దముతో వ్యవచ్ఛేదమున్నచో శాబ్దమగు అనుకరణమను విషయము ప్రసిద్ధమే. (రామ ఇతి-అనునపుడు-రామశబ్దమున కను కరణమున్నది.)

అర్థమువలననే ఎచట వ్యవచ్ఛేదము కలుగునో అచట ఆర్థము-అనుకరణము.

ఉదా:—"మహదపి పరదుఃఖం శీతలం సమ్యగాహుః"

అర్థము:—ఇతరులదుఃఖము గొప్పదైనను, హాయిగనే యున్న ది. అందురు. ఇచట అర్థమువలననే, ఇది అనుకరణమని తెలియుచుం డుటచే "ఇతి" (=అని) అను శబ్దము లేదు. ప్రస్తుతము "హిరణ్య పూర్వం కశిపుమ్" అనునపుడు, ఇతిశబ్దము లేదు. అందుచే నిచట ఆర్థ మగు అనుకరణమున్నది. ఇచట ఆరాక్షసుని నామమునకే యనుకర ణముండవలయును. కాని యది యనుకృతముకాలేదు-అనుకృతమైన 'హిరణ్యపూర్వం కశిపుమ్' అనునది అతనికి నామముకాదు. లోకము నందతనికిహిరణ్యకశిపుఁడనియేనామముగాని, హిరణ్యపూర్వకశిపుఁడను నామము లేదు. అందుచే నిట నవాచ్యవచనదోషమున్నది.

ఉదా॥ "క్షుణ్ణామ్ యద న్తఃకరణేన వృక్షాః
ఫలన్తి కల్పోపదాస్తదేవ".

కల్పోపదాః వృక్షాః-కల్ప అను ఉపపదముగల వృక్షములు-కల్పవృక్షములనుటకు బదులుగ కల్పోపదాః వృక్షాః అని యున్నది. ఇచటఁగూడ ఇతిశబ్దము లేదు. అందుచే ఆర్థానుకరణమున్నది-కల్పవృ క్షములకు "కల్పోపదాః వృక్షాః" అని పేరులేదు. అందుచే అవాచ్య వచనము దోషము.

"తేభ్యణ్ణాం యద న్తఃకరణేన నామ తదేవ కల్పద్రుమకాః ఫలన్తి".

అని సవరించుచో ఆదోషము తొలఁగును. ఈవాక్యమునకు— "మనసున తలఁచినవానినే కల్పవృక్షములిచ్చును."-అని యర్థము. ప్రస్తుతము స్తుతింపఁబడుచున్న రాజు, మనసున తలఁపనివానినిగూడ నిచ్చును. అందుచే రాజుయొక్క ఘనత సూచితము. మొదటి పాద మున, అపేక్షితమైన యర్థమునే కల్పవృక్షమిచ్చుననుటవలన, కల్ప వృక్షమిచ్చు "అర్థమునందు తిరస్కారభావము, అవజ్ఞ భాసించును. రెండవపాదమునందు కల్పద్రుమకాః" అనుటవలన, కల్పద్రుమశబ్దము తరువాత "క" ప్రత్యయము ఉన్నది. ఇది అవజ్ఞార్థమును సూచించును. అందుచే, ఈరెండవపాదమున కల్పవృక్షములిచ్చు వస్తువులేగాక, కల్ప వృక్షములుగూడ నీచములేయనుభావముగూడ సూచితమగుచున్నది. అందుచే ఈపాదమునందు గుణాన్తరలాభమున్నది.

"దశపూర్వరథం యమాఖ్యయా' దశకంఠారిగురుం ప్రచక్షతే".

ఇచట దశరథుఁడనుటకు బదులు దశపూర్వరథుఁడని యున్నది. అందుచే అవాచ్యవచనము దోషము.

"తయా ఘర్మభాన స్తనయాపి శీతలైః
స్వసా య మస్యాపి జనస్య జీవనైః
కృష్ణాపి శుద్ధే రధికం విధాత్మభిః
విహన్తు మంహాంసి జలైః పటీయసీ".

తా॥ యమునానది, తీక్ష్ణకిరణుని తనయయైనను, యముని సోదరియైనను, నల్లనిదైనను, (క్రమముగా) శీతలములైనట్టియు, ప్రాణ మునిచ్చునట్టియు, పవిత్రముచేయునట్టియు జలములచే జనుల పాపము లను పోఁగొట్టుటలో సమర్థమైనది.

తీక్ష్ణకిరణుని తనయయైనను, శీతలజలములచే పాపములను పోఁగొట్టునను వాక్యమునందు, విరోధము స్ఫురింపవలయునని కవియుద్దే

శము. తీక్ష్ణకిరణతనయాత్వము శీతలత్వము అను ధర్మములు ఒకేవస్తువు నాశ్రయించియున్నపుడే ఆవిరోధము భాసించును-ఆధర్మములు భిన్నాశ్రయములైనపుడు విరోధకథన ముపపన్నముకాదు. ప్రస్తుతము తీక్ష్ణకిరణతనయాత్వము మొదలగునవి యమున నాశ్రయించియున్నవి. శీతలత్వాదికములు జలము నాశ్రయించినవి. ఇట్లు భిన్నాశ్రయములైనవానికి విరోధభాన ముపపన్నముగాదు. యమునకును, తజ్జలములకును తాత్త్వికమగు నైక్యమున్నదనుట సత్యమే. అయినను యమునార్థప్రతిపాదకశబ్దములు కర్తలుగను, జలార్థకశబ్దము కరణముగను నిచట నిర్దిష్టములైనవి. అందుచే శాబ్దమగు భిన్నత్వముండనేయున్నది. కవికి శాబ్దమగు విధము చెప్పుటయే యిష్టము. కాని శాబ్దముగ ఆ ధర్మములకేకాశ్రయత్వము సిద్ధింపలేదు. అందుచే ఇచట అవాచ్యవచనము దోషము. పాఠము నీక్రిందివిధముగ సవరించుట మంచిది.

"యా ఘర్మభానస్తనయాపి శీతలాస్వసా యమస్యాపిజనస్య జీవనీ
కృష్ణాపి శుద్ధేరధికం విధాయినీ విహన్తుమంహాంసి జలైః పటీయసీ"

వేఱొకయుదాహరణము:—"రురుచే హిమాచల గుహాముఖోన్ముఖః
పయసాం ప్రవాహ ఇవ సౌరసైంధవః"

తా॥ హిమాచల గుహాముఖోన్ముఖమైన, సౌరసైంధవమైన (గంగానదినుండి పుట్టిన) నీటియొక్క ప్రవాహమువలె ప్రకాశించెను.

ఇచట 'పయసాం' (నీటియొక్క అను శబ్దము "ప్రవాహ" శబ్దమునకు విశేషణముగా నుపయుక్తమైనది. ('నీటికి సంబంధించిన' అను నర్థమునిచ్చుటచే నది ప్రవాహమునకు విశేషణము) ప్రవాహమను నది ఎప్పుడును నీటికి సంబంధించినదిగనే యుండును. అందుచే ఆవిషయమును చెప్పుట వ్యర్థము. "సౌరసైంధవః" అనునదియు ప్రవాహమునకు విశేషణము-సురసింధోః భవః-అనునర్థమున తద్ధితప్రత్యయము ఉపయుక్తము-షష్ఠీ విభక్తినిమాత్రమే యుపయోగించినను, ఆయర్థము

భాసించును. అందుచే తద్ధితప్రత్యయము నుపయోగించుటయు వ్యర్థమే-అందుచే "సుమహాన్ ప్రవాహా ఇవ జహ్నుజన్మనః" అని పాఠముంచుట యుక్తము.

ఉదాహరణాన్తరము:—

"లక్ష్యీకృతస్య హరిణస్య హరిప్రభావః
ప్రేక్ష్యస్థితాం సహచరీం వ్యవధాయ దేహమ్
ఆకర్ణకృష్టమపి కామితయా స ధన్వీ
బాణం కృపామృదుమనాః ప్రతిసంజహార".

తా॥ దశరథుఁడు ఒక మగలేడిని కొట్టుటకై, ఆలేడిని లక్ష్యము చేసికొని, ధనువును ఆకర్ణాన్తము లాగినాఁడు. ఆడులేడి, ఆ మగలేడి శరీరమునకడ్డుగ నిలిచినది. ఆసన్నివేశమును దశరథుఁడు చూచినాఁడు. అతనియందును కామిత్వమున్నది. అందుచే 'కృపామృదుమనస్కుఁడై' ఆతఁడు బాణమును ఉపసంహరించినాఁడు. ఇచట-కృపయనునది మనోధర్మమే. అందుచే మనశ్శబ్దమును చెప్పుట వ్యర్థము. అవాచ్యము యొక్క వచనమున్నది.

"రహయిష్యతి తం లక్ష్మీః నయవిముఖో నాపదాంపదాం క ఇవ
పచ తవ రిపురేవమతో భావీ తస్యాపి తద్విరహః

అర్థము:—అతనిని లక్ష్మి వదలివేయును. నీతివిముఖుఁ డెవఁడాపదలకు నిలయముకాఁడు ? ఆ నీ శత్రువటువంటివాఁడు. అతనినికూడ లక్ష్మి వదలివేయును.

విశేషవ్యాఖ్య:—పరార్థానుమానమునందు అయిదు వాక్యములుండును. ఉదా॥ (1) పర్వతమున అగ్నియున్నది; (2) పొగ యుండుటవలన (3) ఎచట నెచట పొగయుండునో అచట నచట అగ్ని యుండును-పొయ్యయందువలె-(4) ఈపర్వతమునఁగూడ పొగయున్నది. (5) అందుచే పర్వతమునందును అగ్నియున్నది. ఈపైదువాక్యములను

క్రమముగ, ప్రతిజ్ఞా, హేతు, ఉదాహరణ, ఉపనయ, నిగమనవాక్యములందురు.

ప్రస్తుత పద్యమున ప్రతిజ్ఞానిగమనవాక్యములు రెండును నున్నవి. ఈరెండును పునరుక్తము లే-ప్రసిద్ధమైన సాహచర్య నియమముగల హేతువు (పొగ) ధర్మియందు (పర్వతాదులయందు) ఉన్నదని చెప్పినంతనే, (పర్వతమున ధూమమున్నది అని చెప్పినంతనే) ప్రతిజ్ఞా, నిగమనవాక్యార్థములు రెండును సిద్ధించితీరును- ఈవిషయమునే యీవాక్యము తెల్పును. "ప్రతిజ్ఞాయా ఏవ తావద్గమ్యమానార్థాయా వచనం పునర్వచనం కింపునరస్యాః పునర్వచన మిత్యపార్థకం నిగమనమ్" (అర్థము-గమ్యమానార్థకమగు ప్రతిజ్ఞావచనమును చెప్పుటయే పునరుక్తియగును- ఈప్రతిజ్ఞావాక్యార్థమునే బోధించు నిగమనవాక్యమును ప్రయోగించుట, పునరుక్తియగునని వేఱుగఁ జెప్పవలయునా ? కావున నిగమనవాక్య మపార్థకము.)

ఈక్రిందియుదాహరణమున నీదోషము లేదు.

"యో యత్ర-థాప్రసంగే భిన్నభిన్నాయతోష్ణ నిశ్వసితః
సభవతి తంప్రతి రక్తః త్వంచ తథా దృశ్యసే సుతను".

అర్థము:—ఎవరిప్రసంగము వచ్చినప్పుడు, ఎవరి నిట్టూర్పులు భిన్నభిన్నములు ఆయతములు, ఉష్ణములునగునో, వారికి వారియందనురక్తి యుండును. ఓ బాలా, నీవా, అట్లు కనఁబడుచున్నావు. "—ఇచట "రక్తః" అనునంతవఱకు 'వ్యాప్తి' యున్నది. "త్వంచ తథా దృశ్యసి" అను వాక్యమున వ్యాప్తివిశిష్టహేతువు ధర్మియగు బాలయం దుపసంహృతమైనది. ప్రతిజ్ఞానిగమనములు రెండే లేవు. అందుచే పునరుక్తి లేదు.

ప్రతిబింబమును చూచినవానికి బింబజ్ఞానము కలుగును. అటులే అప్రస్తుతార్థమువలననే, ప్రస్తుతార్థము స్ఫురించుచో, ప్రస్తుతార్థ

మును చెప్పనక్కఅయే లేదు. చెప్పినచో అవాచ్యవచనదోషము కల్గును.

ఉదా॥ ఆహూ తేషు విహంగమేషు మశకో నాయాన్ పురోవార్యతే
మధ్యే వారిధి వా వసన్ తృణమణిర్ధత్తే మణీనాం పదమ్
ఖద్యోతోపి నకంపతే ప్రచలితుం మధ్యేఽపి తేజస్వినామ్
ధిక్ సామాన్యమచేతనమ్ ప్రభుమివానామృష్టతత్త్వాన్తరమ్.

అర్థము:—విహంగములను పిలిచినపుడు, మశకము ముందు వచ్చుచున్నను, అడ్డగింపఁబడదు-సముద్రమధ్యమునను న్నను, తృణమణి (నీలము) మణులస్థానము నాశ్రయించును. (మణియనియే పిలువఁబడును) తేజస్సంపన్నులమధ్యనున్నను, ఖద్యోతముగూడ చలింపదు. అనామృష్టతత్త్వాన్తరుఁడగు ప్రభువవలె, అచేతనమగు సామాన్య వస్తువు నింద్యమే. ఇచట "ప్రభుమివ" అని యుపమానభావము ప్రతిపాదితమైనది.-అప్రస్తుతములగు పై వాక్యార్థములనుండియే యీ యుపమానభావము స్ఫురించుచుంట, నీ యౌపమ్యమును చెప్పుట పునరుక్తమగుచున్నది.

దర్పిణిమాపది భూషణముత్సవే। శరణమాత్మభయే నిశి దీపకః
బహు విధార్థ్యుపకారభరక్షమో। భవతికోపి భవానివ సన్మణిః"

అర్థము:—ఒక మంచిమణి, నీవలె, ఆపదయందు ధనము ఉత్సవమునందు భూషణము, ఆత్మభయమునందు రక్షకము, రాత్రియందు దీపము-ఇటుల అనేకవిధముల యాచకులగువారికి ఉపకారముచేయ సమర్థమైయుండును.

ఇచట నీవలె భవదర్థమున నుపమానభావమును కూర్చుట పౌనరుక్త్యము. ప్రస్తుతమునుండి యప్రస్తుతవిషయము,ఏదియో యొక యాధారము లేనిదే భాసింపదు కావున నట్టితావున నప్రస్తుతమును చెప్పుట యుక్తమే.

ఉదా:—నిమ్నమున్నతమనస్థితంచలంవక్రమార్జవగుణాన్వితంచయత్
సర్వమేవ తమసా సమీకృతం ధిక్ మహత్త్వమసతాం హతాన్తరమ్.

అర్థము:—ఎత్తు, పల్లము, స్థిరముగనున్నది, కదలుచున్నది, వంకరగనున్నది, సూటిగనున్నది,-చీకటి వీనినన్నిటిని సమానముచేయును. భేదదృష్టిలేని, (సదసద్వివేకములేని) అసత్పురుషులయొక్క మహత్త్వము నింద్యము

ఇచట చీకటివిషయము ప్రస్తుతము. దీనినుండి అసత్పురుషుల యొక్క మహత్త్వము భాసించుటకవకాశము లేదు-అందుచే ఆవిషయమును చెప్పి తీరవలయును. కావున నిచట అవాచ్యవచనదోషముండదు. ప్రస్తుతాప్రస్తుతములకు సంబంధించిన యీవిషయమునే ఈక్రింది సంగ్రహశ్లోకములు చెప్పును.

"అప్రస్తుతోక్తి సామర్థ్యాత్ ప్రస్తుతం యత్ర గమ్యతే
ప్రతిబింబాద్యథాబింబం తస్యోక్తిస్తత్ర నేష్యతే. (106)
ప్రస్తుతాత్తు తదన్యస్య ప్రతీతి రసబంధనా
నసంభవత్యేవ తతః తదుక్తిస్తత్ర శస్యతే. (107)

అప్రస్తుత ప్రశంసాలంకారవిషయమున నింకొక యంశమును గ్రహింపవలయును; ప్రస్తుతార్థమునకుత్కర్షను చెప్పనెంచి, కవి, శ్లేషముఖమున, సహజముగ అప్రస్తుతార్థమునందులేని, ఉత్కర్షముగాని, అపకర్షముగాని, ఆయప్రస్తుతార్థమునందున్నట్లు వర్ణించును. ఈ వర్ణనము తాత్త్వికముగాదు. కానందువలనను, ప్రస్తుతాప్రస్తుతములకు బింబ ప్రతిబింబభావ మున్నందువలనను, అప్రస్తుతార్థమునందు లేని యుత్కర్షాపకర్షలు, ప్రస్తుతార్థమునందు భాసింపవు. అందువలన నట్లు వర్ణింపఁగూడదు. వర్ణించినచో దోషముగును. అందుత్కర్ష కుదాహరణము.

"సద్వృత్తే మహతి స్వభావసరలే బద్ధోఽసి యస్మిన్ గుణైః
యుక్తే సంయమహేతుతాముపగతే యత్రాపి విశ్రామ్యసి
తస్యాక్షేపపరంపరాభిరభితో దోలాయమానస్థితేః
ఆలానస్య మతంగజైష కతమో నిర్మూలనే దుర్గ్రహః"

అర్థము:—మతంగజ !=ఓ గజమా ! సద్వృత్తే=గుండ్రముగ నున్నట్టియు, (మంచినడవడిగలట్టియు) మహతి=పెద్దదైనట్టియు (గొప్పదైన) స్వభావసరలే=సహజముగ సరలముగ-వంకరలేకయున్న (స్వభావముచే సరళమైన, యస్మిన్=ఏ వృక్షమునందు బద్ధోఽసి=బంధింపఁబడితివో (ఏ మహాపురుషు నాశ్రయించితివో) గుణైఃయుక్తే=త్రాళ్ళతోఁ గూడినట్టియు, సంయమహేతుతాముపగతే=బంధనకారణమైనట్టియు యత్రాపి=ఏ చెట్టునీడను, (ఏ మహాపురుషునియొద్ద) విశ్రామ్యసి=విశ్రమించుచున్నావో, తస్య=ఆ, ఆక్షేపపరంపరాభిః, అభితః, దోలాయమానస్థితేః=మాటిమాటికి అటునిటు ఊఁపుటచేత-లేక ప్రహార పరంపరలచేత కదలుచున్న, (నిన్దాపరంపరలచే స్థిరతను కోల్పోయిన) ఆలానస్య=నీబంధనమున కాశ్రయమైన వృక్షముయొక్క, (నీకాశ్రయమిచ్చిన మహాపురుషునియొక్క), నిర్మూలనే=పెకలించుటయందు (నాశనముసేయుటయందు ఏష దుర్గ్రహః కతమః ?=ఈ దురాగ్రహమేమి ? (మంచిదికాదనిభావము) ఇచట అప్రస్తుతమైన యర్థము-ఆలానము-(కట్టుకొయ్య-వృక్షము)-వాస్తవమున నది గజమునకు బంధనహేతువగుటచే, పీడాకరము-కాని శ్లేషబలమువలన, సద్వృత్తాది పదములకు, సదాచారత్వాది ధర్మసంబంధ మహాయాలానమున కభిహితమైనది-ఇది వాస్తవముగాదు. అందుచే నాయాలానమును ఉన్మూలింపవలయునను దురాగ్రహము గజమునకుండుట యుచితమే. అది దుష్టముగాదు. అయినపు డాయేనుఁగును నిందించుట కవకాశమే లేదు.

ఇచట అప్రస్తుతార్థము బింబమువంటిది. బింబమువంటి గజమునందు లేని యుత్కర్షము, దర్పణమువంటి ప్రస్తుతార్థమునందెట్లు ప్రతిబింబించును ?-ప్రతిబింబింపదు. ఇట్లు అవాచ్యమగు శ్లేషోత్కర్షను చెప్పుట దోషమగుచున్నది. కావున, శ్లేషను లెక్కసేయకయే, ఆకాంక్షారహితమైన 'కాకు' శబ్దమును గ్రహించినరీతిని, కిం శబ్దమునకు వ్యాఖ్యానము సేయవలయును. అపుడు "కతమోనిర్మూలనేదుర్గ్రహః"-అనుచో, న ఖలు కశ్చిత్ ఇత్యుచిత ఏవాయం నిర్మూలనే అభినివేశస్తవ" నిర్మూలనము సేయుటలో దురాగ్రహమేమున్నది ?- అను వాక్యమునకు దురాగ్రహమేమియును లేదు. అందుచే వృక్షనిర్మూలనమునందలి నీయభినివేశము (పట్టుదల) యుచితమైనదియే-యను నర్థము ప్రతీతమగును-అపకర్ష విషయమునఁగూడ నిట్లే పరిశీలింపవలయును.

సర్వనామ పరామృష్టమైన యర్థమును తిరిగి స్వశబ్దముచేఁ జెప్పుటయు-అవాచ్యవచనదోషమే యగును.-ఉదా॥ ఉదన్వద్భిన్నా భూస్సచ నిధిరపాం యోజనశతమ్. భూః=భూమి, ఉదన్వత్ భిన్నా=సముద్రముచే, భిన్నమైనది; సః అపాంనిధిఃచ=ఆసముద్రమును-యోజనశతమ్=నూఱు యోజనములున్నది. ఇచట "అపాంనిధిః" అని తిరిగి చెప్పుటవలన, అవాచ్యవచనము దోషము.

సమాసోక్తివలననే ఏయర్థమునకు ఉపమానభావము నిశ్చితమగునో, ఆయర్థమునకు ఉపమానభావమును తిరిగి చెప్పినను అవాచ్యవచనమే దోషము.

ఉదా॥ అలిభి రంజన బిందు మనోహరైః కుసుమ పంక్తినిపాతిభిరంకితః
నఖలు శోభయతి, స్మ, వనస్థలీమ్ న, తిలకస్తిలకః, ప్రమదామివ.

అర్థము:—పుష్పపంక్తులయందు వ్రాలుచున్నట్టియు, కాటుకయొక్క బిందువులవలె మనోహరమైనట్టియు, తేనెటీగలచే గుర్తింపఁబడిన తిలకమను వృక్షము, తిలకము (బొట్టు) ప్రమదను (స్త్రీని) వలె, వనస్థలిని, అలంకరించుటలేదని కాదు. (అలంకరించుచునే యున్న

దని భావము). ఇచట తిలకప్రమదాశబ్దములలో నొకశబ్దమును మాత్రమే చెప్పవలసియున్నను, రెండు శబ్దములుగూడ నభిభిహితములైనవి. అందుచే అవాచ్యవచనము దోషము. గండోపరిపిటకమువలె, (పుండుపై పుంటువలె-గోరుచుట్టుపై రోకంటిపోటువలె) కొందఱు కవులు, ఇటువంటితావులలో, అర్థసామర్థ్యాక్షిప్తమగు నుపమానత్వమును రచించుచున్నారు. ఆకవులకు నమస్కారము.

ఉదా॥ జంఘాకాండోరునాలో నఖకిరణలసత్కేసరాలీ కరాలః
ప్రత్యగ్రాలక్తకాభ ప్రసరకిసలయో మంజుమంజీర భృంగః
భర్తుః నృత్తానుకారే జయతి నిజతను స్వచ్ఛ లావణ్యవాపీ
సంభూతాంభోజశోభాం విదధదభినవో దండపాదో భవాన్యాః.

అర్థము:—జంఘాకాండమనెడు (పిక్క) పెద్ద తామరతూడు గలట్టియు, నఖకిరణములనెడు ప్రకాశించుచున్న కింజల్కములు గలట్టియు, క్రొత్తలక్క (పాదములకు పూసికొనెడు-అలక్తము)యొక్క కాంతియనెడు చిగురుటాకు గలట్టియు, మనోహరమైన మంజీరమనెడు (కాలి అందెయనెడు) భృంగముగలట్టియు, తన శరీరముయొక్క స్వచ్ఛమగు లావణ్యమనెడు భావియందు పుట్టిన పద్మముయొక్క శోభను ధరించుచున్నట్టియు, అభినవమైనట్టియు, భవానియొక్క, శివనృత్తానుకరణకాలమునందలి,దండపాదము, సర్వోత్కృష్టముగనున్నది. (జయించుచున్నది)-ఇచట సమాసోక్తినుండియే,దండపాదమున కంభోజతుల్యత్వ మవగతమగుచున్నది. అయినను, కవి తిరిగి "అంభోజశోభను ధరించుచు" అని చెప్పినాడు. అందుచే నిచట అవాచ్యవచనము దోషము.

అంతలో నిచట పద్మమున కర్థసామర్థ్యాక్షిప్తమైన యుపమానత్వము ప్రాప్తమైనది. అదియు నయుక్తమే. సమాసమునందంతర్భూతమైన అంభోజశబ్దమునకు, ఊరునాలత్వాది ధర్మసంబాధయోగ్యత యుపపన్నముకాదుగదా! సమాసాన్తర్భూతమైన యీయంభోజశబ్దమునకు 'వాపీ సంభూత'-అను నొకపదముతోనే విశేషణ విశేష్య

భావ ముపపన్నమగును. వాస్తవమున నింతకుముందే వివరించినట్లు, ఇచట ప్రక్రమభంగదోషప్రసక్తియున్నది. అందుచే నిచట సమాసమే సిద్ధింపదని సహృదయులగువారికి భాసించుచున్నది.

ప్రశ్న:—దండపాదమునకు ఊరునాలత్వాదులతో సంబంధము ఘటింపవచ్చునుగదా ?

సమాధానము:—దండపాదమునకు ఉరునాలత్వాదులతో విశేషణ విశేష్యభావ ముపపన్నముగాదు—కావున నిచట నంభోజమునకు శాబ్దముగ నుపమానత్వమును జెప్పవలయును. లేదా దండపాదమున కంభోజత్వరూపణమునైన సేయవలయును. అపుడీ యంభోజమునకు ప్రాధాన్యము కలిగి విశేషణసంబంధోపగమయోగ్యత లభించును.

ఇచట పార్వతి శివునియొక్క నృత్తమును అనుకరించుచున్నది. శివుని నృత్తము ఉద్ధతమైనది. అది తాండవనృత్తము. ఆతాండవనృత్తమునందు పాదము దండాకారముగనే యుండవలయును. లేనిచో తాండవనృత్తానుకరణమే ఘటింపదు. పార్వతి, శివుని తాండవము ననుకరించుచు అభినయించుచున్నదని, యెప్పుడు చెప్పితిమో, అప్పుడే పాదమునకు దండాకారత ఘటించినట్లే. కావున నిచట దండాకారతను తెల్పుటకు "దండ" అను పదమును ప్రయోగింపనక్కఱయే లేదు—జంఘాకాండోరునాలత్వమును పాదమునకెపుడు విశేషణముగా వర్ణించితిమో అపుడు పాదమునకు దండాకారత్వము సిద్ధించితీరవలయును. పాదము దండాకారముగ నుండనిచో జంఘాకాండము నాళమగుట ఘటింపదు. ఈ దండాకారత పాదమున కభినవమే యగును. సహజసిద్ధముగాదు. ఇట్లు, ఉరునాలత్వవైశిష్ట్యమువలననే దండాకారతయందలి యభినవతయు సిద్ధించుచున్నది. కావున నిచట "దండ—అభినవ" పదములు రెండును పునరుక్తములై యవాచ్యమువే యగుచున్నవి. ఉపాదేయములుగావు. కావున నిట్లు సవరించుట మంచిది.

(సశేషము)

ఆంధ్రసాహిత్యపరిషత్తు

తాత్కాలిక కార్యకర్తలు

విమర్శకాగ్రేసర, ఐతిహాసిక సమ్రాట్టు

శ్రీ బండారు తమయ్య

ప్రధాన కార్యదర్శి, కోశాధికారి

శ్రీ దంటు భాస్కరరావు

సహాయ కార్యదర్శి

శ్రీ దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి

కార్యనిర్వాహకవర్గ సభ్యులు

1. శ్రీ కోకా శివనాథశాస్త్రి
2. శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రి (బాలవ్యాస)
3. శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి (వ్యాకరణవిద్యాప్రవీణ, భాషాప్రవీణ)
4. శ్రీ కాకరపర్తి కృష్ణశాస్త్రి (కవిమూర్ధన్య, ప్రౌఢకవిచంద్ర)
5. శ్రీ కుందూరి ఈశ్వరదత్తు
6. శ్రీ జయంతి బుచ్చిరామశర్మ
7. డాక్టరు శ్రీ ఇవటూరి జోగారావు, (యం. బి. బి. యస్.,)
8. శ్రీ చిరువోలు కోటీశ్వరరావు
9. శ్రీ దామెర రాజగోపాలరావు, బి. ఏ.
10. శ్రీ వేదుల రామచంద్రకీర్తి, బి. ఏ. (ఆనర్సు)
11. శ్రీ ఓలేటి సుబ్బరాయశాస్త్రి (ఉభయభాషాప్రవీణ)
12. శ్రీ కావలి శ్రీరామమూర్తి, బి. ఎ. బి. ఎల్.

పత్రికా సంపాదకుడు

శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి

ఆంధ్రసాహిత్యపరిషత్ప్రచురణములు

శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు

1వ సంపుటము	...	రు 6—0—0
2వ సంపుటము	...	6—0—0
3వ సంపుటము	...	6—0—0
4వ సంపుటము	...	6—0—0
5వ సంపుటము	...	10—0—0
6వ సంపుటము	...	10—0—0
7వ సంపుటము	...	[ముద్రణములో నున్నది]

కవిజనాశ్రయము

వేములవాడ భీమకవి విరచితము.

పెక్కు పాఠభేదములతోఁ గూడిన వెనుకటివిషయ మంతయుఁ గలిసి తిరిగి తృతీయముద్రణ పీఠికతో ముద్రితమైనది వెల రు 1—50.

మాధ్యమిక కారికలు

బౌద్ధాచార్య నాగార్జున ప్రణీతము. కొల్లూరు సోమశేఖర శాస్త్రి విరచిత సుబోధినీవ్యాఖ్యాసహితము మూల్యము రు. 2—.50

ఆంధ్రసాహిత్యపరిషత్తు,
కాకినాడ.

Printed by J. Gopalam, B.A, L.T., at Republic Press, Kakinada
Edited by **C. PAPAIAHSASTRY**
Published by Andhra Sahitya Parishat, Kakinada .